
RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:174 హైదరాబాద్, గురువారం, 9 జనవరి 2025 పేజీలు: 12 వెల: 1.00

## చంద్రబాబు లక్ష్యాలకు ఎప్పుడూ అండగా ఉంటాం: ప్రధాని మోదీ

%విశాఖపట్నం: ముఖ్యమంత్రి చంద్రబాబు పెట్టుకున్న లక్ష్యాలకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భరోసా ఇచ్చారు. ఏపీలో రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా విశాఖ ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ప్రజల ఆశలు, ఆశయాల సాధనకు మద్దతుగా నిలుస్తామని మోదీ హామీ ఇచ్చారు.



"ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు. మీ ఆశీర్వాదంతో 60 ఏళ్ల తర్వాత తొలిసారి మేం మూడోసారి అధికారంలోకి వచ్చాం. రాష్ట్రానికి అన్ని రంగాల్లో మద్దతుగా నిలుస్తున్నాం. 2047 నాటికి 2.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ రాష్ట్రంతో భుజం భుజం కలిపి నడుస్తాం. ఇవాళ తలపెట్టిన ప్రాజెక్టులు రాష్ట్ర వికాసానికి తోడ్పడతాయి. ఐటీ, టెక్నాలజీకి ఆంధ్రప్రదేశ్ ప్రధాన కేంద్రం కానుంది. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధిని సరికొత్త శిఖరాలకు చేరుస్తాయి. 2030లోగా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి మా లక్ష్యం. దేశంలో 2 గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు వస్తుంటే.. దానిలో ఒకటి విశాఖకు కేటాయించాం. గ్రీన్ హైడ్రోజన్ హబ్ ద్వారా ఎంతో మందికి ఉపాధి లభిస్తుంది".

"నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కుకు శంకుస్థాపన చేశాం. కేవలం 3 రాష్ట్రాల్లోనే ఇలాంటి పార్కులు వస్తున్నాయి. చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో క్రిస్ సిటీ భాగం అవుతుంది. ఇప్పటికే శ్రీసిటీ ద్వారా ఏపీలో తయారీరంగం ఊపందుకుంది. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు పునాదిరాయి వేశాం. రాష్ట్ర అభివృద్ధిలో రైల్వే జోన్ కీలకం కానుంది. రైల్వే జోన్ ద్వారా రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుంది. రైల్వే జోన్ వల్ల వ్యవసాయ, పర్యాటక రంగాలు ఊపందుకుంటాయి. రాష్ట్రంలో ఇప్పటికే 7 వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. అమృత్ భారత్ కింద ఏపీలోని 70కి పైగా రైల్వేస్టేషన్లు ఆధునికీకరణ చేపట్టాం" అని ప్రధాని వివరించారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అనిత, టీజీ భరత్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు కార్యక్రమంలో పాల్గొన్నారు.




## రూ.25 లక్షల ఆరోగ్య బీమా.. దిల్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ హామీ

దేశ రాజధాని దిల్లీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో కాంగ్రెస్ దిల్లీ వాసులకు హామీల వర్షం కురిపిస్తోంది.

తాజాగా 'జీవన్ రక్ష యోజన' అనే పథకాన్ని కాంగ్రెస్ ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.25లక్షల ఆరోగ్యబీమా కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కాంగ్రెస్ సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గహ్లోత్ ( ) బుధవారం ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. రాజస్థాన్‌లో తాము అధికారంలో ఉన్నప్పుడు ఇదే పథకాన్ని అమలుచేశామని గుర్తుచేశారు. ఎలాంటి షరతులు, పరిమితులు లేకుండా దీన్ని అమలుచేసినట్లు తెలిపారు. దిల్లీకి ఈ పథకం ఓ గేమ్‌ఛేంజర్ అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే 'ప్యారీ దీదీ యోజన' పథకం కింద ప్రతి మహిళకు ప్రతి నెలా రూ.2,500 ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.

ఇదిలాఉండగా.. దేశ రాజధాని దిల్లీలో జరిగే ఎన్నికలకు (%ూాంంవఎశ్రీఎ జుశ్రీవషఱశీఅ%) కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. మొత్తం 70 శాసనసభ స్థానాలకు ఫిబ్రవరి 5న ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడనున్నాయి.

## ఏఐసీసీ ఫేక్ న్యూస్ పెడ్లర్లతో నిండిపోయింది: కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్: ఏఐసీసీ ఫేక్ న్యూస్ పెడ్లర్లతో నిండిపోయిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ మహిళలు కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా లబ్ధి పొందలేదన్నారు. సాధికారత కల్పించడానికి బదులుగా వారిపై దాడుల చేశారని, ఇళ్లను పడగొట్టారని ఆరోపించారు. ఇది పాలన కాదు.. మహిళలపై వ్యవస్థీకృత క్రూరత్వం అని మండిపడ్డారు."తెలంగాణలో ఏడాది వినాశకరమైన కాంగ్రెస్ పాలనలో అత్యాచార కేసులు 28.94 శాతం, మహిళల హత్యలు 13 శాతం, కిడ్నాప్‌లు 26 శాతం పెరిగాయి. ఆ పార్టీ వాగ్దానం చేసిన భద్రత ఎక్కడ ఉంది? మహిళల ప్రాథమిక గౌరవం కూడా దాడికి గురవుతోంది. కాంగ్రెస్ హయాంలో 10 వేల మంది



బహిరంగ ప్రదేశాల్లో వేధింపులకు గురయ్యారు. కాంగ్రెస్.. దోపిడీదారులు, విధ్వంసకారులు, అబద్ధాల పార్టీగా మారింది" అని బండి సంజయ్ పేర్కొన్నారు.

## కేటీఆర్ ఏసీబీ విచారణ.. ఆడియో, వీడియో రికార్డుకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్: ఏసీబీ విచారణకు మాజీ మంత్రి కేటీఆర్ వెంట న్యాయవాదిని తీసుకెళ్లేందుకు తెలంగాణ హైకోర్టు ( ) అనుమతించింది. విచారణ ఆడియో, వీడియో రికార్డు చేసేందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఏసీబీ విచారణకు వెళ్లే సమయంలో తన వెంట న్యాయవాదిని అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై



మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టింది. విచారణకు వెళ్లే సమయంలో న్యాయవాదిని అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను కేటీఆర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

న్యాయవాది రామచంద్రరావు కేటీఆర్ వెంట విచారణకు హాజరవుతారని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కేటీఆర్ విచారణను ఆడియో, వీడియో రికార్డు చేయాలని న్యాయవాది కోరగా.. అందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. న్యాయవాది లైబ్రరీలో కూర్చుంటే కేటీఆర్ విచారణ కనిపిస్తుందని ఈ సందర్భంగా ఏఏజీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. న్యాయవాదితో కలిసి గురువారం ఏసీబీ విచారణకు వెళ్లాలని న్యాయస్థానం కేటీఆర్‌కు సూచించింది. గురువారం విచారణ తర్వాత ఏవైనా అనుమానాలుంటే మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని హైకోర్టు తెలిపింది.

ఏసీబీ విచారణకు కేటీఆర్‌తో పాటు వెళ్లేందుకు ముగ్గురు న్యాయవాదుల పేర్లను సూచించాలని.. అందులో ఒకరికి అనుమతిస్తామని హైకోర్టు పేర్కొంది. దర్యాప్తు అధికారి, కేటీఆర్ ఓ గదిలో ఉంటే.. వాళ్లిద్దరూ కనిపించేంత దూరంలో న్యాయవాది ఉండేలా అనుమతి ఇస్తామని హైకోర్టు తెలిపింది. ఈ మేరకు ఏసీబీ కార్యాలయంలో ఏర్పాట్లు ఉన్నాయో లేవో తెలుసుకొని చెప్పాలని అదనపు అడ్వొకేట్ జనరల్‌ను అదేశించింది. ఎంపీ అవినాష్ రెడ్డి సీబీఐ విచారణను ఎదుర్కొనే సమయంలో న్యాయవాదిని అనుమతిస్తూ ఇదే హైకోర్టు సైతం తీర్పు ఇచ్చిందని జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. న్యాయవాదిని అనుమతించొద్దని ఏసీబీ తరఫున వాదించిన అదనపు అడ్వకేట్ జనరల్ తేరా రజినీకాంత్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. న్యాయవాదిని అనుమతిస్తే అభ్యంతరమెందుకని.. విచారణ గదిలోకి న్యాయవాది వెళ్లడం లేదు కదా అని హైకోర్టు వ్యాఖ్యానించింది.

కేటీఆర్, దర్యాప్తు అధికారి ఓ గదిలో ఉంటే... వాళ్లిద్దరూ కనిపించేలా మరో గదిలో న్యాయవాది కూర్చుంటారని హైకోర్టు తెలిపింది. ఏసీబీ కార్యాలయంలో తగిన ఏర్పాట్లు ఉన్నాయా లేవా అని ఏఏజీని ప్రశ్నించగా.. వివరాలు సేకరించి చెబుతానని ఏఏజీ సమాధానమిచ్చారు. విచారణకు సంబంధించి ఏసీబీ కార్యాలయంలో ఏర్పాట్లపై సమాచారం తెలుసుకున్న తర్వాత జస్టిస్ కె.లక్ష్మణ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

## ఏసీబీ వరుస ప్రశ్నలు.. షాక్‌లో ఐఏఎస్

హైదరాబాద్, జనవరి 8: ఫార్ములా ఈ కార్ రేసు కేసు దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. ఈ కేసులో నోటీసులు అందుకున్న అప్పటి పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి అరవింద్ కుమార్ ఈరోజు ఉదయం ఏసీబీ విచారణకు వచ్చారు. దాదాపు మూడు గంటలుగా ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను ఏసీబీ ప్రశ్నిస్తోంది. ముగ్గురు ఏసీబీ అధికారుల బృందం.. అరవింద్ కుమార్‌ను విచారిస్తున్నారు. ఫార్ములా ఈ కార్ రేసులో నిధుల మళ్లింపుకు సంబంధించే ఏసీబీ ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు తెలుస్తోంది.



రూ.55 కోట్ల నిధులను విదేశీ కంపెనీకి హెచ్ఎండీఏ చెల్లించిన నేపథ్యంలో ఇదే విషయంపై ఏసీబీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. రూ.55 కోట్లు ఎఫ్ఈవో సంస్థకు చెల్లించిన నేపథ్యంలో విదేశీ కంపెనీకి నగదు బదిలీ వెనుక ఉన్న అసలు కోణం ఏంటి.. ఇది ఎవరి నిర్ణయం... నగదు బదిలీకి ఆర్బీఐ అనుమతి ఉందా అంటూ అరవింద్ కుమార్‌కు ఏసీబీ వరుస ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. అలాగే ఈ ప్రశ్నలకు అరవింద్ కుమార్ కూడా కీలక సమాచారం చెప్పినట్లు సమాచారం. కేటీఆర్ ఆదేశాలు ఇవ్వడంతోనే నగదు రిలీజ్ చేశామని అరవింద్ కుమార్ స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అరవింద్ కుమార్ చెబుతున్న స్టేట్‌మెంట్‌ను ఏసీబీ రికార్డు చేస్తోంది.

ఏసీబీ ప్రశ్నలివే..

55కోట్లు నిధుల విదేశీ అకౌంట్లు కు జమ చేయడం ఎవరి నిర్ణయం ?

ఆర్థిక శాఖ అనుమతులు లేకుండా ఎందుకు నిధులు రిలీజ్ చేశారు ?

కేబినెట్ అప్రూవల్ లేకుండా నిధులు రిలీజ్ చేయవద్దని మీకు తెలియదా ?

కేటీఆర్ ఆదేశాలు ఇవ్వడంతోనే నగదు రిలీజ్ చేశామని అరవింద్ కుమార్ స్టేట్‌మెంట్ ఇచ్చారు

మంత్రిగా కేటీఆర్ ఆదేశాలు ఇచ్చినా .. ఆ రూల్స్‌ను ప్రజాప్రతినిధులకు చెప్పాల్సిన బాధ్యత ఉంది కదా ?

రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా అనుమతి లేకుండా .. బ్యాంక్ ఎలా నగదు బదిలీ చేసింది ?

హెచ్ఎండీఏ పరిధిని మించి నగదు బదిలీ చేసింది.. మౌఖిక ఆదేశాలు కేవలం కేటీఆర్ మాత్రమే ఇచ్చారా లేక ఇంకా ఎవరైనా ఉన్నారా ?

ఎఫ్ ఈవోతో చేసుకున్న అగ్రిమెంట్ ఏంటి? అగ్రిమెంట్‌లోరాసుకున్న నిబంధనలు ఏంటి?

గ్రీన్ కో స్పాన్సర్ షిప్ నుంచి వైదొలగడానికి కారణం ఏంటి ?

ఒప్పందం ప్రకారం 2024 లో నిర్వహించాల్సిన రేస్ ఎందుకు నిర్వహించలేక పోయారు...?

హెచ్ఎండీఏ కార్ రేసింగ్ కోసం కాకుండా .. ఇంకా వేటికైనా నిధులు రిలీజ్ చేశారా ?

హెచ్ఎండీఏ నిర్ణయాల్లో చైర్మన్ పాత్ర ఏమైనా ఉంటుందా ? అంటూ ఇలా వరుసగా ప్రశ్నలు సంధించింది ఏసీబీ.

ఓవైపు ఏసీబీ కార్యాలయంలో ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను ఏసీబీ ప్రశ్నిస్తుండగా.. మరోవైపు ఈడీ కార్యాలయంలో హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎన్ఎల్ రెడ్డిని ఈడీ అధికారులు విచారిస్తున్నారు. ప్రధానంగా ఈ కార్ రేసులో హెచ్ఎమ్‌డీఏ పాత్ర స్వల్పంగా ఉన్నప్పటికీ స్పాన్సర్స్ చెల్లించాల్సిన డబ్బును హెచ్ఎండీఏ ఎందుకు చెల్లించాల్సి వచ్చిందని బీఎన్ఎల్ రెడ్డిని ఈడీ అధికారులు ప్రశ్నిస్తున్నారు.

## తెలంగాణకు బీర్ల సరఫరా నిలిపివేసిన యూనైటెడ్ బ్రూవరీస్

హైదరాబాద్: తెలంగాణకు ఏడు రకాల బీర్ల సరఫరా నిలిచిపోనుంది. ఐదేళ్లుగా ధరలు పెంచకపోవడంతో భారీగా నష్టాలు వస్తున్నాయని పేర్కొంటూ యూనైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యూబీఎల్) ఈమేరకు నిర్ణయం తీసుకుంది. యూబీఎల్ ప్రతినిధులు బుధవారం ఎక్సైజ్‌శాఖ కమిషనర్‌ను కలిసి.. తెలంగాణకు పూర్తిగా బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్టు లేఖ అందజేశారు. ధరలు పెంచాలని పలు మార్లు కోరినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని, దీంతో తమకు భారీగా నష్టాలు వస్తున్నాయని లేఖలో పేర్కొన్నారు. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు.



భారత శక్తి

# భయం కాదు జాగ్రత్త అవసరం

అదిగో పులి అంటే ఇదిగో తోక అంటూ సామాజిక మాధ్యమాల్లో బాధ్యతారహితంగా పోస్టులు పెట్టేవారి పుణ్యమాని హెచ్ఎంపివి పేరు ప్రపంచవ్యాప్తంగా మార్మోగిపోతోంది. నిజానికి అనేక ఆసియా దేశాలకు ఇది శీతాకాలం. ఇన్ఫ్లూయెంజా, మైక్రోప్లాస్మా, నిమోనియా వంటి వ్యాధులు ప్రబలి, జలుబు, దగ్గు, ఇతర శ్వాసకోశ వ్యాధులతో జనం బాధపడటం సహజం. రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే పిల్లలూ, పెద్దలూ త్వరితగతిన ఇలాంటి వ్యాధులకు లోనవుతూ ఉంటారు. కోవిడ్ వ్యాప్తి చెందిన తొలినాళ్లలో అవగాహన లేమివల్ల ప్రజలను అప్రమత్తం చేయడంలోనూ, సరైన నిరోధక చర్యలు చేపట్టడంలోనూ జరిగిన జాప్యం లక్షలాదిమంది ప్రాణాలను బలిగొనడానికి కారణమైంది. మరో వైరస్ వ్యాప్తి చెందుతోందని తెలిస్తే, ఆందోళన చెందడం సహజం. అయితే, గత ఏడాదితో పోలిస్తే తమ దేశంలో హెచ్ఎంపివి కేసులు తగ్గాయంటూ చైనా గణాంకాలతోసహా పేర్కొంటూ ఉండగా, ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం ఇప్పటి వరకూ హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించకపోవడాన్ని బట్టి హెచ్ఎంపివి అంత ప్రమాదకరమైన వైరస్ కాదని తెలుస్తోంది. ఈ సూక్ష్మక్రిముల బారిన పడినవారు కోవిడ్ లాగానే శ్వాసకోశ వ్యాధులకు లోనవుతారని తేలినా, ఇప్పటివరకూ దీనికి వ్యాక్సీన్ కనిపెట్టకపోవడం వైద్య ఆరోగ్య శాఖ ఉదాసీన వైఖరికి ఉదాహరణ.కరోనా మహమ్మారి విలయతాండవం సృష్టించి ఐదేళ్లు గడిచినా, ఇప్పటికీ ఆ పేరు వింటే చాలు వెన్నులోంచి వణుకు పుడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఈ మహమ్మారి వైరస్ లక్షలాది మందిని కబళించింది. దీని బారినపడి బతికి బట్టకట్టినవారు ఉన్నా, దాని ప్రభావంతో ఇప్పటికీ పడరాని పాట్లు పడుతున్నారన్నది తోసిపుచ్చలేని నిజం. మళ్లీ అలాంటి వైరస్ ఒకటి వెలుగు చూసిందనీ, మానవాళిని తుదముట్టించేందుకు ముంచుకువస్తోందని తెలిస్తే ఎలా ఉంటుంది? ఇప్పుడా పరిస్థితి ప్రజానీకానికి కంటి మీద నిద్ర లేకుండా చేస్తోంది. కరోనా వైరస్‌కు పుట్టినిల్లయిన చైనాలోనే హెచ్ఎంపివి అనే కొత్తరకం వైరస్ పుట్టి, విస్తృతంగా వ్యాప్తి చెందుతోందని, దీని బారినపడిన జనం వేల సంఖ్యలో ఆస్పత్రులలో చేరుతున్నారని సామాజిక మాధ్యమాల్లో వెల్లువలా పోస్టవుతున్న వీడియోలను చూసి జనం బెంబేలెత్తిపోతున్నారు. తాజాగా బెంగళూరులోను, అహ్మదాబాద్‌లోను వెలుగుచూసిందన్న వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. బెంగళూరులోని ఒక ఆస్పత్రిలో ఎనిమిది నెలలు, మూడు నెలలు వయసున్న ఇద్దరు పసికందులకు వైద్య పరీక్షలు నిర్వహించగా, హెచ్ఎంపివి జాడలు బయటపడ్డాయని ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ సంస్థ వెల్లడించింది. ఇండియాలోనే కాకుండా, అనేక దేశాల్లో జనావళి ఈ వైరస్ గురించి చర్చించుకోవడం, ఆందోళన చెందడం కొన్ని రోజులుగా జరుగుతోంది. ఇటీవల చైనాలోనూ, తాజాగా బెంగళూరు, అహ్మదాబాద్ నగరాల్లోనూ వెలుగు చూసిందని చెబుతున్న హ్యూమన్ మెటానిమో వైరస్ (హెచ్ఎంపివి) కోవిడ్ లా ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చినదేమీ కాదు. దీని జాడలు 2001లోనే నెదర్లాండ్స్‌లో బయటపడ్డాయి. 2018లో ప్రపంచవ్యాప్తంగా ఆస్పత్రిపాలైన చిన్నారుల్లో మూడు నుంచి పది శాతం మంది హెచ్ఎంపివి బారిన పడినట్లు ఒక అధ్యయనంలో తేలింది. దీనిని బట్టి ఈ వైరస్ ప్రపంచానికి పాతదేనని స్పష్టమవుతోంది. చైనాలో హెచ్ఎంపివి కేసులు పెరుగుతున్నట్లుగా వస్తున్న వార్తలపై తక్షణమే స్పందించి, ప్రపంచ ఆరోగ్య సంస్థను వివరాలకోసం అడగడం భారత ప్రభుత్వం అప్రమత్తతను తెలియజేస్తోంది. దీనికి తోడు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ రంగంలోకి దిగి, జాయింట్ మానిటరింగ్ గ్రూప్ సమావేశం నిర్వహించి, హెచ్ఎంపివి వ్యాప్తి, నివారణపై తీసుకోవలసిన చర్యల గురించి చర్చించింది. దేశవ్యాప్తంగా ఆరోగ్యశాఖాధికారులు పలు ప్రాంతాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తున్నారు. బెంగళూరులో హెచ్ఎంపివి వైరస్ సోకిన ఇద్దరు పసికందుల్లో ఒకరు ఇప్పటికే ఆస్పత్రినుంచి డిశ్చార్జ్ కాగా, మరొకరిలో వ్యాధి తగ్గుముఖం పట్టిందన్న విషయం గమనార్హం. పైగా ఈ ఇద్దరికీ విదేశాల నుంచి వచ్చినవారివల్ల ఈ వైరస్ సోకలేదన్న ఆరోగ్య శాఖ ప్రకటనను బట్టి, కోవిడ్ మాదిరిగా హెచ్ఎంపివి ఇప్పటికిప్పుడు చైనా నుంచి దిగుమతైన వైరస్ కాదన్న సంగతి స్పష్టమవుతోంది.వ్యాధులవ్యాప్తి అంతగా లేనప్పటికీ గత కోవిడ్ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని హెచ్ఎంపివి వ్యాప్తిని అరికట్టేందుకు చైనా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటోందని అక్కడి అధికార మీడియా వెల్లడించడం ఊరట కలిగించే విషయం. ఏదిఏమైనా, హెచ్ఎంపివి వైరస్ జాడలు మన దేశంలోనూ బయటపడిన నేపథ్యంలో మరింత వ్యాప్తి చెందకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం అవసరం. వ్యాధి నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేసి, హెచ్ఎంపివి జాడ కనిపెట్టి, ఈ మహమ్మారిని మొగ్గలోనే తుంచేందుకు ప్రభుత్వాలు నడుం బిగించాలి. ప్రజలు తమ వంతు బాధ్యతగా స్వీయ రక్షణ చర్యలు చేపట్టడం అత్యంత ఆవశ్యకం.

# ఆగని రేషన్ బియ్యం దందా

భారత శక్తి ప్రతినిధి



**విజయవాడ, జనవరి 8, సీజ్ ద షిప్** డ్రామా ముగిసింది. రేషన్ బియ్యం పట్టుబడిన స్టెల్లా నౌక కాకినాడ పోర్టు విడిచిపోయింది. రేషన్ బియ్యం అక్రమాలు మాత్రం ఆగలేదు. కొద్ది నెలల క్రితం చోటు చేసుకున్న హంగామాతో రేషన్ బియ్యం ధర మాత్రం కిలోకు రెండు రుపాయలు పెరిగింది ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డు కట్ట వేస్తామంటూ చేసిన హంగామా ప్రకటనలకే పరిమితం అయ్యింది. ఊరురా రేషన్ బియ్యం అమ్మకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పోర్టుల్లో తనిఖీలు, మిల్లుల్లో సోదాలతో రేషన్ బియ్యం స్మగ్లింగ్‌కు అడ్డు కట్ట పడుతుందని భావించినా అందుకు భిన్నంగా క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఉంది. గతంలో దొంగచాటుగా సాగిన వ్యవహారం ఇప్పుడు బహిరంగంగానే సాగుతోంది. ఊరురా మొబైల్ డెలివరీ యూనిట్లలోనే బియ్యం కొనుగోళ్లు సాగుతున్నాయి. గతంలో సివిల్ సప్లైస్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేస్తారనే భయం కాస్తో కూస్తో ఉండేది. ప్రస్తుతం ఆ భయం కూడా పోయింది.ఏపీలో మూడు నెలల క్రితం రేషన్ బియ్యం అక్రమ తరలింపు వ్యవహారాలపై జరిగిన హంగామాతో రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ బియ్యం వ్యాపారానికి అడ్డుకట్ట పడుతుందని భావించారు. కాకినాడ పోర్టులో పవన్ కళ్యాణ్ సీజ్ ద షిప్ ఎపిసోడ్‌తో ఈ దందాకు అడ్డుకట్ట పడినట్టే అనుకున్నారు. పవన్ కళ్యాణ్ స్వయంగా తనిఖీలు చేసిన స్టెల్లా నౌకకు సైతం కస్టమ్స్ క్లియరెన్స్ లభించడంతో సోమవారం బయల్దేరి వెళ్లిపోయింది.రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ బియ్యం వ్యాపారాల సిండికేట్లు చేతులు మారినట్టు ప్రచారం జరుగుతోంది. ప్రతి జిల్లాలో మండలాల వారీగా రేషన్ దుకాణాలను నడిపించే అక్రమ సిండికేట్లలో కొత్త ముఖాలు ప్రవేశించాయి. ఇప్పటి వరకు ఈ తరహా దందాలు నడిపిన వ్యక్తుల చేతుల్లోంచి కొత్త వ్యక్తులు వాటిని దక్కించుకున్నారు. ప్రతి మండలంలో ఉన్న రేషన్ దుకాణాలను అధికార పార్టీల నేతల అనుచరులు తమ నియంత్రణలోకి తీసుకున్నారు. ప్రభుత్వం పేదల కోసం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం తినడానికి వినియోగించే సన్న రకాలు కాకపోవడంతో రేషన్ బియ్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది.ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ లెక్కల ప్రకారం కోటి 55లక్షల కుటుంబాలు ఉంటే అందులో కోటి 48లక్షల మందికి రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతి ఒక్కరికి నెలకు 5 కేజీల చొప్పున బియ్యం పంపిణీ జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న కార్డులకు బియ్యం పంపిణీ కోసం ఏటా 30లక్షల టన్నుల బియ్యం అవసరం అవుతున్నాయి. వీటిలో 80శాతానికి పైగా పక్కదారి పడుతున్నాయి. ప్రభుత్వం ఒక్కో కిలో బియ్యం సేకరించి కార్డులకు అందించడానికి రూ.43.50ఖర్చు చేస్తుంటే ఆ బియ్యాన్ని రూ.10-12కు అమ్మేస్తున్నారు. రాష్ట్రంలో రేషన్ బియ్యం హడావుడి మొదలయ్యాక ఆ ధర రూ.2మేరకు పెంచి కొనుగోలు చేస్తున్నారు.ప్రస్తుతం ఏపీలో కోటి 48లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నవాయి. వీటిలో 92లక్షల కార్డులకు కేంద్ర ప్రభుత్వం నుంచి రేషన్ అందుతోంది. మరో 56లక్షల కార్డుల్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. రేషన్ కార్డులకు అందించే బియ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.5700కోట్లను వెచ్చిస్తోంది. కేంద్రం ఇచ్చే వాటాతో కలిపితే అది రూ.13వేల కోట్లకు చేరువలో ఉంటుంది. రేషన్ కార్డులతోనే ఆరోగ్యశ్రీ, ఫీజు రియింబర్స్మెంట?, డిబిటి పథకాలను ముడిపెట్టడంతో ఏదో ఒక మార్గంలో రేషన్ కార్డును దక్కించుకుకుంటున్నారు.చౌక ధరల దుకాణాల ద్వారా ప్రభుత్వం అందించే బియ్యాన్ని 90శాతం మంది ఆహారంగా వినియోగించడం లేదు. ప్రభుత్వం బోనస్ కలిపి రైతుల నుంచి కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని పేదలకు ఆహారంగా సరఫరా చేస్తోంది. ఇలా కిలోకు రూ.43.50 ఖర్చువుతోంది. ఒక కుటుంబంలో నలుగురు సభ్యులు ఉంటే వారికి 20కిలోల బియ్యం ప్రభుత్వం రైస్ కార్డుపై ఇస్తోంది. అంటే నెలకు ఒక్కో కుటుంబానికి రూ.870 ఖరీదైన బియ్యం అందుతోంది.అదే బియ్యాన్ని కార్డు దారుడు తీసుకోకుండా రేషన్ దుకాణాలు, మొబైల్ వాహనాలకే వదిలేస్తే కిలోకు రూ.10-12 కార్డుదారుడికి చెల్లిస్తున్నారు. కార్డులో నలుగురు సభ్యులు ఉంటే బియ్యంకు బదులుగా రూ.200 వారికి ఇస్తున్నారు.ఏడాదికి సగటున రూ.10,440 విలువైన బియ్యాన్ని రూ.2400కు అమ్మేసుకుంటున్నారు.రాష్ట్రంలో ప్రస్తుతం ప్రతి నెల 3,24, 797 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని రేషన్ కార్డులకు చెల్లిస్తున్నారు. ఇందులో బీపీఎల్ కార్డులు, ఏపిఎల్ కార్డులు, అంత్యోదయ అన్న యోజన కార్డులు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, మిడ్ డే మీల్స్, అన్నపూర్ణ స్కీమ్, అదనపు ఏపిఎల్ కార్డులు ఉన్నాయి. మొత్తం 3.24లక్షల మెట్రిక్ టన్నుల బియ్యంలో 80శాతం పైగా తిరిగి బ్లాక్ మార్కెట్లకే వెళుతోంది. ఏడాదికి రూ.25లక్షల టన్నుల బియ్యం ఇలా పోర్టుల నుంచి తరలిపోతోంది. దీని ద్వారా నేతలు కళ్లు చెదిరేలా సంపాదిస్తున్నారు.రేషన్ కార్డు దారుల నుంచి రూ.10కు కొనుగోలు చేసే బియ్యాన్ని దళారులు రూ.16-18కు మండల, జిల్లా స్థాయి విక్రేతకు అందిస్తారు. ప్రతి జిల్లాలో రేషన్ బియ్యం మాఫియాను నియంత్రించే నాయకులు ఉన్నారు. రేషన్ వాహనాలు, దుకాణాల నుంచి బియ్యాన్ని నేరుగా వీరికి అందిస్తారు. ఒక్కో మండలంలో నెలకు సగటున 250-300 మెట్రిక్ టన్నుల బియ్యం బ్లాక్ మార్కెట్లకు తరలిపోతోంది. ప్రతి నెల రెండున్నర లక్షల కిలోల నుంచి 3లక్షల కిలోల బియ్యాన్ని రేషన్ మాఫియా సొమ్ము చేసుకుంటుంది.జిల్లా స్థాయి మాఫియా నుంచి మద్యం తయారీ దారులు, ఎగుమతి దారులకు చేరే సరికి దాని ధర గరిష్టంగా రూ.36-38కు చేరుతోంది. రేషన్ కార్డుదారుడికి రూ.10 దక్కితే అదే బియ్యం మీద దళారులు కిలోకు రూ.26-28వరకు సంపాదిస్తున్నారు. ఫలితంగా అన్ని రాజకీయ పార్టీలకు రేషన్ బియ్యం మిఠాయిలా మారింది.ప్రభుత్వం మారిన వెంటనే రేషన్ బియ్యం అక్రమ ఎగుమతులపై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించింది. వాస్తవానికి రేషన్ దుకాణాలు, బియ్యం తరలింపు దందా మాత్రమే చేతులు మారింది. గత ఆర్నెల్లలో గతంలో ఉన్న వారి స్థానంలో కొత్త దళారులు పుట్టుకొచ్చారు.ఒక్కో రేషన్ దుకాణంలో ప్రతి నెల లక్షల రుపాయలు ఆదాయం కనిపిస్తుండటంతో చోట మోట నాయకులు తమ ప్రాంతంలో రేషన్ దందా కోసం ముఖ్యమైన నేతల్ని ఆశ్రయిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొబైల్ డెలివరీ యూనిట్లతో బియ్యం రవాణా చేస్తుండటంతో బ్లాక్ మార్కెటింగ్ యథేచ్ఛగా సాగుతోంది.

# పక్కదారి పడుతున్న కందిపప్పు

భారత శక్తి ప్రతినిధి

నెల్లూరు, జనవరి 8, పేదలకు అందాల్సిన కందిపప్పు పక్కదారి పడుతోంది. చాలా ప్రాంతాల్లో కందిపప్పు సరఫరా తక్కువ అవుతోంది. దీంతో డీలర్లు కొంతమందికే ఇచ్చి.. మిగతా పప్పును వ్యాపారులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దాదాపు 40 శాతం వరకు లబ్ధిదారులకు కందిపప్పు అందడం లేదని తెలుస్తోంది.సంక్రాంతి పండగ వేళ పేదలు కందిపప్పు కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో ప్రతి నెలా కార్డుదారులకు ఇచ్చే సరఫరాలో కోత విధిస్తున్నారు. డిసెంబర్ నెలలో కూడా అరకొరగా పంపిణీ చేశారు. ఈ నెలలో అయినా



అందరికీ ఇస్తారని అనుకున్నారు. కానీ పూర్తి స్థాయిలో కిందిపప్పు రాలేదు. కార్డుదారులకు ప్రతినెలా బియ్యంతో పాటు అరకిలో పంచదార, కిలో కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. కానీ.. రేషన్ షాపుల ద్వారా అవి సక్రమంగా అందడం లేదు.బియ్యం, పంచదార అందరికీ ఇస్తున్నా.. 50 నుంచి 60 శాతం మందికి మాత్రమే కంది పప్పు అందిస్తున్నారు. దీంతో 40 శాతానికిపై లబ్ధిదారులకు కందిపప్పు దక్కడం లేదు. రేషన్ దుకాణాలు ద్వారా రాయితీపోనూ రూ.67కే కందిపప్పు వస్తుంది. దీంతో పేదలు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు భారీగా పెరగడంతో.. కందిపప్పు ఇవ్వకపోతే ఎలా అని పేదలు ప్రశ్నిస్తున్నారు.రేషన్ షాపుల నిర్వాహకులు బియ్యంతోపాటు పంచదార, కందిపప్పు ఇవ్వాలి. కానీ చాల చోట్ల బియ్యం, చెక్కర మాత్రమే అందిస్తున్నారు. కొంత మందికి మాత్రమే కందిపప్పు అందించి.. ఇక పప్పు అయిపోయిందని చెబుతున్నారు. అలా నొక్కేసిన పప్పును బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయిపేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడానికి ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని రేషన్ షాపుల ద్వారా అనేక రకాల అవసరమైన సరుకులు అందజేస్తున్నారు. తెల్ల బియ్యం, గోధుమలు, ప్రోటీన్లు అధికంగా ఉండే కందిపప్పు, పంచదార, వంట నూనెను కూడా అందిస్తున్నారు. అప్పుడప్పుడు అవసరాలను బట్టి ఉప్పు, మిరపకాయలను పంపిణీ చేస్తున్నారు.అయితే.. కొన్ని చోట్ల కందిపప్పు సక్రమంగా పంపిణీ చేయడం లేదని, ఫిర్యాదులు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. అలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని స్పష్టం చేస్తున్నారు. షాపుల్లో తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

# రేపటి నుంచి వైకుంఠ ద్వారా దర్శనాలు

భారత శక్తి ప్రతినిధి



తిరుమల, జనవరి 8 జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు ఏడు లక్షల మంది భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు టీటీడీ ఈవో జె శ్యామలరావు తెలిపారు. పది రోజుల పాటు ప్రత్యేక దర్శనాలు రద్దు చేసినట్లు పేర్కొన్నారుసామాన్య భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించడమే తమ అత్యంత ప్రాధాన్యత అని టీటీడీ ఈవో జె శ్యామలరావు పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో అడిషనల్ ఈవోతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈవో మాట్లాడారు. వైకుంఠ ద్వార దర్శన ఏర్పాట్లపై వివరించారు. జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు ఏడు లక్షల మంది భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసిందని తెలిపారు.జనవరి 10 నుంచి 19 వరకు 10 రోజుల పాటు శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారం భక్తుల కోసం తెరిచి ఉంటుంది.జనవరి 10న కైంకర్యాల తర్వాత, ప్రోటోకాల్ దర్శనం ఉదయం 4.30 గంటలకు ప్రారంభమవుతుంది. తరువాత 8 గంటలకు సర్వ దర్శనం ప్రారంభం అవుతుంది.వైకుంఠ ఏకాదశి రోజున(జనవరి 10) ఉదయం 9 నుంచి 11 గంటల వరకు మలయప్ప స్వామి బంగారు రథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులను అనుగ్రహించనున్నారు.అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వాహన మండపంలో మలయప్ప స్వామి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.జనవరి 11న వైకుంఠ ద్వాదశి సందర్భంగా ఉదయం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు చక్రస్నానం నిర్వహిస్తారు.జనవరి 9వ తేదీ ఉదయం 5 గంటల నుంచి తిరుపతిలోని 8 కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 90 కౌంటర్లు, తిరుమలలో ఏర్పాటు చేసిన ఒక కేంద్రంలో 4 కౌంటర్లలో ఎస్ఎస్‌డి టోకెన్లు జారీ చేయనున్నారు.జనవరి 10, 11, 12 తేదీల్లో భక్తులకు 1.20 లక్షల టోకెన్లు జారీ చేసేందుకు ఈ కింద కేంద్రాలు ఏర్పాటు చేశారు.

1. ఇందిరా మైదాన్.
2. రామచంద్ర పుష్కరిణి.
3. శ్రీనివాసం కాంప్లెక్స్.
4. విష్ణు నివాసం కాంప్లెక్స్.
5. భూదేవి కాంప్లెక్స్.
6. రామానాయుడు ఉన్నత పాఠశాల, భైరాగిపట్టెడ.
7. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఓఖీ పల్లి.
8. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తిరుపతిలోని జీవకోన
9. తిరుమల వాసుల కోసం బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్

జనవరి 13-19 వరకు శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్‌లో మాత్రమే అదే రోజు దర్శనానికి రోజువారీ ప్రాతిపదికన టోకెన్లు జారీ చేస్తారు. పది రోజుల వైకుంఠ ద్వార దర్శనం కోసం ఇప్పటికే 1.40 లక్షల ఎస్ఈడీ టిక్కెట్లు, 19,500 శ్రీవాణి టిక్కెట్లు ఆన్‌లైన్‌లో విడుదలయ్యాయి.

పది రోజుల పాటు ఈ దర్శనాలు రద్దు

ప్రోటోకాల్ వీఐపీలు మినహా, వీఐపీ బ్రేక్ దర్శనం, సీనియర్ సిటిజన్లు, శారీరక వికలాంగులు, శిశువులు ఉన్న తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐలు వంటి ఇతర ప్రత్యేక దర్శనాలు ఈ పది రోజులలో రద్దు చేశారు. తిరుమలలో పరిమిత సంఖ్యలో వసతి అందుబాటులో ఉన్నందున, దర్శన టోకెన్లు ఉన్న భక్తులను మాత్రమే వారి టోకెన్లపై పేర్కొన్న తేదీ, సమయంలో క్యూ లోకి అనుమతిస్తారు. జనవరి 9న తిరుపతిలో ఎస్ఎస్డీ టోకెన్లు జారీ చేస్తారు.జనవరి 19 వరకు శ్రీవారి మెట్టు కౌంటర్లు మూసి ఉంటాయని టీటీడీ ఈవో జె.శ్యామలరావు తెలిపారు. ఈ పది రోజుల్లో సిఫారసు లేఖలు స్వీకరించరన్నారు. పది రోజుల పాటు తిరుమలలో వసతి గదుల ఆన్‌లైన్ బుకింగ్ రద్దు చేసినట్లు పేర్కొన్నారు. సాధారణ భక్తులకు సీఆర్వోలో వసతి కేటాయిస్తారని తెలిపారు.

12 వేల వాహనాలకు పార్కింగ్

జనవరి 8 నుంచి 11 వరకు 4 రోజుల పాటు తిరుమలలో ఎంబీసీ, ఏఆర్పీ, టీబీసీ, కాటేజ్ డోనర్ స్కీమ్ కేటాయింపు కౌంటర్ల మూసివేయనున్నారు. తిరుమలలో దాదాపు 12 వేల వాహనాలకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయనున్నారు. ఎంబీసీ, ఔటర్ రింగ్ రోడ్, ఖీఃఉఊ ఏరియా, పరకామణి భవన్ సమీపంలో పార్కింగ్ స్థలాల ఏర్పాటు చేయనున్నారు. భక్తుల సౌకర్యార్థం టికెట్లపై ఎంట్రీ పాయింట్, దిగే పాయింట్, పార్కింగ్ పాయింట్, పికప్ పాయింట్ వివరాలను ముద్రించారు.

వైకుంఠ ద్వార దర్శనాల భద్రతా ఏర్పాట్లపై తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ.. యాత్రికుల భద్రత కోసం తిరుపతిలో 1200 మంది, తిరుమలలో 1800 మంది పోలీసులతో కలిపి దాదాపు 3000 మంది పోలీసులను మోహరించినట్లు తెలిపారు. తిరుపతి, తిరుమలలోని అన్ని సర్వ దర్శన టోకెన్ల జారీ కేంద్రాల వద్ద టీటీడీ సమన్వయంతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. తిరుమలలో ట్రాఫిక్ రద్దీని నివారించడానికి నిర్ణీత తేదీ, సమయాన్ని అనుసరించి వైకుంఠ ద్వార దర్శనం చేసుకోవాలని అభ్యర్థించారు.

# సాగు చేసే రైతులకే భరోసా

భారత శక్తి ప్రతినిధి

నిజామాబాద్, జనవరి 8,తెలంగాణ ప్రభుత్వం రైతులకు గుడ్ న్యూస్ చెప్పింది. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు రైతు భరోసా పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం కింద ప్రతి ఎకరానికి రూ.12 వేలు ఆర్థిక సాయం చేస్తామని వెల్లడించింది. రైతు భరోసా ఇన్ని ఎకరాలకు మాత్రమే అనే పరిమితి లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ పథకం అమలుకు ప్రభుత్వం భారీ కసరత్తు చేసింది. రైతులు, రైతు సంఘాలతో సమావేశాలు నిర్వహించి...వారి అభిప్రాయాలు సేకరించారు. చివరకు ఎలాంటి పరిమితి లేకుండా సాగు చేస్తు?న్న ప్రతి ఎకరానికి రైతు భరోసా ఇస్తామని ప్రభుత్వం నిర్ణయించింది.వ్యవసాయం చేస్తున్న, సాగు చేసేందుకు అనుకూలంగా ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసా కింద రూ.12 వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రాళ్లు, గుట్టలు, పరిశ్రమలకు ఇచ్చిన భూములు, రోడ్లు, వెంచర్ల వేసిన భూములకు రైతు భరోసా ఇవ్వమని స్పష్టం చేసింది. ఇలాంటి భూములున్న వారికి రైతు భరోసా దక్కదు. ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారికి పొలాలు ఉంటే వారికి కూడా రైతు భరోసా వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ పథకంపై పూర్తి విధి విధానాలు విడుదలైతే గానీ మరిన్ని విషయాలపై స్పష్టత రాదు.కేంద్ర ప్రభుత్వం రైతులకు పీఎం కిసాన్ కింద ఏడాదికి మూడు విడతల్లో రూ.6 వేలు అందిస్తుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు కింద ఏటా రూ.10 వేలు జమ చేసేంది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను రూ.15 వేలకు పెంచుతామని ఎన్నికల్లో హామీ ఇచ్చింది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా పెట్టుబడి సాయంగా రూ.12 వేలు అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. రైతు భరోసా నిధులను రెండు విడతలుగా జమ చేయనుంది. మొదటి విడతను 2025 జనవరి 26న గణతంత్ర దినోత్సవం నుంచి రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. అంటే తొలి విడతలో ఎకరానికి రూ.6,000 చొప్పున జమచేస్తారు. నిధులు విడుదలైన నాటి నుంచి పదిరోజుల్లో రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ అయ్యే అవకాశం



ఉంది."రైతు భరోసాపై వేలాది మంది రైతుల అభిప్రాయాలను సేకరించాం. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ రైతులకు ఎకరానికి రూ.12 వేలు ఇవ్వాలని నిర్ణయించాం. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తాం. కేసీఆర్ 200 ఎకరాలు సాగు చేస్తే 200 ఎకరాలకు పెట్టుబడి సాయం అందిస్తాం" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి వ్యాఖ్యల నేపథ్యంలో రైతు భరోసా ఇన్ని ఎకరాలకు పరిమితి లేదని స్పష్టం అవుతుంది.

రైతు భరోసా పథకం అమలు కోసం ప్రభుత్వం రూ.7,800 కోట్ల దాకా కేటాయించాల్సి ఉంటుంది. భూమి లేని వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా కింద రూ.12 వేలు అందించనున్నారు. ఈ పథకానికి రూ.12,000 కోట్లు అవసరం అవుతాయని అంచనా. ఈ రెండు పథకాలకు దాదాపు రూ.20 వేల కోట్లు జనవరి 25 లోపు ప్రభుత్వం సమకూర్చుకోవాల్సి ఉంటుంది.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 1.53 కోటి ఎకరాలకు రైతు బంధు కింద నగదు జమ చేసేది. రైతు బంధు స్కీమ్ లో 69 లక్షల మంది సాయం పొందారు. తాజాగా తెలంగాణ ప్రభుత్వం ఎన్ని ఎకరాలకు పెట్టుబడి సాయం చేయాలని అంచనా వేయగా...దాదాపు 1 కోటి 30 లక్షల ఎకరాలకు లెక్కతేలిందని అంచనా. దీంతో మొత్తం 62 లక్షల మంది రైతులకు జనవరి 26 నుంచి ఖాతాల్లో నగదు జమ కానుంది.

# ఆకలి సంగతి ఏంటీ...

భారత శక్తి ప్రతినిధి

మెదక్, జనవరి 8, వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న పదవ తరగతి విద్యార్థులు అర్థాకలి మధ్య చదువును కొనసా మెదక్ జిల్లా వ్యాప్తంగా 225 ఉన్నత పాఠశాలల్లో 10,389 మంది విద్యార్థులు ఈ ఏడాది పదోతరగతి పరీక్షలు రాయనున్నారు. ప్రతీరోజు ఉదయం 8:15 గంటలకు ప్రత్యేక తరగతులు ప్రారంభమై సాయంత్రం 5:30 వరకు కొనసాగుతున్నాయి.ఉదయం 8 గంటల వరకే పాఠశా విద్యార్థులు చేరుకుంటున్నారు. గ్రామా నుంచి వేలాది మం విద్యార్థులు ఆయా పాఠశాలలకు పదవ తరగతి చదివేందుకు వస్తున్నారు. ఉదయం త్వరగా వెళ్లాల్సి ఉ ండటతో ఇంటి వద్ద ఏమీ తినకుండానే పాఠశా వస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.పాఠశాలలో మధ్యా 12.30 గంటల వరకే మధ్యాహ్న భోజనం పూర్తి చేసుకుంటున్నారు. తిరిగి తరగతులకు హాజరుకావడం, సాయం 5.30 గంటల వరకు చదువులు కొనసాగించడంతో నీరసించిపోతున్నారు. ఉదయం, సాయంత్రం ఫలహారం లేకపోవడంతో చదువుపై శ్రద్ధ కనబర్చడం లేదని వాపోతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రత్యేక తరగతులకు గాను ఫలహారాన్ని అందించేవారు. అయితే ఏడాది నుంచి విద్యార్థులు ఫలహారానికి నోచుకోవడం లేదు. మరో 53 రోజుల్లో పదవ తరగతి పరీక్షలు సమీపిస్తుండగా ఏకాగ్రత లోపించి అనుకున్న ఫలితాలను సాధించలేకపోతారనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదిరిగానే ప్రభుత్వం జిల్లా కలెక్టర్ నేతృత్వంలో నిధులు మంజూరు చేయించి విద్యార్థులకు ఫలహారం అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.పదవ తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ఫలహారం అందించేందుకు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గతంలో జిల్లా కలెక్టరే తన నిధుల నుంచి ఒక్కో విద్యార్థికి రూ.5 చొప్పున కేటాయించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు.




తాజా సమాచారం ప్రకారం కలెక్టర్ వద్ద ఎలాంటి నిధులు లేవని, ప్రభుత్వ కార్యక్రమాల విషయంలో ఖర్చయినట్లు సమాచారం. జిల్లాలో పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఉదయం, సాయంత్రం ఫలహారం అందించేందుకు గాను ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకువచ్చి విద్యార్థుల ఆకలిని తీర్చాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్, ఉపాధ్యాయులు కోరుతున్నారు.పదవ తరగతి ప్రత్యేక తరగతుల కోసం ప్రతిరోజు ఉద 4 కిలో మీటర్లు నడుచుకుంటూ పాఠశాలకు వస్తున్నా. ఉదయం తొందరగా రావాల్సి ఉండటంతో ఇంట్లో తినకుండానే రావడంతో ఆకలితో చదువుకు ఆటంకం కలుగుతోంది. సాయంత్రం వరకు ఆకలిని తట్టు చదవాల్సి వస్తుంది. ఉదయం, సాయంత్రం ఫలహారం అందిస్తే బాగుంటుంది.ఉదయం నుంచి సాయం వరకు ప్రత్యేక తరగతులు ఉండటం వలన అల గురవుతున్నాం. సా 4 గంటలకు అల్పాహారం ఉంటే బాగుంటుంది. చాలామంది గ్రామా నుంచి కాలినడకన వస్తున్నారు. మా అవస్థను అర్థం చేసుకొని దాతలు, అధికారులు అల్పాహారం అందించేలా చర్య తీసుకోవాలి.

# బీజేపీకి మహిళలంటే కనీస గౌరవం లేదు

భారత శక్తి ప్రతినిధి

మంథని జనవరి 8, బీజేపీకి మహిళలంటే కనీస గౌరవం లేదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఓ ప్రకటనలో విమర్శించారు.

ఢిల్లీలోని కల్కాజీలో రోడ్ల గురించి చెబ్తూ ప్రియాంకా గాంధీని అవమానించేలా మాట్లాడిన బీజేపీ అభ్యర్థి రమేశ్ బిధూరి చేసిన అంసదర్భ వ్యాఖ్యలను ఆయన ఖండించారు. దేశం కోసం గాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలు చేసింది. ఒక్కసారి చరిత్రలోకి వెళ్లి చూడండి. వారి గొప్పతనం ఏంటో మీకు తెలుస్తుంది. అలాంటి కుటుంబానికి చెందిన వ్యక్తుల గురించి సంస్కరహీనంగా మాట్లాడం ఎంత వరకు సమంజసమో బీజేపీ నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. రికార్డు మెజారిటీతో ప్రజలు ఎన్నుకున్న ఓ మహిళా ఎంపీపై అభ్యంతకర వ్యాఖ్యలు చేయడమంటే.. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. భారతీయ సమాజంలో మహిళలకు గొప్ప స్థానముంది. భారతీయ సంస్కృతిని పరిరక్షించేది తామే అంటూ గొప్పలు చెప్పుకునే బీజేపీ నాయకులు బిధూరి చేసిన వ్యాఖ్యలకు ఏం సమాధానం చెబుతారు అంటూ ప్రశ్నించారు. ఇప్పటికైనా బీజేపీ నాయకులు తీరు మార్చుకోవాలని... మీడియాలో ప్రచారం, సంచలనాల కోసం గాంధీ కుటుంబంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయొద్దంటూ హితవు పలికారు.

ఒక మహిళను గౌరవించలేని బిధూరికి టిక్కెట్ ఎందుకిచ్చారో బీజేపీ అగ్రనేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# గేమ్ ఛేంజర్ షో లేనట్టేనా

భారత శక్తి ప్రతినిధి

హైదరాబాద్, జనవరి 8, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన లేటెస్ట్ చిత్రం 'గేమ్ చేంజర్' మరో రెండు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న సంగతి తెలిసిందే. విడుదలకు ఇంత తక్కువ సమయం ఉన్నప్పటికీ అడ్వాన్స్ బుకింగ్స్ పూర్తి స్థాయిలో ప్రారంభం అవ్వకపోవడంతో అభిమానులు ఇంకెప్పుడు బుకింగ్స్ ప్రారంభిస్తారు అంటూ సోషల్ మీడియా లో మేకర్స్ ని ట్యాగ్ చేస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్ లో ఇప్పటికే ఈ చిత్రానికి టికెట్ రేట్స్ పెంచారు, బెనిఫిట్ షోస్ కి కూడా అనుమతిని ఇచ్చారు. కానీ తెలంగాణ లో మాత్రం ఇంకా అనుమతి రాలేదు. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం అక్కడి ప్రభుత్వం కూడా టికెట్ రేట్స్ పెంచుకోవడానికి అనుమతిని ఇచ్చింది. టికెట్ రేట్స్ తో పాటుగా బెనిఫిట్ షోస్ కూడా ఉంటాయట. కానీ కొన్ని కఠినమైన ఆంక్షలు విధించినట్టు ఇండస్ట్రీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. ఆ ఆంక్షలు ఏమిటో ఒకసారి చూద్దాము.ఎట్టిపరిస్థితిలోనూ ఇక మీదట తెలంగాణ లో విడుదలయ్యే పెద్ద హీరోల సినిమాలకు బ్యానర్స్ కట్టేందుకు అనుమతి లేదట. అదే విధంగా థియేటర్లు వద్ద డీజే ని ఏర్పాటు చేసి, అభిమానులు సంబరాలు చేసుకోవడానికి కూడా ఒప్పుకోరట. జనాలు ఒకే చోట గుమ్మిగూడే విధంగా ఉండరాదని నిర్మాత దిల్ రాజుకి సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. దీని గురించి మరికాస్త వివరాలు బయటపడే అవకాశాలు ఉ న్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన జీవో ని విడుదల చేస్తారట. కేవలం 'గేమ్ చేంజర్' చిత్రానికే కాదు, 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకి కూడా టికెట్ రేట్స్ పెంచుతారట. మరోపక్క 'డాకు మహారాజ్' మూవీ నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ 'తమ సినిమాకి టికెట్ రేట్స్ అవసరం లేదు. ఉన్న రేట్స్ సరిపోతాయి' అని అన్నాడట.




చూడాలి మరి ఏమి జరగబోతుంది అనేది. 'గేమ్ చేంజర్' చిత్రం తెలుగు రాష్ట్రాల్లో బ్రేక్ ఈవెన్ పొందాలంటే కచ్చితంగా 150 కోట్ల రూపాయలకు పైగా షేర్ వసూళ్లు రావాలి.

ప్రస్తుతం ఈ సినిమాకి ఉన్న క్రేజ్ ని చూస్తుంటే అవలీల గా వస్తుందని అంటున్నారు ట్రేడ్ పండితులు. ఓవర్సీస్ లో ఈ చిత్రానికి మొదటి రోజు 3.5 మిలియన్ డాలర్ల గ్రాస్ వసూళ్లు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. అందులో కేవలం నార్త్ అమెరికా నుండే ఈ చిత్రానికి 1.5 మిలియన్ డాలర్లకు పైగా గ్రాస్ వచ్చే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు ట్రేడ్ పండితులు. ఎన్టీఆర్ నటించిన 'దేవర' చిత్రానికి విడుదలకు ముందే అడ్వాన్స్ బుకింగ్స్ వంద కోట్ల రూపాయలకు జరిగింది. 'పుష్ప 2 ' కి అయితే వరల్డ్ వైడ్ గా 200 కోట్ల రూపాయిల వరకు అడ్వాన్స్ బుకింగ్స్ జరిగింది. మరి 'గేమ్ చేంజర్' చిత్రానికి ఏమేరకు అడ్వాన్స్ బుకింగ్స్ జరగబోతుంది అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ప్రస్తుతానికి అయితే లిమిటెడ్ షోస్ ద్వారా ఈ సినిమాకి వరల్డ్ వైడ్ గా 15 కోట్ల రూపాయిల అడ్వాన్స్ బుకింగ్స్ జరిగినట్టు తెలుస్తుంది.

# దివ్యాంగుల అభ్యున్నతికి సంపూర్ణ సహకారం అందిస్తాం

పెద్దపల్లి ప్రతినిధి: జనవరి 8, దివ్యాంగుల అభ్యున్నతికి జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన సంపూర్ణ సహకారం అందజేస్తామని ఎమ్మెల్యే విజయరమణ రావు, ×జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలు అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని పెరేడ్ గ్రౌండ్స్ లో స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావుతో కలిసి అలింకో సంస్థ నిర్వహించిన క్యాంపులో ఎంపిక కాబడిన దివ్యాంగులకు 27 లక్షల విలువ గల ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నవంబర్ నెలలో అలింకో సంస్థ ద్వారా క్యాంప్ నిర్వహించి పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో అర్హులైన దివ్యాంగుల ను ఎంపిక చేసామని , ఎంపిక కాబడిన దివ్యాంగులకు నేడు 27 లక్షల విలువ చేసే వివిధ ఉపకారణాలను ఉచితంగా పంపిణీ చేయడం జరుగు తుందని అన్నారు. రాబోయే 2 నెలల వ్యవధిలో మరొకసారి క్యాంపు నిర్వహించి ఇంకా ఎవరైనా దివ్యాంగులు పెండింగ్లో ఉంటే వారిని గుర్తించి అవసరమైన పరికరాల పంపిణీకి చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రతి పాఠశాలను ఆర్.బి.ఎస్.కే బృందాలు పర్యటిస్తూ పిల్లల ఎదుగుదలను రెగ్యులర్ గా మానిటర్ చేస్తున్నారని, ఆరోగ్య సమస్యలు ఉన్న పిల్లలను గుర్తించి వారికి అవసరమైన చికిత్స అందించ డం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. చిన్నపిల్లల ఎదుగుదల సమస్యలను గుర్తించేందుకు మన పెద్దపల్లి జిల్లా మాత శిశు ఆసుపత్రిలో డి.ఈ.ఐ.సి సెంటర్ ను ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. జిల్లాలో వినికిడి సమస్య ఉన్న పిల్లలను గుర్తించామని వారికి త్వరలోనే ఉచితంగా వినికిడి యంత్రాలను అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. దివ్యాంగుల జీవనోపాధి కోసం వ్యాపార యూనిట్ల స్థాపనకు రుణాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సంపూర్ణ సహకారం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాల రావు, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప, ప్రజాప్రతి నిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వశక్తి మహిళా సంఘాల ద్వారా 1000 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి

,పెద్దపల్లి జనవరి 8, రాష్ట్రంలో స్వశక్తి మహిళా సంఘాలచే 1000 మెగా వాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి వర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు బుధవారం ప్రజా భవన్ నుంచి మంత్రులు సీతక్క, కొండ సురేఖ, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్, సెర్ఫ్ సీఈవో దివ్య దేవరాజన్, ట్రాన్స్కో సీఎం డి కృష్ణ భాస్కర్ తో కలిసి మహిళా సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు పై కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పెద్దపెల్లి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఉ ప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తేనే వారి ఎదుగుదలకు అవకాశాలు ఏర్పడతాయని, రానున్న కొత్త విద్యుత్ పాలసీ నేపథ్యంలో ఇంధన, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య గత సంవత్సరం నవంబర్ 19న కుదిరిన ఒప్పందాన్ని జిల్లా కలెక్టర్లు ఉపయోగించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఐదు సంవత్సరాల కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో మహిళలకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలు అందుబాటు లోకి తెస్తున్నామని, పెద్ద మొత్తంలో డబ్బు మహిళా సంఘాల చేతులకి వస్తున్న క్రమంలో వారు వివిధ వ్యాపారాలు చేసుకునేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి వసతులు కల్పించాలని ఆదేశించారు. మహిళా సంఘాలు సోలార్ పవర్ ప్లాంట్ ల ఏర్పాటుకు వారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. మహిళా సంఘాలు ప్లాంట్ల ఏర్పాట్లు లో ఆర్థిక సహాయం కోసం బ్యాంకు అధికారులతో సమన్వయం చేయాలని సూచించారు. మహిళా సంఘాల భూముల్లో ప్లాంట్ లో ఏర్పాటుకు విద్యుత్ శాఖ రెడ్కో ద్వారా టెండర్లు ఆహ్వానించిందని, త్వరలో టెండర్లు ఓపెన్ చేసి వాటిని ఖరారు చేస్తారని వెల్లడించా రు

# నల్గొండ వర్సిటీలో గొడ్డు కారంతో లంచ్

## విద్యార్థునుల ఆందోళనలతో మార్పు...

భారత శక్తి ప్రతినిధి

నల్గోండ, జనవరి 8, పిల్లల చదవుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. విద్యా హక్కు చట్టం ప్రకారం.. అందరూ చదువుకోవాలన్న ఉద్దేశంతో నిర్బంధ విద్య అమలు చేస్తున్నారు. పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, కళాశాల విద్యార్థులకు కూడా కొన్ని రాష్ట్రాల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నాయి. ఇక పేదలు కూడా ఉ న్నత చదవులు చదువోకోవాలని ఫీజు రీయింబర్స్ మెంట్ ఇస్తున్నాయి. ఇక యూనివర్సిటీల్లో చదువుకునే పిల్లలకే కేంద్రం యూసీసీ ద్వారా నిధులు అందిస్తోంది. భోజనంతోపాటు, చదువులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమ వాటాగా సదుపాయాలు కల్పిస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో తెలంగాణలోని ఓ యూనివర్సిటీలో విద్యార్థులను ఖైదీలకన్నా అధ్వానంగా చూస్తున్నారు. గొడ్డుకారంతో భోజనం పెడుతున్నారు. విద్యార్థులు ఈ దృశ్యాలను ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు.నల్గొండలోని మహాత్మాగాంధీ యూనిర్సిటీ యాజమాన్యం విద్యార్థులను ఖైదీల్లా చూస్తోంది. హాస్టళ్లలో ఉండే ఆడ పిల్లలకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం గొడ్డుకారంతో పెడుతున్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. అయినా యాజమాన్యం స్పందిచండం లేదు. ఖైదీలకు కూడా ఇలా గొడ్డుకారంతో భోజనం పెట్టరని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కారంతో భోజనం చేయలేక పస్తులు ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణవేణి హాస్టల్‌లోని విద్యార్థినులు భోజనం నిర్వాహకులతో గొడవకు దిగారు.రోజూ కారంతో టిఫిన్, భోజనం పెట్టడంపై యాజమాన్యం స్పందించకపోవడంతో విద్యార్థినులు నిర్వాహకులను నిలదీశారు. ఇలాంటి అన్నం ఎలా తినాలని ప్రశ్నించారు. మీ పిల్లలకు ఇలాగే పెడతారా అని నిలదీశారు. ప్రభుత్వాలు తమ కోసం కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నా తమకు ఎందుకు ఇలాంటి భోజనం పెడుతున్నారని ప్రశ్నించారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో వీడియోలు, ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు.మహాత్మాగాంధీ యాజమాన్యం తీరుపై నెటిజన్లు మండిపడుతున్నారు. విద్యార్థినులను పిల్లల్లా చూసుకోవాల్సిన యాజమాన్యం ఇలా గొడ్డుకారంతో భోజనం పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరుతున్నారు. నిర్వాహకులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ములుగు లో బిజెపి నాయకుల ఆందోళన

ములుగు జనవరి 8, బిజెపి రాష్ట్ర కార్యాలయం పై జరిగిన దాడిని నిరసిస్తూ ములుగు లో బిజెపి నాయకులు ఆందోళనకు దిగారు. సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ములుగు టౌన్ లో ర్యాలీ నిర్వహించారు. ములుగు ఏరియా ఆస్పత్రి ముందు సీఎం దిష్టిబొమ్మను దగ్ధం చేసారు. అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకుల ఫ్లెక్సీలను చింపేసారు. ఈ నేపథ్యంలో పోలీసులు, బిజెపి నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు భారీగా మోహరించారు. మంత్రి సీతక్క క్యాంప్ కార్యాలయము ముట్టడించేందుకు బిజెపి నాయకులు ప్రయత్నించారు.

## త్వరలో మధిర లో సబ్ జైలు

# ఇక ప్లాస్టిక్ రహిత జైళ్లు

భారత శక్తి ప్రతినిధి

తెలంగాణ జైళ్ల శాఖ వార్షిక నివేదికను ఆ శాఖ డీజీ సౌమ్య మిశ్రా వివరించారు. చంచల్ గూడ లోని జైళ్ల శాఖ సికాలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారుచివరిసారిగా 2019 లో అన్యూల్ మీట్ ఏర్పాటు చేశాం.2024 లో జైల్ అదాలత్ లో 1045 లో అవకాశం కల్పించాం.2650 మంది ఖైదీలు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో ట్రైనింగ్ తీసుకుంటున్నారు. సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను 213 మందిని విడుదల చేశాం. 2024 లో 8 మంది ఖైదీలకు బ్యాంక్ లోన్స్ ఇచ్చాం. జైల్లో ఉండి 750 మంది డిగ్రీ పూర్తి చేశారు. 225 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ పట్ట పొందారు. జైల్లో ఉన్న ఖైదీల ద్వారా ఇంటికి అవసరమైన పరికరాలను ఖైదీలతో తయారు చేయించాం. ఖైదీల నుండి టైలరింగ్,ప్రింటింగ్ ప్రెస్ బేకరి యూనిటి,పౌల్ట్రీ వంటి పరిశ్రమలు ఏర్పాటు చేశాం. జైల్లో ఉన్న ఖైదీలకు ఉపాధి కల్పనకు అవసరమైన జాతీయ చమురు కంపెనీలతో 29 అవుట్ లే అవుట్ లెట్ల ను ఏర్పాటు చేశాం. 2024 లో జైల్ శాఖలో 126 మందిని రిక్రూట్ చేశాం. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జైళ్ల శాఖలో 58 మందికి పదోన్నతులను కల్పించామని అన్నారు.

త్వరలో మధిర లో సబ్ జైల్ వస్తుంది. కొత్తగా వచ్చిన క్రిమినల్ చట్టాల బుక్ ను తెలంగాణ జైళ్ల శాఖ నల్సార్ యూనివ్సిటీ సహకారంతో సిద్ధం చేశాం. నుమయిష్ ఎగ్జిబిషన్ లో మా స్టాల్ ఏర్పాటు చేశాం. గతంలో నుమయిష్ ఎగ్జిబిషన్ లో మా స్టాల్ కి అవార్డు వచ్చింది. జైల్లో ప్లాస్టిక్ రహిత జైల్ గా చేస్తున్నాం. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్కు బానిసైన వారికి సెంటర్లో ఏర్పాటు చేశారు... హైదరాబాద్, చర్లపల్లి, సంగారెడ్డి,నిజామాబాద్ ,త్వరలోనే సెంటర్లో అందుబాటులోకి రానున్నాయి.

# బన్సీలాల్ పేట్ స్కూలును హైస్కూలు చేసేందుకు కృషి

భారత శక్తి ప్రతినిధి

సికింద్రాబాద్ జనవరి 8, వచ్చే విద్యా సంవత్సరం నుండి బన్సీలాల్ పేట డివిజన్ లోని మేకల మండి ప్రాథమికోన్నత పాఠశాల ను ఉన్నత పాఠశాల (హై స్కూల్) గా అప్ గ్రేడ్ చేయించేందుకు కృషి చేస్తానని మాజీమంత్రి, సనత్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. బుధవారం మేకల మండి పాఠశాలలో 1.80 కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను తలసాని అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతి పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జీ ప్లస్ 2 విధానంలో 16 తరగతి గదుల నిర్మాణం చేపట్టగా, పనులు ముగింపు దశకు చేరుకున్నాయని అధికారులు వివరించారు. ప్రస్తుతం 7 వ తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలలో 614 మంది వరకు విద్యార్థులు ఉన్నారని, హై స్కూల్ గా అప్ గ్రేడ్ చేస్తే



విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని, అందుకు సహకరించాలని, అదనంగా మరో 6 తరగతి గదులు మంజూరు చేయించాలని స్కూల్ డెవెలప్మెంట్ కమిటీ సభ్యులు తలసానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లల భవిష్యత్ కు విద్య ఎంతో ప్రధానమని, వారికి బంగారు భవిష్యత్ ను అందించాలనే లక్ష్యంతోనే స్కూల్ అభివృద్ధి కోసం అన్ని విధాలుగా కృషి చేస్తూ వస్తున్నానని గుర్తుచేశారు. 30 మంది విద్యార్థులతో ప్రారంభమైన స్కూల్ లో విద్యార్థుల సంఖ్య నేడు 617 మందికి చేరుకోవడం చాలా సంతోషించదగ్గ విషయమని చెప్పారు. ఈ స్కూల్ పరిసరాలలో ఉండే వారంతా నిరుపేదలేనని, వేలాది రూపాయలు చెల్లించి తమ పిల్లలను ప్రైవేట్ స్కూల్స్ కు పంపించే స్థోమత లేదని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని స్కూల్ అభివృద్ధి లో భాగంగా 16 తరగతి గదుల నిర్మాణం కోసం సర్వ శిక్ష అభియాన్ నుండి 1.15 కోట్ల రూపాయలు మంజూరు చేయించానని, ఆ నిధులు సరిపోవని నా దృష్టికి తీసుకు రాగా తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుండి 65 లక్షల రూపాయలను మంజూరు చేసినట్లు వివరించారు. 7 వ తరగతి అనంతరం విద్యార్థులకు ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రాథమికోన్నత పాఠశాల ను హై స్కూల్ గా అప్ గ్రేడ్ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న జిల్లా విద్యా శాఖ అధికారి రోహిణి నిఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. తల్లిదండ్రులు కూడా తరచుగా స్కూల్ కు వస్తూ తమ పిల్లల అటెండెన్స్, వారు చదువుతున్న తీరు గురించి టీచర్స్ ను అడిగి తెలుసుకోవాలని కోరారు. సక్రమంగా చదువుకునే విధంగా పర్యవేక్షణ చేయాలని అన్నారు. స్కూల్ అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తున్న స్కూల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులను, మాజీ ప్రధానోపాధ్యాయుడు మల్లిఖార్జున్ రెడ్డి ని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అభినందించారు. స్కూల్ అభివృద్ధి కోసం అన్ని విధాలుగా సహకరిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు స్కూల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, టీచర్స్ కృతజ్ఞతలు తెలిపారు.

## కోర్టులపై నమ్మకం వుంది

కరీంనగర్ జనవరి 8,మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హాట్ కామెంట్స్ చేశారు. బిఆర్ఎస్ ను బొంద పెట్టాలనే కాంగ్రెస్, బిజెపి రెండు పార్టీలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అధికారం ఉందని ఎన్ని కేసులు అయినా పెట్టొచ్చున్నారు.న్యాయస్థానంపై నమ్మకం ఉందని, కేటీఆర్ కడిగిన ముత్యాల బయటకు వస్తారని స్పష్టం చేశారు.కరీంనగర్ లో మేయర్ సునీల్ రావు తో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన గంగుల కమలాకర్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ వేధింపులు చిన్నప్పటి నుంచి చూస్తున్నామని చెప్పారు. తెలంగాణ గడ్డపై పుట్టిన ఏ వ్యక్తి కేసులకు భయపడరు.. పారిపోరని తెలిపారు. టిఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ కోసం...ఆరోజు భయపడి పారిపోతే తెలంగాణ వచ్చేదా? అని ప్రశ్నించారు.

బిఆర్ఎస్ రక్తంలో భయం లేదని, తెలంగాణ కోసం ఎలా పోరాడామో.. ప్రజల రక్షణ, తెలంగాణ అభివృద్ధి కోసం అలానే పోరాడుతామన్నారు. కరీంనగర్లో కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి 10 ఎకరాల భూమి కేటాయించామని, టీటీడీ ఛైర్మన్ బిఆర్ నాయుడిని కలిస్తే సానుకూలంగా స్పందించారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పనులు వెంటనే ప్రారంభించాలని కమలాకర్ కోరారు.

## మైనంపల్లికి తప్పిన ప్రమాదం

మెదక్ జనవరి 8,మనోహరబాద్ లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకి ప్రమాదం తప్పింది. అయన ముందస్తు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. కార్యకర్తలు టపాసులు పేలుస్తుండగా వేదిక కింద ఉన్న కార్పేట్ కి మంటలు అంటుకున్నాయి. కార్యకర్తలు వెంటనే గమనించి మంటలు ఆర్పివేసారు.

## ఇబ్రహీంపట్నంలో హైడ్రా కమిషనర్ పర్యటన

రంగారెడ్డిజనవరి 8రంగారెడ్డి జిల్లా తుర్కా యంజాల్ మసాబ్ చెరువు,జీలావర్ ఖాన్ చెరువులను హైడ్రా కమిషనర్ రంగానాధ్ పరిశీలించారు.

చెరువుల ఆక్రమణలపై స్పెషల్ ఫోకస్ పెట్టిన హైడ్రా కమిషనర్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న నిర్మాణాలను అయన పరిశీలించారు.

# హరీష్ రావుకు పార్టీ బాధ్యతలు

భారత శక్తి ప్రతినిధి

హైదరాబాద్, జనవరి 8, ( ఫార్ములా ఈ కారు రేసు కేసులో ఒక స్పష్టత అయితే వచ్చింది. ఈ కేసుకు సంబంధించి కేటీఆర్ అరెస్ట్ ఖాయమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. ఏసీబీ అరెస్ట్ చేస్తే బయటకు బెయిల్ పై వచ్చేందుకు ఎంత సమయం పడుతుందో కూడా తెలియదు. దీంతో న్యాయనిపుణులతో న్యాయపరమైన అంశాలు మాత్రమే చర్చించిన కేటీఆర్ పార్టీ కార్యక్రమాలను ఎవరు తీసుకెళతారన్న దానిపై కూడా గులాబీ పార్టీ నేతలతో సమావేశమయ్యారు. నందినగర్ లోని కేటీఆర్ నివాసం నుంచే ఎర్రవెల్లి ఫాం హౌస్ లో ఉన్న కేసీఆర్ తో కూడా ఈ విషయాలను చర్చించినట్లు తెలిసింది. కేటీఆర్ అరెస్ట్ తర్వాత ఎవరి నాయకత్వంలో పార్టీ పనిచేయాలన్న దానిపై కూడా సమాలోచనలు జరిపారు. అయితే కొందరు ఈ సమావేశంలో కల్వకుంట్ల కవిత పేరు చెప్పారని తెలిసింది. అయితే కేసీఆర్ ఇందుకు అంగీకరించలేదని అంటున్నారు. కవితకు పార్టీ పగ్గాలు తాత్కాలికంగానైనా అప్పగించేందుకు కేసీఆర్ సుముఖత వ్యక్తం చేయలేదని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. హరీశ్ రావు విషయంలోనూ ఆయన అంత సుముఖంగా లేరని చెబుతున్నారు. కవిత, హరీశ్ రావుల పేర్లు కేటీఆర్ జైలుకు వెళ్లిన తర్వాత పార్టీ కార్యక్రమాలను చేపడితే బాగుంటుందన్న సూచనలను కూడా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తోసిపుచ్చినట్లు చెబుతున్నారు. కేటీఆర్ లేని సమయంలో పార్టీ కార్యక్రమాలను ఎవరు పర్యవేక్షించాలన్న దానిపై తాను నిర్ణయం తీసుకుంటానని కేసీఆర్ నేతలకు చెప్పినట్లు తెలిసింది.కానీ నేతలు చెబుతున్న సమాచారం మేరకు కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగుతారని చెబుతున్నారు. మరొకరికి పార్టీ పగ్గాలు అప్పగించడం కంటే తానే బయటకు వచ్చి పార్టీ కార్యక్రమాలకు పిలుపునివ్వడం మంచిదన్న యోచనలో కేసీఆర్ ఉన్నారని అంటున్నారు. కాంగ్రెస్ ఏడాది పాలన పూర్తి కావడంతో తాను ఇకబయటకు రాక తప్పదని కూడా కేసీఆర్ సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది. తానే వచ్చి రాష్ట్ర వ్యాప్త పర్యటన చేసి రాష్ట్రంలో వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. కేటీఆర్ అరెస్ట్ అయిన వెంటనే ఎర్రవెల్లి ఫాం హౌస్ నుంచి కేసీఆర్ బయటకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారని, రాష్ట్ర వ్యాప్త పర్యటనకు ముందు మీడియా సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ వైఫల్యాలను కూడా ఎండగట్టేందుకు ఆయన రెడీ అవుతున్నట్లు గులాబీ పార్టీ వర్గాలు వెల్లడించాయి.



### రిస్క్ తీసుకుంటున్న కేటీఆర్

ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ ను హైకోర్టు కట్టివేసింది. అరెస్టు నుంచి కల్పించిన రక్షణ కూడా ఎత్తి వేసింది. ఉదయం తీర్పు రాగానే సాయంత్రం అలా కేటీఆర్ కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఆయన న్యాయపోరాటం ఆయనకు రిస్క్గా మారుతుందని.. ధైర్యంగా నిలబడి విచారణ ఎదుర్కొంటే ప్రజల నుంచి సానుభూతి అయినా వస్తుందన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో ఉంది. ఇప్పుడు సుప్రీంలోనూ ఊరట లభించకపోతే అన్ని న్యాయపరమైన అవకాశాలను కోల్పోవడంతో పాటు కేసులో ఏదో ఉందని అందుకే ఆయనకు రిలీఫ్ దక్కలేదని ప్రజల్లో ప్రచారం జరిగే అవకాశం ఉంది. ఫార్ములా ఈ రేసు కేసులో ఎలాంటి అవినీతి లేదని కేటీఆర్ గట్టిగా వాదిస్తున్నారు. ఇందులో పస లేదని లొట్టపీసు కేసు అని హైకోర్టు క్వాష్ పిటిషన్ కొట్టివేసిన తర్వాత కూడా వ్యాఖ్యానించారు. అందుకే ఆయన న్యాయపోరాటానికి మొగ్గు చూపారు. ఈ క్రమంలో ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే సుప్రీంకోర్టు వరకూ వెళ్లడం ఎందుకని తప్పు చేయనప్పుడు ఎందుకు అలా కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని కాంగ్రెస్ ప్రశ్నిస్తోంది. నిజాయితీ వరుడు అయితే నిరూపించుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎద్దేవా చేస్తోంది. అయితే రాజ్యాంగపరమైన అన్ని అవకాశాలను వినియోగించుకునే హక్కు తనకు ఉందని.. అందుకే సుప్రీంకోర్టుకు పోయామని న్యాయపోరాటం చేస్తున్నామని కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. ఏసీబీ లేదా ఈడీ ఎలాంటి దూకుడు చర్యలు తీసుకున్నా కేటీఆర్ కు రాజకీయంగా ప్లస్ అవుతుందనే అంచనాలు ఉన్నాయి. అరెస్టులు చేయడం వల్ల రాజకీయంగా ఆయనకు సానుభూతి వస్తుంది తప్ప దాని వల్ల ఉపయోగం ఏమీ ఉండదని ఇప్పటి వరకూ జరిగిన రాజకీయాలతో ఎవరికైనా అర్థం అవుతుందని కాంగ్రెస్ నేతలూ బహిరంగంగానే చెబుతున్నారు. అదే కక్ష సాధింపులు అనే భావన ప్రజలకు రాకుండా న్యాయపరమైన అన్ని అవకాశాలనూ వినియోగించుకున్న తర్వాత అరెస్టు చేస్తే కేటీఆర్ తప్పు చేసినందునే న్యాయవ్యవస్థ రిలీఫ్ ఇవ్వలేదన్న అభిప్రాయం ప్రజల్లోకి వెళ్తుంది. అప్పుడు అరెస్టు చేసినా రియాక్షన్ రాదని అనుకుంటూ ఉండవచ్చు. అందుకే అరెస్టు చేయకుండా కేటీఆర్ కు అన్ని న్యాయపరమైన అవకాశాలను కల్పిస్తున్నారని భావిస్తున్నారు. పిటిషన్ వేయడానికి ఎలాంటి అభ్యంతరాలు లేవు కానీ రాజకీయంగా ఎలాంటి పరిణామాలు వస్తాయన్నదానిపైనే కేటీఆర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే ఏసీబీ సుప్రీంకోర్టులో కేవియట్ వేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఏసీబీ అధికారులు గ్రీన్ కో తో పాటు సబ్సిడరీ కంపెనీల్లో సోదాలు ప్రారంభించారు. ఈ కేసులో ఏ టుగా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్ కు?మార్, ఏ త్రీగా ఉన్న హెచ్ఎండీఏ మాజీ ఉన్నతాధికారి బీఎల్ఎన్ రెడ్డిలకు కూడా ఈడీ నోటీసులు జారీ చేసింది. వారు కూడా విచారణకు హాజరు కాలేదు. తమకు సమయం కావాలని కోరారు. దాంతో వారికీ మరోసారి ఈడీ నోటీసులు జారీ చేసింది. వారిని ప్రశ్నించిన తర్వాతనే కేటీఆర్ ను ప్రశ్నించాలని ఈడీ అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. విచారణలకు అయితే హాజరవుతారు కానీ.. ఏసీబీ కానీ ఈడీ కానీ సుప్రీంకోర్టులో పిటిషన్ తేలే వరకూ చర్యలు తీసుకోకపోవచ్చన్న వాదన వినిపిస్తోంది.

# మారుతోన్న డెస్టినేషన్

భారత శక్తి ప్రతినిధి

హైదరాబాద్, జనవరి 8, హైదరాబాద్ లో నిర్మించిన అత్యాధునిక చర్లపల్లి రైల్వే టెర్మినల్ అందుబాటులోకి వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఢిల్లీ నుంచి వర్చువల్ గా ఈ టెర్మినల్ ను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్ మీద ఉన్న ప్రయాణీకుల ఒత్తిడి తగ్గనుంది. పెరుగుతున్న ట్రాఫిక్ ను తగ్గించడంతో పాటు ప్రయాణికుల అవసరాలను తీర్చడానికి అనుగుణంగా నగర శివార్లలో చర్లపల్లి రైల్వే స్టేషన్ను నిర్మించారు. రూ. 428 కోట్ల వ్యయంతో విమానాశ్రయాన్ని తలపించేలా ఈ రైల్వే టెర్మినల్ ను తీర్చిదిద్దారు.చర్లపల్లి టెర్మినల్ ప్రారంభమైన నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మీద సుమారు 50 వేల మంది ప్రయాణీకు భారం తగ్గనుంది. వారి ప్రయాణ ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం చర్లపల్లి నుంచి 12 జతల రైళ్లు నడుస్తున్నాయి. కొత్త టెర్మినల్ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో మరో 13జతల రైళ్ల అందుబాటులోకి రానున్నాయి. మొత్తం 50 రైళ్లు ఇక్కడి నుంచి రాకపోకలు కొనసాగించనున్నాయి. ఢిల్లీ, చెన్నై, కోల్కతా, వైజాగ్ కు వెళ్లే రైళ్లు ఇప్పుడు చర్లపల్లి నుంచి నపడనున్నారు. సికింద్రాబాద్ స్టేషన్ లో గణనీయంగా రద్దీ తగ్గే అవకాశం ఉంటుంది.ప్రస్తుతం చర్లపల్లి నుంచి 6 ఎక్స్ ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. ఆ రైళ్లలో గోరఖ్ పూర్-సికింద్రాబాద్ ఎక్స్ ప్రెస్, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-హైదరాబాద్ ఎక్స్ ప్రెస్, షాలిమార్ ? హైదరాబాద్ ఈస్ట్ కోస్టు ఎక్స్ ప్రెస్ రైళ్లు ఉన్నాయి. ఇప్పటి వరకు ఈ రైళ్లు సికింద్రాబాద్ స్టేషన్ నుంచి రాకపోకలను కొనసాగించగా, ఇకపై చర్లపల్లి నుంచి ప్రయాణాలను కొనసాగించనున్నాయి. త్వరలోనే మరిన్ని రైళ్లు అందుబాటులోకి రానున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.చర్లపల్లి రైల్వేస్టేషన్ లో మూడు రైళ్లకు హాల్టింగ్ అవకాశాన్ని కల్పించారు. సికింద్రాబాద్ స్టేషన్ నుంచి బయల్దేరే మూడు రైళ్లు చర్లపల్లిలో కాసేపు ఆగనున్నాయి. జనవరి 7 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానుంది. సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్ నగర్ ఎక్స్ ప్రెస్ ఉదయం 8.20 గంటలకు సికింద్రాబాద్లో బయల్దేరి 8.32కి చర్లపల్లికి చేరుకుని ఒక నిమిషం ఆగుతుంది. తిరుగు ప్రయాణంలో సిర్పూర్ కాగజ్ నగర్-సికింద్రాబాద్ ఎక్స్ ప్రెస్ చర్లపల్లికి రాత్రి 7.02 గంటలకు చేరుకుంటుంది. ఇక గుంటూరు-సికింద్రాబాద్ ఎక్స్ ప్రెస్ చర్లపల్లిలో మధ్యాహ్నం 12.41కి, సికింద్రాబాద్-గుంటూరు ఎక్స్ ప్రెస్ మధ్యాహ్నం 12.50కి చర్లపల్లిలో ఆగుతాయి. అటు సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్ నగర్ ఎక్స్ ప్రెస్ సాయంత్రం 3.47కి, సిర్పూర్ కాగజ్ నగర్-సికింద్రాబాద్ ఎక్స్ ప్రెస్ ఉదయం 9.20కి చర్లపల్లిలో ఆగనున్నాయి. ఇక, సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకుని మరో 52 అదనపు రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. వీటిలో కొన్ని రైళ్లకు చర్లపల్లి స్టేషన్ లోనూ స్టాపింగ్ కల్పించారు. ఆయా ప్రాంతాలకు 18వ తేదీ వరకు ఈ ట్రైన్లు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది.

# అడ్డగోలుగా ఆక్రమణలు..

## ఉందిగా జాగా...వేసేయ్ పాగా



భారత శక్తి ప్రతినిధి

ఖమ్మం, జనవరి 8, ( భద్రాద్రి జిల్లాలో రెవెన్యూ వ్యవస్థ గాడి తప్పింది. జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణాల్లో ప్రభుత్వ, అసైన్డ్, సీలింగ్ భూములు, చెరువులు, నాలాలు, శిఖం భూముల ఆక్రమించుకుని విచ్చలవిడిగా నిర్మాణాలు జరుగుతున్నా రెవెన్యూశాఖ అధికారులు మొద్దు నిద్ర వీడట్లేదు. జిల్లా కార్యాలయంలోనే అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వచ్చి పోతున్నారంటే ఇక మారుమూల మండలాల పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పాల్సిన అవసరం లేదు.దీంతో ప్రతి ప్రభుత్వ శాఖలోనూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులు పేరుకుపోతున్నాయి. ఖాళీ జాగా కన్పిస్తే పాగా వేసేయ్ అన్నట్లు ఉంది జిల్లాలో పరిస్థితి. ప్రభుత్వ భూముల్లో ఆక్రమ వెంచర్లు, తప్పుడు సర్వే నంబర్లతో సీలింగ్ భూముల ఆక్రమణలు, చెరువులు నాలాలు, శిఖం భూముల పరిస్థితి దారుణంగా తయారైంది.జిల్లాలో పగలురాత్రీ తేడాలేకుండా వాగుల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. కోర్టు ఆదేశాలను సైతం అమలు చేయలేని దుస్థితిలో ప్రభుత్వ శాఖలు పనిచేస్తున్నాయన్న విమర్శలు విన్పిస్తున్నాయి. వెంగళరావు కాలనీ సమీపంలో వందల ఎకరాల ఫారెస్టు భూమిని కేటీపీఎస్ ఉద్యోగులకు అక్రమ మార్గంలో పట్టాలు చేశారని సమాచారం.రెవెన్యూ అధికారుల లెక్కల ప్రకారం పాల్వంచ పట్టణంలోని సర్వే నంబర్ 444లో మొత్తం విస్తీర్ణం 853.39 ఎకరాలుంటే, అందులో 387 .25 ఎకరాలు నిరుపేదలకు అసైన్ చేశారు. 16 ఎకరాలు ఆక్రమార్కుల చేతిలో ఉంది. సర్వేనం 817లో 2,361.37 ఎకరాల్లో 128 .07 ఎకరాలను నిరుపేదలకు పంపిణీచేశారు. 1,790 ఎకరాలు ఫారెస్టు భూమి, 85.14 ఎకరాలు ఆక్రమణలో ఉంది.సర్వే నం 999లోనూ 4,169.29 ఎకరాలకు 863.23 ఎకరాలను అసైన్ చేశారు. 1,153 ఎకరాలు ఫారెస్టు భూమి కాగా 327.38 ఎకరాలు ఆక్రణకు గురైనట్టు రెవెన్యూ అధికారులే నివేదిక ఇవ్వడం గమనార్హం. తాజాగా 444 సర్వే నంబర్ భూమిలో ఎక్కడో శేఖరంబంజర్ వద్ద ఉన్న 431 సర్వే నంబర్ డాక్యుమెంట్స్ చూపి అధికారులను తప్పుదోవ పట్టిస్తూ సుమారు పదెకరాల ప్రభుత్వ భూమిలో ఓ భూబకాసురుడు ఏకంగా వెంచర్ వేస్తున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.హెచ్పీ గ్యాస్ గోదాం, ఆఫీస్కు భూమి అవసరం ఉందని గత నాలుగేళ్లుగా అర్జీలు పెడుతున్నా.. వారికి రెవెన్యూ అధికారులు భూమి చూపలేక పోతున్నారు. లొంగిపోయిన భూమి ఇవ్వాలన్నా, నిరుపేదలకు ఇంటిస్థలం కావాలన్నా, ప్రభుత్వ అవసరాలకు భూమి అవసరం ఉన్నా పాల్వంచ పట్టణంలో సెంటు భూమి లేదని అధికారులు చెప్తున్నారు. రియల్ ఎస్టేట్ కు, ఆక్రమ కట్టడాలకు మాత్రం భూమి ఎక్కడి నుంచి వస్తుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.రెవెన్యూ శాఖ మంత్రిగా ఉన్నా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పొంగులేటి శ్రీనివాస్రెడ్డి రెవెన్యూ అధికారుల తీరుపై పలుమార్లు హెచ్చరికలు జారీచేసినా వారిలో ఎలాంటి మార్పు రాకపోవడం దారుణం. ఇకనైనా మంత్రి కల్పించుకొని ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన అవసరం ఉందని జిల్లా వాసులు కోరుతున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేసిన వారిపై అప్పటి కలెక్టర్ రజత్కుమార్ షైనీ ఉక్కుపాదం మోపారు. స్థానిక కేఎస్ఎం పెట్రోల్ బంకు నుంచి కలెక్టరేట్ వరకు రోడ్డుకు అనుకొని ఉన్న భూమి సర్వే నం 444/1 గా గుర్తించి ఎలాంటి నిర్మాణాలు చేయరాదని ఆదేశాలు జారీచేశారు. కానీ, ప్రస్తుతం ఆ భూముల్లో నిర్మాణలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటంలేదు.మరోవైపు నవభారత్ 444 సర్వే నంబర్లో సీలింగ్ భూముల్లో తప్పుడు సర్వే నంబర్లతో దొడ్డిదారిన వెంచర్ల వేసి స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నా పట్టించుకొనే నాథుడే లేడు. ఇవి కలెక్టరేట్కు కూతవేటు దూరంలో జరుగుతున్న అక్రమాలు.ఇక పాల్వంచ మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి మండలంలో పాల్వంచ మున్సిపాల్టీ నంబర్ చూపి తప్పుడు డాక్యుమెంట్స్తో ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేకంగా హెచ్ కన్వెన్షన్ నిర్మిచడమే కాకుండా ప్రభుత్వ భూమని ఆక్రమించి దర్జాగా మెటల్ రోడ్డు నిర్మించినా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.పాల్వంచ పట్టణ పరిధిలోని గుడిపాడు మోక్షవెంకటేశ్వరస్వామి భూములు ఆక్రమణకు గురైనట్టు అనుమానించి సర్వే చేయాలని ఎండోమెంట్ అధికారులు రెవెన్యూ శాఖను కోరి నెలలు గడుస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదు

# జగన్ ఎఫెక్ట్... మై హోమ్ లీజులు రద్దు

భారత శక్తి ప్రతినిధి



అనంతపురం, జనవరి 8, తనకు మీడియా సపోర్ట్ లేదంటూనే.. గత ఐదేళ్లుగా పాలన చేశారు జగన్. అదే సమయంలో వైసీపీ ప్రభుత్వం నుంచి చాలా రకాల ప్రయోజనాలు పొందింది ప్రధాన మీడియా. ఏపీ ప్రభుత్వం దూకుడు నిర్ణయాలు తీసుకుంటోంది. ముఖ్యంగా గత ప్రభుత్వం అడ్డగోలుగా ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని భావిస్తోంది. అందులో భాగంగా ఏపీవ్యాప్తంగా ఉన్న లైమ్ స్టోన్ లీజుల విషయంలో పున సమీక్షిస్తోంది. అందులో భాగంగా మై హోమ్ గ్రూపునకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని భావిస్తోంది. వైసిపి ప్రభుత్వం అనంతపురం తో పాటు చాలాచోట్ల లైమ్ స్టోన్ లీజులను 50 ఏళ్ల వరకు మై హోమ్ గ్రూపునకు కేటాయించింది. వీటిని రద్దు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇది సంచలన అంశంగా మారింది.మై హోమ్ గ్రూపునకు చెందినదే టీవీ 9. గత ఐదేళ్లుగా వైసీపీకి అనుకూలంగా వ్యవహరించింది ఈ మీడియా. మై హోమ్ గ్రూప్ చైర్మన్ రామేశ్వరరావు, ఆయన కుమారుడు టీవీ9 మీడియాను వైసీపీకి అప్పగించినట్లు విమర్శ ఉంది. దాని ప్రతిఫలంగా రాష్ట్రవ్యాప్తంగా అడ్డగోలు లీజులు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ఐదేళ్లుగా టీవీ9 తెలుగుదేశం పార్టీని టార్గెట్ చేసుకుంది. చంద్రబాబుతో పాటు లోకేష్ కు వ్యతిరేకంగా కథనాలు వండి వార్చింది. ఒకానొక దశలో వ్యక్తిత్వ హననానికి కూడా పాల్పడింది. కానీ యాజమాన్యం ఎటువంటి చర్యలకు దిగలేదు. అయితే నాడు వైసిపికి టీవీ9 మీడియాను అప్పగించడమే అందుకు కారణం.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మై హోమ్ గ్రూపునకు కేటాయించిన లీజులను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీంతో వెంటనే గ్రూప్ చైర్మన్ రామేశ్వరం తో పాటు ఆయన కుమారుడు చంద్రబాబును కలిశారు. లీజులను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అయితే దీనిపై చంద్రబాబు నుంచి ఎటువంటి స్పందన రాలేనట్లు సమాచారం. గతం మాదిరిగా చంద్రబాబు ఉదాసీనంగా వ్యవహరించే అవకాశం లేదు. ఈ విషయంలో పార్టీ యువనాయకత్వం ఆలోచన మరోలా ఉంది. ఇటువంటి వారి విషయంలో ఎంతవరకైనా ముందుకెళ్లాలని యువ నాయకత్వం భావిస్తోంది. అందుకే గనుల లీజు విషయంలో మై హోమ్ గ్రూపునకు డోర్ క్లోజ్ అయినట్లు సమాచారం. మరి టీవీ9 ద్వారా ఏపీ ప్రభుత్వంపై అదే దూకుడుతో ముందుకు వెళ్తారా? వెనక్కి తగ్గుతారా అన్నది చూడాలి.

# రైల్వే లైన్‌కు అమరావతి రైతులు అడ్డు

భారత శక్తి ప్రతినిధి



విజయవాడ, జనవరి 8, అమరావతి రాజధాని నిర్మాణం పై ఫోకస్ పెట్టారు చంద్రబాబు . గత అనుభవాల దృష్ట్యా పనులు వీలైనంతవరకు వేగవంతంగా పూర్తి చేయాలని భావిస్తున్నారు. అదే సమయంలో రోడ్డు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్రం ముందుకు వస్తోంది. ఒకవైపు అమరావతి రాజధాని పనులతో పాటు సమాంతరంగా కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నది చంద్రబాబు లక్ష్యం. ఈ విషయంలో కేంద్రం కూడా సానుకూలంగా ఉండడంతో పనులను పరుగులెత్తించాలని చంద్రబాబు భావిస్తున్నారు. కానీ దీనికి అమరావతి రైతులుఅడ్డుపడుతుండడం విశేషం. ఇన్ని రోజులు చంద్రబాబు కోసం పరితపించిన వారు ఇప్పుడు వ్యతిరేకిస్తుండడం ప్రాధాన్యత సంతరించుకుంది.అమరావతి రాజధాని నిర్మాణంలో భాగంగా గుంటూరు, విజయవాడ నగరాలను అనుసంధానం చేస్తూ రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు ఈ లైను నిర్మించనున్నారు. నంబూరు జంక్షన్ గా చేయనున్నారు. తద్వారా అమరావతి రాజధాని నిర్మాణానికి రెండు నగరాలు అనుసంధానం కానున్నాయి. గుంటూరు వెళ్లే అవసరం లేకుండా చెన్నై తిరుపతి కూడా వెళ్ళిపోవచ్చు. ప్రస్తుతం ఈ రైల్వే లైన్ కు సంబంధించి సర్వే జరుగుతోంది. ఎన్టీఆర్ జిల్లాలో అధికారులు భూమిని సేకరించాల్సి ఉంది. దీనికి గాను నోటిఫికేషన్ జారీ చేశారు. స్థానికంగా సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. అమరావతిని నిర్మించేందుకు 29 గ్రామాల పరిధిలో భూ సమీకరణ ఎలా జరిగిందో.. అలానే తమ భూములు తీసుకోవాలని ఇక్కడి రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా కంచికర్ల మండలంలో భూసేకరణ జరుగుతోంది. అయితే ఈ లైన్ ఏర్పాట్లు భాగంగా భూములు కోల్పోతున్నవారు తమ కుటుంబంలో ఒకరికి రైల్వే ఉద్యోగం కావాలని కోరుతున్నారు. అలాగే గ్రామాల్లో రోడ్ల మరమ్మతులతో పాటు కొత్త రహదారులు వేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో అధికారులకు షాక్ తగులుతోంది.ఒకవైపు వీలైనంత త్వరగా అమరావతి ప్రాజెక్టులను పూర్తి చేయాలని చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారు. ఎట్టి పరిస్థితుల్లో 2029 నాటికి పూర్తిస్థాయిలో అమరావతి నిర్మాణ పనులు పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఒకవైపు రాష్ట్ర పాలనతో పాటు సమాంతరంగా అమరావతి పై ఫోకస్ పెట్టారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే అమరావతి రైతుల నుంచి కొత్త కోరికలు వస్తుండడంతో.. ప్రభుత్వానికి షాక్ తగిలినట్లు అవుతోంది. అయితే ఈ కొత్త రైల్వే లైన్ విషయంలో రైతుల నుంచి వస్తున్న అభ్యంతరాలపై ప్రభుత్వం ఎలా ముందుకెళ్తుందో చూడాలి.

# తెలుగు రాష్ట్రాల్లో చర్చ ఎవరు బెటర్...

భారత శక్తి ప్రతినిధి



హైదరాబాద్, జనవరి 8, ( ఎన్నికల సమయంలో అన్నిరాజకీయ పార్టీలు అలివి కాని హామీలు ఇస్తాయి. ఆ హామీలను విని ప్రజలు పట్టం కడతారు. తర్వాత అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల అమలు విషయంలో అధికార పార్టీ గత ప్రభుత్వం పై నెపం నెట్టే ప్రయత్నం చేస్తుంది. అది ఆంధ్రప్రదేశ్ అయినా.. తెలంగాణ అయినా ఒక్కటే. గత ప్రభుత్వాలు చేసినఅప్పుల కారణంగా తాము సంక్షేమ పథకాలను అమలు చేయలేకపోతున్నామని అక్కడ చంద్రబాబు, ఇక్కడ రేవంత్ రెడ్డి పదే పదే చెబుతున్నారు. ప్రజలకు అవన్నీ అనవసరం. ఎన్నికలకు ముందు అప్పుల గురించి ముందే తెలిసినా ఎన్నికల ప్రచారంలో మాత్రం హామీలు ఇచ్చి ఇప్పుడు కోత పెట్టడం పై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వస్తే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి ఇరవై వేల రూపాయల పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పది వేల రూపాయలతో కలిపి తాము పది వేలు కలిపి అన్నదాత సుఖీభవ పథకం కింద త్వరలోనే రైతులకు సాయం అందిస్తామని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వం కూడా అదే మాదిరి నాడు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను కలిపి రాష్ట్ర నిధులను చేర్చిరైతులు సాయం అందచేసింది. ఇప్పుడు చంద్రబాబు కూడా అదే తరహాలో రైతు లకు పెట్టుబడి సాయాన్ని పదివేలు కేంద్రం ఇస్తే పది వేలు ప్రభుత్వం ఇస్తామని ప్రకటించడం ఎంతవరకూ సబబని ప్రశ్నిస్తున్నారు. ఇక్కడే పదివేల రూపాయలు కోత పెట్టారని రైతులు అంటున్నారు.నాడు వైసీపీ ప్రభుత్వం కూడా అప్పట్లో ఆరువేలు కేంద్ర ప్రభుత్వ నిధులు, రాష్ట్ర ప్రభుత్వం మరో ఆరు వేల రూపాయలను కలిపి పన్నెండు వేల రూపాయలను రైతులకు చెల్లించేది. కానీ చంద్రబాబు ఇరవై వేల రూపాయలు సాయం చేస్తామని ప్రకటించడంతో గత ఎన్నికల్లో రైతులందరూ కూటమి ప్రభుత్వం వైపు మొగ్గు చూపారు. దీంతో అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం చంద్రబాబు తమ ప్రభుత్వం నుంచి పదివేల రూపాయలను మాత్రమే రైతులకు ఇవ్వడమేంటన్న ప్రశ్నఎదురవుతుంది. పీఎం కిసాన్ సమ్మాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఒక్కసారిగా పదివేల రూపాయలకు పెంచింది. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం పెంచకపోతే చంద్రబాబు ఇచ్చేవారు కాదా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. అయితే తమది కూటమి ప్రభుత్వం కాబట్టి రెండు పార్టీలూ కూటమిలో ఉన్నాయి కాబట్టి తాము కలసి సాయం అందచేస్తామని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు.మరొక వైపు తెలంగాణలో మాత్రం రేవంత్ రెడ్డి రైతులకు పన్నెండు వేల రూపాయలు ప్రకటించారు. కేవలం రైతులకు మాత్రమే కాదు వ్యవసాయకూలీలకు కూడా సాయం అందచేస్తామని ప్రకటించారు. తెలంగాణలో రైతులకు అదనంగా రెండు వేల రూపాయలు అందుతున్నాయి. తెలంగాణలోని రైతులకు కూడా కేంద్ర ప్రభుత్వం పది వేల రూపాయలు ఇస్తుండగా, రేవంత్ రెడ్డి సర్కార్ పన్నెండు వేల రూపాయలు ఇస్తుంది. అంటే ఇక్కడ అదనంగా రెండు వేల రూపాయలు చెల్లిస్తుంది. ఇక్కడ కూడా తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఎన్నికలకు ముందు పదిహేను వేల రూపాయలు రైతు భరోసా ఇస్తామని ప్రకటించింది. అయితే దానిని మూడు వేల రూపాయలు తగ్గించిందన్న విమర్శలు కూడా విపక్షాల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. కానీ ఆంధ్రప్రదేశ్ తో పోల్చుకుంటే తెలంగాణ లో రైతులకు అదనంగా రెండు వేల రూపాయలు రైతు భరోసా నిధులు జమ అవుతుండటంతో ఏపీ కంటే తెలంగాణాయే బెటర్ అన్న కామెంట్స్ సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. అంటే చంద్రబాబు కంటే రేవంత్ రెడ్డి బెటర్ అంటూ కొందరు నెట్టింట కామెంట్స్ పెడుతున్నారు.

# ఓ వైపు చలి... మరో వైపు వైరస్

భారత శక్తి ప్రతినిధి




హైదరాబాద్, జనవరి 8,రెండు తెలుగు రాష్ట్రాల్లో చలిగాలుల తీవ్రత తగ్గలేదు. రోజురోజురోకూ కనిష్ట ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి.మరోవైపు హెచ్ఎంపీవీ వైరస్ భయపెడుతుంది. చలికాలంలో వైరస్ వ్యాప్తి చెందుతుందన్న భయంతో ఈ చలి ఎప్పుడు తగ్గుతుందా? అని అందరూ వెయిట్ చేస్తుంటారు. చలి తీవ్రత పెరగడంతో ప్రజలు వణికిపోతున్నారు. సాయంత్రం ఐదు గంటల నుంచి ఉదయం పది గంటల వరకూ చలి తీవ్రత అస్సలు తగ్గడం లేదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు బయటకు రావడానికే భయపడుతున్నారు. ఉదయం విధులకు వెళ్లాల్సిన వారు సయితం చలి తీవ్రతకు ఇబ్బంది పడుతున్నారు. గీజర్ల వాడకం పెరిగిపోయింది. కరెంట్ బిల్లు కూడా తడిసి మోపెడవుతుంది. తెలంగాణలో చలి తీవ్రత బాగా పెరిగింది. కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మెదక్ లో అత్యల్పంగా 9.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయినట్లు వాతావరణ శాఖ అధికారుల తెలిపారు. పటాన్‌చెరులో 11.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఆదిలాబాద్, కుమురం భీం జిల్లాల్లోనూ చలి తీవ్రత ఎక్కువగా ఉంది. చలి మంటలతో చలి నుంచి అనేక మంది కాపాడుకుంటున్నారు. అయితే చలి తీవ్రత కారణంగా అనేక మంది వ్యాధుల బారిన పడుతున్నారు. జలుబు, దగ్గు, జ్వరం వంటి రోగాలతో ఆసుపత్రులకు వస్తున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులన్నీ ఇటువంటి రోగాలతో వస్తున్న వారితో కిటకిట లాడుతున్నాయని వైద్యనిపుణుల చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీ ఏరియాలోనూ చలి తీవ్రత ఎక్కువగా ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో చలి చంపేస్తుంది. ఏపీలోని ఏజెన్సీల్లో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దీంతో పాటు హెచ్ఎంపీవీ వైరస్ ఈ కాలంలో ఎక్కువగా వ్యాప్తి చెందుతుందని భావించి ప్రజలు భయాందోళనలకు గురి అవుతున్నారు. హైదరాబాద్ వంటి నగరంలో ఉదయం పది గంటల వరకూ వీధులన్నీ నిర్మానుష్యంగాకే కనిపిస్తున్నాయి. చలి దెబ్బకు వ్యాపారాలు కూడా దెబ్బతిన్నాయని చిరు వ్యాపారులు చెబుతున్నారు. చలికి పండ్ల విక్రయాలు కూడా తగ్గాయంటున్నారు. మరో నాలుగు రోజులు చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని అధికారులు చెబుతున్నా, శివరాత్రి వరకూ చలి ఇలాగే ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు.

# ఫిబ్రవరి 12 నుంచి మేడారం జాతర

భారత శక్తి ప్రతినిధి

హైదరాబాద్, జనవరి 8, ( ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర, తెలంగాణ కుంభమేళాగా పేరొందిన మేడారం సమ్మక్క, సారలమ్మ మినీ జాతర తేదీ ఖరారైంది. ఫిబ్రవరి 12 నుంచి ఫిబ్రవరి 15వరకు మేడారం మినీ జాతర జరగనుందంటూ 2024 అక్టోబర్‌లోనే మేడారం ఆలయ ట్రస్టు షెడ్యూల్‌ను ప్రకటించింది. జాతరకు సంబంధించిన ఏర్పాట్లను ప్రారభించాలని మేడారం పూజారుల సంఘం రాష్ట్ర దేవదాయ శాఖ అధికారులనుకోరింది. కాగా తాజాగా ఈ జాతర ఏర్పాట్లపై అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష చేపట్టారు. భక్తులకు సౌకర్యాలు, తదితర అంశాలపై చర్చించారు. ఈ మీటింగ్ కు ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్, ఇతర అధికారులు హాజరయ్యారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి సీతక్క, అధికారులను ఆదేశించారు. మేడారం పూజారుల ప్రకారం, నాలుగు రోజులపాటు జరగనున్న ఈ జాతరలో భాగంగా.. ఫిబ్రవరి 12న ఆలయ శుద్ధి, పూజలు, గ్రామ నిర్భంధంతో సహా ఆచారాలు నిర్వహించనున్నారు.



ఫిబ్రవరి 13 న, సమ్మక్క - సారలమ్మ దేవతలను పసుపు, కుంకుమలతో పూజిస్తారు. ఫిబ్రవరి 14, 15న మండమెలిగే కార్యక్రమం జరగనుంది. రాష్ట్రప్రభుత్వం రెండేళ్లకు ఒకసారి మేడారం జాతరను నిర్వహిస్తుండగా.. భక్తుల అభ్యర్థన మేరకు ఇటీవలి కాలంలో మినీ జాతర (మండ మెలిగే)ను నిర్వహిస్తున్నారు. కాకతీయ రాజులకు ఎదురించి పోరాడిన ఆదివాసీ మహిళలు సమ్మక్క, సారక్కలను స్మరించుకునేందుకు ఈ జాతరను నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం తాడ్వాయి మండలంలోని చిన్న మేడారం గ్రామంలో నిర్వహించే సమ్మక్క-సారక్క జాతరకు గిరిజనలతో పాటు, పలు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివస్తారు.తెలంగాణలో జరిగే ఈ అతిపెద్ద జాతరకు రాష్ట్రం నుంచి మాత్రమే కాకుండా మహారాష్ట్ర, ఒరిస్సా, చత్తీస్ఘడ్ రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. వనదేవతలకు బంగారం (బెల్లం) రూపంలో తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఆ సమయంలో వనంలో కొలువైన వనదేవతకు జనం మధ్యకు రావడంతో అడవంతా జనసంద్రమవుతుంది. అయితే మహా జాతర నిర్వహించిన మరుసటి సంవత్సరం మినీ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయనుంది.

# కనిష్టానికి వృద్ధిరేటు..

భారత శక్తి ప్రతినిధి

ముంబై, జనవరి 8,భారత ఆర్థిక వ్యవస్థ క్రమంగా బలపడుతోంది.. గతంతో పోలిస్తే ఆర్థిక వృద్ధి గాడిలో పడింది.. కాస్త మందగమనం ఉన్నప్పటికీ.. అనేక విషయాల్లో ముందంజలోనే ఉంది.. ఈ క్రమంలో ఎఫ్ వై25లో భారతదేశ జీడీపీ వృద్ధి 4 సంవత్సరాల కనిష్ట స్థాయి 6.4%కి చేరుకోవచ్చని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. మొదటి ముందస్తు అంచనాల ప్రకారం.. మందగమనం, ఆర్థిక కార్యకలాపాల గురించి హైలైట్ చేస్తుంది.. భారత ఆర్థిక వ్యవస్థ నాలుగేళ్లలో అత్యంత నెమ్మదిగా వృద్ధి చెందగలదని సూచిస్తుంది. నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (ఔూా) విడుదల చేసిన మొదటి ముందస్తు అంచనాల ప్రకారం.. భారతదేశ ఉఆఖ వృద్ధి ఎఫ్ వై24లో 8.2% నుంచి ఎఫ్ వై25లో 6.4%కి తగ్గుతుందని అంచనా వేసింది..మొదటి ముందస్తు అంచనాల మందగమనం ఆర్థిక కార్యకలాపాల మరింత పతనాన్ని హైలైట్ చేస్తుంది.. ఆర్థిక వ్యవస్థ గత నాలుగు సంవత్సరాలతో పోలిస్తే అత్యంత నెమ్మదిగా వృద్ధి చెందగలదని సూచిస్తుంది."ఎఫ్ వై 2023-24 కోసం జీడీపీ తాత్కాలిక అంచనా లో 8.2% వృద్ధి రేటుతో పోలిస్తే ఎఫ్ వై 2024-25లో వాస్తవ జీడీపీ 6.4% పెరుగుతుందని అంచనా వేసింది.. నామమాత్ర జీడీపీ 9.7% వృద్ధి రేటును సాధించింది. ఎఫ్ వై 2024-25 ఈజలో 9.6% వృద్ధి రేటు కంటే ఎక్కువ 2023-24" అని ఔూా డేటా పేర్కొంది.మార్చి 2025తో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇటీవలి రిజర్వ్ బ్యాంక్ అంచనా 6.6% కంటే ఈ అంచనా తక్కువగా ఉంది.. ముందస్తు అంచనా, బడ్జెట్ లెక్కల్లో కీలక పాత్ర పోషిస్తుంది.. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో నమోదైన 5.4% జీడీపీ వృద్ధికి షాక్ ఇచ్చింది. ఈ ఆశ్చర్యకరమైన సంఖ్య ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి దాని వృద్ధి అంచనాను మునుపటి 7.2% నుంచి.. 6.6%కి తగ్గిస్తూ భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రకటన విడుదల చేసింది..స్థిర ధరల వద్ద వాస్తవ జిడిపి ఎఫ్ వై24లో రూ.173.82 లక్షల కోట్ల నుంచి ఎఫ్‌వై25లో రూ.184.88 లక్షల కోట్లకు పెరుగుతుందని అంచనా. ప్రస్తుత ధరల ప్రకారం నామమాత్రపు ఉఆఖ గత ఏడాది రూ.295.36 లక్షల కోట్లతో పోలిస్తే 9.7% వృద్ధి చెంది రూ.324.11 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా.రియల్ గ్రాస్ వాల్యూ యాడెడ్ (ఉఎం) 6.4% వద్ద పెరుగుతుందని అంచనా వేయగా.. ఇది ఎఫ్ వై 24లో 7.2% నుంచి క్షీణత ఉండవచ్చు..మందగమనం ఉన్నప్పటికీ, కీలక రంగాలు ఆశాజనకంగా ఉన్నాయి. వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలు ఎఫ్ వై 24లో 1.4% నుంచి 3.8% పెరుగుతాయని అంచనా వేశారు.. నిర్మాణ రంగం 8.6%, ఆర్థిక, రియల్ ఎస్టేట్, వృత్తిపరమైన సేవలు 7.3% వృద్ధి చెందుతుందని అంచనా వేశారు.గృహ వ్యయానికి కీలక సూచిక అయిన ప్రైవేట్ తుది వినియోగ వ్యయం (ఖఈఅఇ) ఎఫ్ వై 24లో 4.0%తో పోలిస్తే ఎఫ్ వై 25లో 7.3% పెరుగుతుందని అంచనా వేశారు. ఇంతలో, ప్రభుత్వ తుది వినియోగ వ్యయం (ఉఈఅఇ) గత ఆర్థిక సంవత్సరం 2.5% నుంచి 4.1% వృద్ధి రేటుతో పుంజుకోవచ్చని అంచనా వేశారు.వృద్ధి క్షీణించినప్పటికీ, కొన్ని రంగాలు స్థితిస్థాపకంగా ఉండే అవకాశం ఉందని ఈ అంచనాలు పేర్కొంటున్నాయి..

# ఏపీకి ప్రత్యేక హోదా.. విభజన హామీలపై మోడీతో ప్రకటన చేయించండి వైఎస్ షర్మిలా రెడ్డి

భారత శక్తి ప్రతినిధి

విజయవాడ జనవరి 8, చంద్రబాబు గారు..మీరు మోడీ కోసం ఎదురు చూస్తుంటే, ఆయన ఇచ్చిన వాగ్దానాల కోసం రాష్ట్రం ఎదురు చూస్తోందని ఏపీసీసీ ఛీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి అన్నారు. విభజన హామీలపై చేసిన మోసాలపై నిలదీసేందుకు ప్రజానీకం ఎదురు చూస్తోంది. తిరుపతి వేదికగా మీ సమక్షంలోనే రాష్ట్రానికి 10 ఏళ్లు ప్రత్యేక హోదా అన్నారు. 10 ఏళ్లు కాదు 15 ఏళ్లు కావాలని మీరు అడిగారు. మాటలు కోటలు దాటాయి తప్పిస్తే.. చేతలకు దిక్కులేదని అన్నారు.

రాష్ట్రానికి సంజీవని లాంటి హోదా హామీని అందరు కలిసి ఆటకెక్కించారు. వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చిన పాపాన పోలేదు. ఢిల్లీని తలదన్నే రాజధాని కట్టలేదు. పారిశ్రామిక కారిడార్లు స్థాపన జరగలేదు. 10 ఏళ్లు దాటినా పోలవరం నుంచి చుక్క నీరు పారలేదు. కడప స్టీల్ కట్టలేదు. విశాఖ ఉక్కును రక్షించలేదు. ఏటా 2 కోట్ల ఉద్యోగాల్లో కనీసం లక్ష ఉద్యోగాలు కూడా రాష్ట్రానికి ఇచ్చింది లేదు. విశాఖకు వస్తున్న ప్రధాని మోడీ గారిని, ముఖ్యమంత్రి చంద్రబాబు గారిని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారిని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. విశాఖ వేదికగా ప్రధానితో ప్రత్యేక హోదా ప్రకటన చేయించండి. విభజన హామీలపై క్లారిటీ ఇప్పించండి. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ లేదని మోడీతో పలికించండని అన్నారు.

# ఫార్ములా ఈ-రేసు కేసు.. ఏసీబీ విచారణకు హాజరైన అర్వింద్ కుమార్

భారత శక్తి ప్రతినిధి

హైదరాబాద్ జనవరి 8 ఫార్ములా ఈ-రేసు కేసులో ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో ఆయన ఏ2గా ఉన్నారు. నిధుల బదలాయింపులో ఆయన కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలున్నాయి. తన పరిధిలో ఉన్న హెచ్ఎండీఏ నుంచి ఎఫ్ఈవో(ఫార్ములా-ఈ ఆపరేషన్స్)కు హెచ్ఎండీఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ బీఎల్ఎన్ రెడ్డి ద్వారా నిధులు బదిలీ చేసినట్లు సమాచారం. అప్పటి మంత్రి కేటీఆర్ (ఖఖీ) ఆదేశాలతోనే నిధులు బదిలీ చేసినట్లు గతంలో అర్వింద్ కుమార్ ప్రభుత్వానికి వివరణ ఇచ్చారని సమాచారం.

# ఆలయ హుండీలో చోరీ

గురజాల జనవరి 8, పల్నాడు జిల్లా గురజాల మండలంలోని దైద బిలంలో ఉన్న శ్రీగంగా పార్వతి సమేత అమరలింగేశ్వరస్వామి హుండీని ఓ వ్యక్తి ధ్వంసం చేసి రూ.10 వేలు అపహరించాడు. ఆలయంలో దొంగతనం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం ఉదయం వాచ్మెన్ బిలం తలుపులు తెరిచి చూడగా హుండీ ధ్వంసమైనట్లు గుర్తించి ఈవో పూర్ణ చంద్రరావుకు సమాచారం అందించారు. ఈమేరకు ఈవో పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఆలయానికి చేరుకొని సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడ్ని గుర్తించారు. జరిగిన ఘటనపై ఆలయ అర్చకులు మాట్లాడుతూ ప్రసిద్ధ శైవక్షేత్రం దైద అమరలింగేశ్వర స్వామి వారి వారి బిలంలో కొంతమంది దుండగులు చోరీ చేశారని , ఈ చోరీలో సుమారు పదివేల రూపాయలు నగదు దుండగులు అపహరించారని వారు తెలిపారు. జరిగిన ఘటనపై గురజాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా , గురజాల పోలీసులు కేసు నమోదు చేసారు.

# మీర్ పేట్ లో బీజేవైఎం నిరసన

## సిఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధానికి యత్నం

భారత శక్తి ప్రతినిధి

రంగా రెడ్డి జనవరి 8, మంగళవారం నాడు బీజేపీ కార్యాలయం పై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడంపై బుధవారం బీజేవైఎం నిరసన వ్యక్తం చేసింది. మీర్ పేట్ చౌరస్తా లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నిస్తున్న సమయం లో పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది.

దీంతో బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు రోడ్డు పై బైఠాయించే నిరసన వ్యక్తం చేశారు. బీజేవైఎం రంగా రెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్ చింతల రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పాలన మొత్తం విధ్వంసకరంగా సాగుతుందని మండిపడ్డారు. కార్యకర్తల పై,పార్టీ ఆఫీస్ పై దాడి చేసిన గుండాలను వెంటనే అరెస్ట్ చేయాలని చింతల రాఘవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజెపి కార్యకర్తల సహనాన్ని పరీక్షించవద్దని తిరిగి దాడి చేస్తే కాంగ్రెస్ నాయకులు ఒకరు కూడా బయట తిరుగలేరని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన హామీల పై పాలన పై దృష్టి సారించాలని సూచించారు. అందోళనకారులను పోలీసులు అరెస్ట్ చేసి మీర్ పేట్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# తిరుమలకు వచ్చే భక్తుల కోసం కీలక నిర్ణయం

తిరుపతి జిల్లా ప్రతినిధి, జనవరి 08,భారత శక్తి : తిరుమలలో హోటల్స్, రెస్టారెంట్స్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల యజమానులతో టీటీడీ అడిషనల్ ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి సమావేశం అయ్యారు.. వారికి పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా నిబంధనలు, పరిశుభ్రతను పాటించాలన్నారు. భక్తుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ నెల 10న వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభంకానుండటంతో టీటీడీ అడిషనల్ ఈవో యజమానులతో చర్చించి సూచనలు చేశారు.

తిరుమలకు వచ్చే భక్తుల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించడం




టీటీడీ ప్రథమ లక్ష్యమన్నారు అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి. తిరుమలలోని హోటళ్ల యజమానులు భక్తులకు ఆహారాన్ని అందించడంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. తిరుమలలోని ఆస్థాన మండపంలో హోటళ్ల యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు ఈవో పాల్గొన్నారు. తిరుమలలోని అన్ని హోటళ్లు, తినుబండార కేంద్రాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు భక్తుల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తినుబండారాల ఆవరణలో పరిశుభ్రత పాటించాలని, నిబంధనలు, మార్గదర్శకాలను పాటిస్తూ తిరుమల ఖ్యాతిని నిలబెట్టాలని సూచించారు.

సరైన సీటింగ్ ఏర్పాట్లు, పొడి మరియు తడి చెత్తలను వేర్వేరు డస్ట్ బిన్‌లలో వేరు చేయడం, హోటల్ నిర్వాహణ ధృవపత్రాలను తమ హోటళ్ల బయట ప్రదర్శించడం, ముడి సరుకుల నిల్వ కోసం సరైన నిల్వ గది ఏర్పాటు, పెస్ట్ కంట్రోల్ మెషీన్‌లను ఉంచడం, సరైన అగ్నిమాపక భద్రతా చర్యలు తీసుకోవడం, పారిశుద్ధ్య విధానాలను పాటించడం వంటివి తప్పకుండా పాటించాలని ఆయన అన్నారు. అనంతరం దుకాణదారులందరికీ ఎస్ఓపీ జాబితాను సిద్ధం చేయాలని, చెక్‌లిస్ట్ ఇవ్వాలని, ఏవైనా కొరత ఉంటే వాటిని సరిదిద్దేందుకు కొంత సమయం ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇక నుంచి కన్సల్టెంట్‌ను ఏర్పాటు చేస్తామని, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తారని, ఆయన చెప్పారు.

తిరుమలలోని అన్ని తినుబండార కేంద్రాలు పరిశుభ్రత పాటించాలని, యాత్రికుల భద్రతే ప్రధాన అజెండాగా టీటీడీ ఖ్యాతిని నిలబెట్టాలని అదనపు ఈఓ పునరుద్ఘాటించారు. ఎస్టేట్స్ అధికారి వెంకటేశ్వరులు, డిప్యూటీ ఈవో హెల్త్ ఆశాజ్యోతి, హెల్త్ ఆఫీసర్ మధుసూధన్, వీజీవోలు రామ్‌కుమార్, సురేంద్ర, తిరుమలలోని పలు తినుబండార కేంద్రాల యజమానులు, ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మరోవైపు ఈ నెల 10 నుంచి తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభంకానున్నాయి.. ఈ నెల 19 వరకు దర్శనాలు కొనసాగనున్నాయి. వైకుంఠ ద్వార దర్శనాలకు సంబందించిన %ూాణ% టోకెన్లను ఈ నెల 9 నుంచి తిరుపతి, తిరుమలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో జారీ చేయనున్నారు.

# ఫుట్ పాత్ లపై, డ్రైన్ లపై ఏర్పాటు చేసిన నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించాలి: హుజూర్ నగర్ మున్సిపల్ కమిషనర్



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జనవరి 08:

హుజూర్ నగర్ పురపాలక సంఘ పరిధిలో మెయిన్ రోడ్డు కి ఇరువైపుల డ్రైన్ల పై, డ్రైన్ మూలమలుపులపై మరియు ఫుట్ పాత్ లపై షాపులు,డబ్బా కొట్లు, కూరగాయల , పండ్ల షాపులు మరియు ఇతర వాణిజ్య సముదాయములు ఏర్పాటు చేసుకొవడం వలన డ్రైన్ లోకి వెల్ల వలసిన నీరు వెళ్ళుటకు వీలుగా ఏర్పాటు చేసిన అన్నీ మ్యాన్ హెూల్స్ ముసకపోయి నీరు వెళ్ళక కురిసిన వర్షానికి హుజూర్ నగర్ లో అనేక ప్రాంతములు నీట మునిగి చాలా ఇబ్బందులు పడవలసి వచ్చినది కావున పురపాలక సంఘ పరిధిలో ఉన్న డ్రైన్ల పై మరియు మెయిన్ రోడ్డు కి ఇరువైపుల ఫుట్ పాత్ లపై డబ్బా కొట్లు ఏర్పాటు చేసుకొని ఉన్న వారి యొక్క షాపులను స్వచ్ఛందంగా తొలగించాలని మున్సిపల్ కమిషనర్ బుధవారం ప్రజలకు ప్రకటన ద్వారా తెలియజేశారు అత్యవసర సమయములో పురపాలక సంఘం వారు ఇట్టి షాపులు తొలగించుటలో పురప్రముఖులు, డబ్బా కొట్లు ఏర్పాటు చేసుకొని ఉన్న వారు సహకరించి పురపాలక సంఘ అభివృద్ధి కి తోడ్పడగలరని కోరారు.

# కృష్ణా, గోదావరి నేతల మిస్సింగ్

భారత శక్తి ప్రతినిధి

విజయవాడ, జనవరి 8, (అధికారం కోల్పోయాక ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల్లో వైసీపీని నడిపించే నాయకుడు లేడన్న చర్చ ఏపీ పాలిటిక్స్‌లో జోరుగా నడుస్తోంది. ఆ జిల్లాల్లో వైసీపీ పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలాగా తయారు అయిందట. వైసీపీ అధికారం చేజారిపోగానే.. బాలారిష్టాలు మొదలయ్యాయి. ఆ జిల్లాల్లో పార్టీని నడిపించే నాయకులు కరువవుతున్నారు.ఒక్కో నాయకుడిని ఏదో ఒక కేసు వెంటాడుతోంది. తెరమరుగైన కేసులను కూటమి ప్రభుత్వం తిరగతోడుతుండడంతో కొందరు వైసీపీ నేతలకు అరెస్టు భయం పట్టుకుంది. ఇందులో ప్రధానంగా మూడు కేసులు వైసీపీ నేతలను ఉక్కబోతకు గురిచేస్తున్నాయి. చంద్రబాబు ఇంటిపై దాడి, మంగళగిరి, గన్నవరం టీడీపీ కార్యాలయాల్లో విధ్వంసం కేసులో పలువురు నేతలు నిందితులుగా ఉన్నారు.ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన పలువురు నేతలు టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అజ్ఞాత జీవితమే గడుపుతున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తమ నోటికి పని చెప్పిన మాజీ మంత్రి కొడాలి నాని, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఇప్పుడు ఎక్కడున్నారో తెలియదు. మాజీ మంత్రి కొడాలిపై నమోదైన రెండు కేసుల్లో కోర్టు బెయిల్ మంజూరు చేసినా, ప్రభుత్వం ఇంకేదైనా కేసులో ఇరికించి లోపల వేస్తుందనే భయంతో కొడాలి నాని కనిపించకుండా తిరుగుతున్నారని లోకల్ టాక్.ఇక గన్నవరంలో టీడీపీ ఆఫీస్‌లపై దాడి కేసులో వల్లభనేని వంశీకి అరెస్ట్ తప్పేలా లేదు. చాలా కాలంగా ముందస్తు బెయిల్‌పై ఉన్న వంశీ.. ఇప్పుడు బెయిల్ రద్దు కావడంతో అరెస్ట్ ఖాయమనే గాసిప్ కృష్ణా జిల్లాలో బిగ్ సౌండ్ చేస్తోంది. ఇప్పటికే ఈ కేసులో వంశీ ముఖ్య అనుచరులు రిమాండ్‌లో ఉన్నారు. దీంతో వైసీపీ ఓటమి పాలైనప్పటి నుంచి వంశీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఒకటి రెండు సందర్భాల్లో మినహా ఆయన బయట కనిపించింది లేదు. దీంతో గన్నవరంలో ఆరునెలలుగా వైసీపీ జెండా ఎక్కడా కనరావడం లేదు. దీంతో క్యాడర్ అయోమయస్థితిలో పడిపోయింది.ఎన్నికల్లో ఓటమి తర్వాత కృష్ణా జిల్లాలో కీలకమైన అధ్యక్ష బాధ్యతల్ని పేర్ని నానికి అప్పగించింది వైసీపీ అధిష్టానం. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికి, పేర్ని నాని రేషన్ బియ్యం స్కాంలో ఇరుకున్నారు. కేసుల ఎఫెక్ట్‌తో స్పీడ్ తగ్గించేసి కామ్ అయిపోయారు పేర్ని నాని.గన్నవారానికి వల్లభనేని వంశీని, గుడివాడకు కొడాలి నానిని , మచిలీపట్నానికి పేర్ని నానిని ఇన్చార్జులుగా కొనసాగిస్తున్నట్లు జగన్ ప్రకటించినా కేసుల భయంతో ముగ్గురూ క్యాడర్‌కి అందుబాటులో లేకుండా పోయారు.

# చల్లా ప్రభాకరరావును పరామర్శించిన ముద్రగడ పద్మనాభం

భారత శక్తి ప్రతినిధి

ఆలమూరు జనవరి 8, మాతృ వియోగంతో బాధపడుతున్న కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ ప్రముఖుడు ఆలమూరు గ్రామానికి చెందిన చల్లా ప్రభాకరరావు ను మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం బుధవారం పరామర్శించారు.



చల్లా ప్రభాకరరావు మాతృమూర్తి శ్రీమతి చల్లా మునీశ్వరమ్మ డిసెంబర్ 26న స్వర్గస్తులయ్యారు. ఆమె ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గా సుదీర్ఘకాలం పని చేసారు.సోషల్ వర్కర్. ఈ సందర్భంగా ముద్రగడ పద్మనాభం మాట్లాడుతూ ప్రభాకరరావు కుటుంబంతో గత మూడు తరాలుగా తమ కుటుంబానికి సన్నిహిత సంబంధాలు ఉన్నారనీ, తమ బంధువుల నీ ఆయన అన్నారు. ఆలమూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు,ఐక్యకాపునాడు ఉపాధ్యక్షులు,సీనియర్ న్యాయవాది జొన్న పల్లి సత్యనారాయణ, చల్లా సత్యనారాయణ( నానాజీ) చల్లా భూషణం ( బుజ్జి), కొత్తపేట న్యాయవాది, ప్రముఖ వ్యాపారవేత్త కొప్పుల వీర వెంకట సత్యనారాయణ (సూరిబాబు), శ్రీపతి వీర్రాజు,పురుషోత్తం వీర్రాజు,లంకే వెంకటరెడ్డి, ఆలమూరు మాజీ జడ్ పిటిటిసి ఆర్ శేషగిరిరావు, మాజీ ఉప సర్పంచ్ చల్లా సత్యనారాయణ, చల్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వారం రోజుల నుండి బస్సు రావడం లేదంటూ జనగామ విద్యార్థుల నిరసన

వికారాబాద్ జనవరి 8,

పెద్దముల్ మండలం జనగామ గ్రామం నుండి మంబాపూర్ తాండూర్ కు వెళ్లే కాలేజీ స్కూల్ విద్యార్థులకు వారం రోజుల నుండి బస్సు రాక ఇబ్బంది పడుతున్నాం. కాలినడక. ఆటోలలో ద్వారా వెళ్తున్నామని నేపథ్యంలో ఈ విషయం తాండూర్ డిఎంకు తెలిపిన స్పందించకపోవడంతో అందోళనకు దిగామని విద్యార్థులు, తల్లిదండ్రులు అన్నారు. మంబాపూర్ రోడ్డుపైన బైటాయించారు. తాండూర్ నుండి వికారాబాద్ హైదరాబాద్ వెళ్లే వాహనాలు అర్ధగంట ఆగిపోవడం జరిగింది. విషయంన్ని తెలుసుకున్న పెద్దముల్ పోలీసులు సంఘటన స్థలం చేరుకొని సముదాయించినారు. స్థానిక మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి ఎమ్మెల్యే తో ఫోన్లో మాట్లాడి డిఎంకు తెలపడంతో అయన బస్సు వేస్తామని హామీ ఇచ్చారు. దాంతో అందరూ శాంతించారు .

# కూకట్ పల్లి నియోజకవర్గం లో పర్యటించిన మేయర్ విజయలక్ష్మి

హైదరాబాద్ జనవరి 8, జీహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి బుధవారం ఉదయం కూకట్ పల్లి నియోజకవర్గంలో పర్యటించారు. మూసాపేట లో స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. బాలానగర్ లో జరుగుతున్న నాలా పనులను పరిశీలించి ప్రమాదాలు జరగకుండా భద్రత చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# తమ్మినేని దారెటు...

భారత శక్తి ప్రతినిధి

శ్రీకాకుళం, జనవరి 8,ఏపీ రాజకీయాల్లో పరిచయం అక్కర్లేని పేరు తమ్మినేని సీతారాం. ఇప్పటి వరకు 5సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తమ్మినేని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కీలక శాఖలకు మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన అనుభవం ఉంది. వైసీపీ సర్కార్‌లో శాసన సభాపతిగా కూడా పనిచేశారు. రాజకీయాల్లో తలపండిన నేతగా పేరు తెచ్చుకున్నారు తమ్మినేని.. అలాంటి సీనియర్ నేతను ఇప్పుడు సోషల్ మీడియా ముప్పుతిప్పలు పెడుతుందనే గాసిప్ మొదలైంది.ఎంత అనుభవం ఉన్నా కాలం కలిసి రాకుంటే. ఎవరైనా డీలా పడాల్సిందే. అలా వైసీపీ ఓటమి తర్వాత తమ్మినేని కూడా ఇబ్బందులుపడుతున్నారు. 2024 ఎన్నికల్లో తమ్మినేని సీతారాం ఓటమి తర్వాత సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. ఆమదాలవలస నియోజకవర్గ బాధ్యతల నుంచి తప్పించి శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకులుగా బాధ్యతలు అప్పగించింది హైకమాండ్. ఆమదాలవలస అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా చింతాడ రవికుమార్‌ని నియమించారు.ఇక అప్పటి నుంచి తమ్మినేనితో పాటు ఆయన వర్గం అసంతృప్తిగా ఉన్నారనే టాక్ లోకల్‌లో రీసౌండ్ చేస్తోంది. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు జరిగినా.. ఎక్కడా తమ్మినేని కనిపించడం లేదు. ఆమదాలవలస వైసీపీ పగ్గాలను తమ్మినేని వారసుడు వెంకట చిరంజీవి నాగ్‌కి అప్పగిస్తారని లోకల్‌లో తెగ ప్రచారం జరిగింది. కానీ చివరి నిమిషంలో అధిష్టానం చిరంజీవినాగ్‌ను కాదని చింతాడ రవికుమార్‌కు బాధ్యతల్ని అప్పగిచారు. దీంతో అప్పటి నుంచి వైసీపీ అధిష్టానంపై తమ్మినేని కుటుంబం కాస్త గుర్రుగానే ఉందని గాసిప్ వినిపిస్తోంది.సోషల్ మీడియా వచ్చి దూరం అనే మాటను చెరిపేసింది. ప్రపంచాన్ని సింగిల్ విలేజ్‌గా మార్చేసింది. ఎక్కడా ఏ మూలనా ఏం జరిగినా ప్రపంచమంతా చాటి చెబుతుంది. ఈ సోషల్ మీడియా ఓడలను బండ్లను చేయగలదు. బడ్లను ఓడలను చేయగలదు. చాలా మంది సోషల్ మీడియాను బ్రహ్మాస్త్రంగా వాడుకొని పొలిటికల్ లీడర్లుగా ఎదిగిపోయారు. అయితే అప్పుడప్పుడు సోషల్ మీడియాలో నిజాన్ని అబద్ధం డామినేట్ చేస్తోంది. సత్యం డిలేట్ అయిపోయి అసత్యం ఫార్వర్డ్ అవుతుంది. ఇలా ఇప్పటి వరకు ఎంతోమంది నేతలు చిక్కుల్లో పడ్డారు.ఇది ఇలా సాగుతుంటే రెండు నెలలుగా వైసీపీ క్యాడర్‌కి సైతం తమ్మినేని టచ్‌లోకి రావడం లేదట. నిజం చెప్పాలంటే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారా అనే అనుమానం లోకల్ కార్యకర్తలకు కూడా కలిగింది. ఇక్కడే తమ్మినేనికి అసలు చిక్కువచ్చి పడింది. సీతారాం పార్టీ మారబోతున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. కొన్ని సోషల్ మీడియా సంస్థలు ఒక్క అడుగు ముందుకేసి.. తమ్మినేని జనసేన వైపు చూస్తున్నారని కొందరు.. లేదు లేదు బీజేపీ ఆఫీస్ బాట పడతారని ఇంకొందరి తమ్మినెయిల్ తగిలించి వీడియోలు వదిలేశారు. ఇక ఆ వార్త సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యింది. తమ్మినేని కూడా టచ్‌లో లేకపోవడంతో వైసీపీ క్యాడర్ కూడా ఇదే నిజమే అని ఫిక్స్ అయ్యారట.రెండు నెలల సుదీర్ఘ విరామం తర్వాత సిక్కోలు జిల్లాకు ఎంట్రీ ఇచ్చిన సీతారాం.. సోషల్ మీడియా ప్రచారం చూసి షాక్ ఐపోయారు. తానేంటి పార్టీ మారడం ఏంటని తల పట్టుకుంటున్నారట. ఇంతలో శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ ఆమదాలవలసలో సీతారాం ఇంటికి వెళ్లడంతో ఏదో జరుగుతుందనే అనుమానం మరింత బలపడింది. తమ్మినేని పార్టీ మారబోతున్నారని.. ఆయన్ని బుజ్జగించేందుకే స్వయంగా బొత్స వచ్చారంటూ సిక్కోలు పొలిటికల్ సర్కిళ్లలో పుకార్లు షికార్లు చేశాయి.తాను పార్టీ మారడం లేదు మహా ప్రభో అంటూ తమ్మినేని క్లారిటీ ఇచ్చేశారు. తన కుమారుడి ఆపరేషన్ కోసం వేరే రాష్ట్రానికి వెళ్లాల్సిం వచ్చిందని వివరణ ఇచ్చారు. అందుకే పార్టీ క్యాడర్‌కి టచ్‌లోకి రాలేదని చెప్పుకువచ్చారు. పీకపోయినా ఎవరైనా పవన్‌కల్యాణ్ వైపు వెళ్తారా అంటూ వివరణ కూడా ఇచ్చారట. ఇటు బొత్స సత్యనారాయణ కూడా తమ్మినేని కుమారుడి ఆరోగ్యం గురించి తెలుసుకోవడానికే వచ్చానని చెప్పుకువచ్చారు.తమ్మినేని మనసులో ఏముందో గాని.. సోషల్ మీడియా మాత్రం ఆయనికి కంటిమీద కునుకులేకుండా చేసింది. వైసీపీ క్యాడర్‌నే నమ్మించేంతలా ప్రచారాన్ని ఊదర గొట్టింది. అయితే నిప్పు లేనిదే పొగ రాదనే ప్రచారం మళ్లీ మొదలైంది. మొత్తానికి ఈ ఎపిసోడ్‌లో సోషల్ మీడియా అంచనాలు తలకిందులవుతాయా. లేదంటే నిజమే అవుతాయా.? అన్నది కాలమే నిర్ణయించాలి.

# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం.

## -స్వయం సహాయక సంఘాల ద్వారా వెయ్యి మెగావాట్ల ఉత్పత్తి

## -త్వరలో టెండర్లు ఖరారు చేస్తాం

## -ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

భద్రాద్రి జిల్లా బ్యూరో, జనవరి 08 (భారతశక్తి): రాష్ట్రంలో మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని ప్రజా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటుచేసి వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఇప్పటికే ఇంధన శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ ల ఒప్పందం కుదిరిన నేపథ్యంలో జిల్లాల వారీగా ప్రగతిని బుధవారం ఉదయం ప్రజా భవన్ లో మంత్రులు సీతక్క, కొండ సురేఖలతో కలిసి డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పాల్గొన్నారు. మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తేనే వారి ఎదుగుదలకు అవకాశాలు ఏర్పడతాయని డిప్యూటీ సీఎం తెలిపారు. అందుకుగాను అంది వస్తున్న కొత్త విద్యుత్ పాలసీ, ఇంధన, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య గత సంవత్సరం నవంబర్ 19న కుదిరిన ఒప్పందాన్ని జిల్లా కలెక్టర్లు ఉపయోగించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఐదు సంవత్సరాల కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ క్రమంలో మహిళలకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలు అందుబాటులోకి తెస్తున్నాం. పెద్ద మొత్తంలో డబ్బులు మహిళా సంఘాల చేతులకి వస్తున్న క్రమంలో వారు వివిధ వ్యాపారాలు చేసుకునేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి వసతులు కల్పించాలని ఆదేశించారు. మహిళా సంఘాలు సోలార్ పవర్ ప్లాంట్ ల ఏర్పాటుకు వారికి అందుబాటులో ఉన్న భూమిని గుర్తించండి, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. మహిళా సంఘాలు ప్లాంట్ల ఏర్పాట్లు లో ఆర్థిక సహాయం కోసం బ్యాంకు అధికారులతో సమన్వయం చేయాలని సూచించారు. మహిళా సంఘాల భూముల్లో ప్లాంట్ లో ఏర్పాటుకు విద్యుత్ శాఖ రెడ్కో ద్వారా టెండర్లు ఆహ్వానించిందని, త్వరలో టెండర్లు ఓపెన్ చేసి వాటిని ఖరారు చేస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు.

ఈ నేపథ్యంలో సంఘాలను గుర్తించి నిర్ధారించడం, భూ సేకరణ, బ్యాంకుల నుంచి ఆర్థిక సాయం వంటి పనులను గ్రామీణ అభివృద్ధి శాఖ, జిల్లా కలెక్టర్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఒక మెగావాటు ఉత్పత్తికి నాలుగు ఎకరాలు అవసరం ఉంటుంది. ప్రతి జిల్లాలో 150 ఎకరాలకు తగ్గకుండా రాష్ట్రవ్యాప్తంగా సుమారు నాలుగువేల ఎకరాలు సేకరించాల్సి ఉంటుందని కలెక్టర్లకు తెలిపారు. దేవాదాయ, ఇరిగేషన్ శాఖల పరిధిలోని భూములను గుర్తించాలని, కేంద్ర అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులు భూమి అభివృద్ధి చేసుకునే అవకాశం ఏర్పడిందని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో భూములపై హక్కులు ఏర్పడినప్పటికీ స్తంభాలు వేసి విద్యుత్ లైన్ ల ద్వారా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసే క్రమంలో అటవీ శాఖ అధికారులతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తే ఎవరికి ఇబ్బంది ఉండదని డిప్యూటీ సీఎం సూచించారు. సోలార్ విద్యుత్తు అందుబాటులోకి వస్తే అటవీ ప్రాంతాల్లోని రైతులు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పెద్ద ఎత్తున పంటలు సాగు చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ దిశగా కలెక్టర్లు పనిచేస్తే గిరిజనులు ఆత్మగౌరవంతో బతికే



అవకాశం స్పష్టంగా ఉందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో స్మాల్, మైక్రో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు నాలుగు నుంచి ఐదు ఎకరాలు భూమి అవసరం అవుతుంది. చిన్నపాటి ఇండస్ట్రియల్ ఏరియాల ఏర్పాటుకు అధికారులు భూములు సేకరించాలని ఆదేశించారు. దీని ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యాపారం చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. అటవీ హక్కుల ద్వారా లభించిన భూముల్లో అవకాడో వంటి పంటలు సాగు చేస్తే అటవీ సంపద పెరగడంతో పాటు గిరిజనులు ఆర్థికంగా బలోపేతం అవుతారని తెలిపారు. రాష్ట్రంలో 6.67 లక్షల ఎకరాలను ఇప్పటివరకు ప్రభుత్వం గిరిజనులకు పంపిణీ చేయగా ఆ భూముల్లో లాభసాటి పంటల సాగు జరగడంలేదని డిప్యూటీ సీఎం తెలిపారు.

ఇకనుంచి ఆ భూముల్లో ఉపాధి హామీ, గిరిజన శాఖ, స్వయం సహాయక సంఘాల ద్వారా వచ్చే పథకాలు అన్నిటిని సమన్వయం చేసుకొని ఆర్థికంగా ప్రయోజనం కలిగించే పంటల సాగును ప్రోత్సహించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని గిరిజన శాఖ అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. గిరిజనులకు ఆదాయం తక్కువగా ఉంటుంది. భూమి లభ్యత ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో అచ్చంపేట నుంచి ఆదిలాబాద్ వరకు గోదావరి పరివాహక ప్రాంతంలో భూములపై అధికారులు దృష్టిపెడితే గిరిజనులకు ప్రయోజనం జరుగుతుందని మంత్రి సీతక్క తెలిపారు. హైదరాబాద్ వంటి మహానగరాల్లో భారీ భవంతుల పైన సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో గుట్టల తో విస్తరించిన భూములు అత్యధికంగా ఉన్నాయి వీటి పైన సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేసే ఆలోచన చేయాలని ఇంధన శాఖ అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. వీటి ఏర్పాటు ద్వారా ప్రభుత్వ భూముల పరిరక్షణకు అవకాశం ఉంటుందని వివరించారు. ప్రధానమంత్రి లిపీఎం కూసుమ్‌లి పథకంలో భాగంగా రైతులు రెండు మెగావాట్ల వరకు సోలార్ పవర్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఏర్పడింది. ఈ దిశగా రైతులను చైతన్యం చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. టిజి రెడ్ కో పోర్టల్ ద్వారా రైతులు సోలార్ పవర్ ఉత్పత్తికి దరఖాస్తులు చేసుకోవాల్సి ఉందని, దీని ద్వారా తక్కువ ధరకు విద్యుత్తు అందుబాటులోకి రావడం మే కాకుండా కాలుష్య రహిత విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఏర్పడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

# ఇందిరమ్మ మోడల్ హౌస్ కు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే పాయం



మణుగూరు, జనవరి 08 (భారతశక్తి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌస్ నిర్మాణం కొరకు బుధవారం పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పేరుతో నిధులు దుర్వినియోగం చేసి ఇండ్లు పూర్తి చేయకుండా గారడి మాటలతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని, విపక్షాలు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ తేళ్ళూరి శ్రీనివాసరావు, హౌసింగ్ పి.డి శంకర్, మున్సిపాలిటీ ఏఈ సత్యనారాయణ, రెవెన్యూ అధికారులు, హౌసింగ్ సిబ్బంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీతారామచంద్ర వేణుగోపాలస్వామి గోదాదేవి మాత,ధనుర్మాస సర్వజనహిత శోభాయాత్ర

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జనవరి 08:హుజూర్ నగర్ పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ సీతారామచంద్ర వేణుగోపాలస్వామి గోదాదేవి మాత,ధనుర్మాస కార్యక్రమాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు సర్వజనహిత శోభాయాత్ర వాహన సేవ కార్యక్రమం,ఆరంభించి



నగర సంకీర్తన తదుపరి భక్తులకు తీర్థ ప్రసాదములు అందజేసారు. ఆల్వార్ వాహనం మొదలుకొని గరుడ వాహనం వరకు 9 వాహన సేవలను, పట్టణ వీధుల్లో శోభాయాత్ర కొనసాగినది. గత 15 సంవత్సరాలుగా అనేక కులముల వారి వారి వాహన సేవలను సాగిస్తున్నారు. కార్యక్రమంలో ఈవో కొండారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఎరగాని నాగన్న గౌడ్ ,మున్సిపల్ చైర్మన్ గేల్లి అర్చన రవి , పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తన్నీరు మల్లికార్జున రావు,వైస్ చైర్మన్ కోతిసంపత్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ దొంత గాని శ్రీనివాస్, పుర ప్రముఖులు నారపరాజు శ్రీనివాసరావు, గొట్ట రామయ్య,నర్సింగ్ వెంకటేశ్వర్లు,కోట సూర్య ప్రకాష్, చిట్యాల అమర్నాథరెడ్డి, చింతకాయల రాము, మాజీ జెడ్పిటిసి గల్లా వెంకటేశ్వర్లు, మున్సిపల్ కౌన్సిలర్ కస్తాల శ్రావణ్ కుమార్ , కస్తాల రవీంద్ర, రడపంగు రాము, అర్చకులు, ముడుంబై దామోదరాచార్యులు,రాఘవయ్య, అయ్యప్ప, రాము, ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, మహిళా భక్తులు వేలాదిమంది పాల్గొన్నారు,

# ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలి : జిల్లా కలెక్టర్






ములుగు జిల్లా ప్రతినిధి, జనవరి 08 (భారత శక్తి) : ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం విద్యార్థినీ, విద్యార్థులు ఆన్లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో వివిధ గురుకులాల్లో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాల కోసం ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 23న కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించనుందని పేర్కొన్నారు. గురుకులాల్లో విద్యను అభ్యసించదల్చిన బాలబాలికలు %ప్ట్రజూం:?/స్త్రవివ్.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ% ద్వారా ఆన్లైన్ లో ఫిబ్రవరి 01వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు కుల ధ్రువీకరణ పత్రం నెంబరు, ఆదాయ ధ్రువీకరణ పత్రం నెంబరు, ఆధార్ కార్డు నెంబరు, బర్త్ సర్టిఫికెట్, ఫోటో అవసరమని తెలిపారు. పై ధ్రువీకరణ పత్రాల సత్వర జారీ కోసం కలెక్టరేట్లో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని, ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రం తెరిచి ఉంటుందని అన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలకు, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుండి 9 వ తరగతి వరకు ఖాళీ సీట్లలో ప్రవేశాల కోసం, గౌలిదొడ్డి లోని సాంఘిక సంక్షేమ గురుకులంలో 9వ తరగతిలో ప్రవేశాల కోసం, ఖమ్మం లోని గిరిజన సంక్షేమ గురుకులం, పరిగిలో ఎస్.ఓ.ఈలలో 8 వ తరగతిలో ప్రవేశాలకై, అలుగునూరులోని సి.ఓ.ఈలో 9 వ తరగతిలో అడ్మిషన్ల కోసం, రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్ గిరి ఫైన్ ఆర్ట్స్ స్కూల్ లో 6 వ తరగతిలో ప్రవేశాల కోసం ఆసక్తి గల విద్యార్థులు ఆన్లైన్ ద్వారా గడువులోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు.

# ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు: ట్రాఫిక్ సిఐ రామకృష్ణ వెల్లడి

భారతశక్తి ప్రతినిధి, హనుమకొండ, జనవరి 08:వరంగల్ ట్రాఫిక్ సిఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఇస్లామియా హైస్కూల్ లో 8,9,10 తరగతి విద్యార్థులకు ట్రాఫిక్ నియమాల గురించి అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ ట్రాఫిక్ సిఐ రామకృష్ణ విద్యార్థులకు ట్రాఫిక్ నియమాల గురించి వివరిస్తూ మీ పేరెంట్స్ టూవీలర్ పై వెళుతున్నప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,రాంగ్ రూట్లో వెళ్లకూడదని,వెహికల్స్ సంబంధించి డాక్యుమెంట్స్ అన్ని కలిగి ఉండాలని,మైనర్లు ఉంటే డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని,డ్రైవింగ్ చేయడానికి లైసెన్స్ కలిగి ఉండాలని,ప్రమాదకరంగా రాష్ డ్రైవింగ్ చేయరాదని,త్రిబుల్ రైడింగ్ చేయొద్దని వివరించారు. ఈ విషయాలు అన్ని మీ పేరెంట్స్ తో డిస్కస్ చేయాలని హెల్మెట్ పెట్టుకుంటేనే స్కూల్ కి తీసుకెళ్లాలని విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రానా ఫీరుదౌజ్, కరస్పాండెంట్ అంజాద్ అలీ, హెడ్ కానిస్టేబుల్ సర్దార్ అలీ, పీసీలు రమేష్,ఆసిఫ్ లు పాల్గొన్నారు.



# మణుగూరు ప్రభుత్వ ఐటిఐ లో ముగ్గుల పోటీలు.



మణుగూరు, జనవరి 08 (భారతశక్తి): మణుగూరు ప్రభుత్వ ఐటిఐ లో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రిన్సిపాల్ బి ప్రభాకర్ ప్రారంభించి ప్రసంగించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ ముగ్గుల పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారన్నారు. సంక్రాంతి సంస్కృతి సాంప్రదాయాలను కలబోసే విధంగా ముగ్గులు వేసినారు. అత్యంత ఆకర్షణీంగా ముగ్గులు వేసిన వారిని అభినందించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణయితలుగా టీ ఎన్ జ్యోతిరాణి, సువర్ణ, దేవకరణలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల టిఓ జి రవి, ఏటీవోలు జీవీ కృష్ణారావు, ఏ నరసయ్య, ఎం శ్రీనివాసరావు, వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

# పాస్టర్ దారావత్ సక్రం నాయక్ మృతి బాధాకరం: పార్దివ దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన పాస్టర్స్

### సూర్యాపేట జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బిషప్ డా దుర్గం ప్రభాకర్

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జనవరి 08:సూర్యాపేట జిల్లా చివ్వేంల మండల కేంద్రంలోని పాండ్య నాయక్ తండా స్వగృహం నందు దారావత్ సక్రం నాయక్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తన నివాసంలో బుధవారం ప్రభు నందు నిద్రించ్చినారు. చివ్వేంల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రెవ. గుగులోతు బాలాజీ నాయక్, రీచ్



ఇండియా వ్యవస్థాపకులు ధరవత్ లాకు రేణుక నాయక్,పాస్టర్స్ పెలోషిఫ్ సూర్యాపేట నియోజకవర్గం అధ్యక్షులు రెవ. డా. జలగం జేమ్స్ లు ఆధ్వర్యంలో వారి పార్థివ దేహానికి పూల మాలలు వేసి ప్రార్ధించి నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బిషప్ డా. దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ కోటియా నాయక్ తండా, తాళ్ల సింగారం తాండలలో పరిచర్య చేస్తున్నారని,చివ్వేంల మండలం లో గతంలో పాస్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గా పనిచేసారని,గొప్ప దైవజనులను కోల్పోయినమని బాధను వ్యక్తపరిచారు, వారు జిల్లా వ్యాప్తంగా 20 సంవత్సరాలుగా దేవుని పరిచర్య ఘనంగా చేశారని, తనకు భార్య ఇద్దరు కుమారులు వున్నారు ,భార్య అనసూర్య, పెద్ద కుమారుడు షాలేం నాయక్ (16) చిన్న కుమారుడు సాత్విక్ నాయక్ (13 ) ఈ కార్యక్రమంలో నియోజకవర్గం గౌరవ సలహాదారులు రెవ బొక్క ఏలీయా రాజు, సూర్యాపేట రూరల్ అధ్యక్షులు పాస్టర్ యల్క ప్రభాకర్, రూరల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రెవ ఏర్పుల క్రిస్టోఫర్,రెవ.బానోత్ సుధాకర్ నాయక్ రెవ. డా. పంది మార్కు,పాస్టర్ వరికుప్పల మత్తయి,పాస్టర్ బి.మోతిలాల్ నాయక్ ,పాస్టర్ బి.లింగ నాయక్ , డి.సల్మాన్ లింగ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వృత్తి విద్యతోనే స్వయం ఉపాధి సాధ్యమవుతుంది:నిర్మల్ జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరశురాం




భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 08: నిర్మల్ జిల్లా భైంసా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరుశురాం సోమవారం పట్టణంలోని గురుకృపా ఒకేషనల్ జూనియర్ కళాశాలను సందర్శించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ద్వారా అందిస్తున్న వృత్తివిద్య కోర్సులలో చేరడం ద్వారా వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకొని చిన్న వయసులోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతారని కళాశాల విద్యార్థులకు సూచించారు.అంతేగాకుండా రానున్న పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు సమయాన్ని వృధా చేసుకోకుండా కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గురుకృపా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ముష్కం రామకృష్ణ గౌడ్,కళాశాల ప్రిన్సిపాల్ సాయినాథ్,అధ్యాపకులు నరేష్ గౌడ్,హరిత,శ్రీదేవి,మనీషా,కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి:వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



హనుమకొండ ప్రతినిధి(భారత శక్తి)జనవరి 08:ప్రజలు అందించే ఫిర్యాదులపై అధికారులు సత్వరమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా నర్సంపేట ఏసిపి కార్యాలయమును వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం తనిఖీ చేసారు. తనిఖీ భాగంగా ఏసిపి కార్యాలయమునకు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు పోలీస్ అధికారులు మొక్కను అందజేసి స్వాగతం పలికారు.సాయుధ పోలీసులు గౌరవ వందనం చేసారు. అనంతరం ఏసిపి కార్యాలయము నకు సంబంధించిన రికార్డులను పరిశీలించడంతో పాటు, ఏసిపి అధ్వర్యంలో దర్యాప్తు జరిగిన కేసుల ప్రస్తుత స్థితిగతులపై పోలీస్ కమిషనర్ అరా తీసారు.పాటు, గ్రేవ్ కేసుల్లో నిందితుల అరెస్టు, దర్యాప్తు జరుగుతున్న తీరును పోలీస్ కమిషనర్ ఏసిపి కిరణ్ కుమార్ ను అడిగి తెలుసుకొవడంతో పాటు, పెండింగ్‌లో వున్న ఎస్సీ,ఎస్సీ కేసులు, ఇతర గ్రేవ్ కేసుల వివరాలకు సంబంధించిన రికార్డులతో పరిశీలించడంతో పాటు మావోయిస్టు ప్రాబల్యంపై పోలీస్ కమిషనర్ ఆరా తీసారు. ఈ సందర్భంగా నర్సంపేట డివిజనల్ పోలీస్ అధికారులతో కమిషనర్ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని,ప్రతి పోలీస్ స్టేషన్‌తో పాటు, బ్యాంకులు, ఇతర ప్రధాన కూడళ్ళల్లో సిసి కెమెరాలు ఏర్పాటు అధికారులు చోరవ చూపించాలని, నేరాల కట్టడి కొసం అధికారులు మరింత శ్రమించడంతో పాటు, నేరం జరిగిన వెంటనే స్టేషన్ అధికారులు వేగంగా స్పందించాలని.

చట్టాలను అతిక్రమించే చర్యలకు పాల్పడే వారిని ఎట్టిపరిస్థితిలో వదలవద్దని, సమాజంలో ఏం జరుగుతోందని ఎప్పటికప్పుడు పరిశీలించడంతో పాటు, ముందస్తు సమాచార సేకరణ అవరమని, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ, ఓపిక,సహనంతో ప్రజలు ఇచ్చే ఫిర్యాదుల పరిశీలించాలని పోలీస్ కమిషనర్ అధికారులకు తెలిపారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ అధికారులతో కల్సి ఏసీపీ కార్యాలయము ప్రాంగాణంలో మొక్కలను నాటారు,ఈ తనీఖీలో ఈస్ట్ జోన్ డిసిపి రవీందర్ ఈ. ఏ.ఎస్పీ మానాన్ భట్, ఏసిపి కిరణ్ కుమార్ ,నర్సంపేట డివిజనల్ పోలీస్ అధికారులు, ఇన్స్‌స్పెక్టర్ జి. రమణ మూర్తి, దుగ్గొండి, నెక్కొండ రూరల్ సర్కిల్ ఇన్స్ స్పెక్టర్లు సాయి రమణ, చంద్రమోహన్, ఎస్.ఐ లు అరుణ్ కుమార్, రవి , మహేందర్, గోవర్ధన్, రాజేష్ రెడ్డి, రఘుపతితో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.

# టోకెన్స్, టికెట్స్ ఉన్న భక్తులకే శ్రీవారి దర్శనం ఉంటుంది :టీటీడీ ఈవో శ్యామలరావు




తిరుపతి జిల్లా ప్రతినిధి, జనవరి 08, భారత శక్తి : తిరుమలలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీవారి వైకుంఠ ద్వారాలు తెరుచుకోనున్నాయి. ఈనెల 10న వైకుంఠ ఏకాదశి రోజు వేకువాజాము నుంచి వైకుంఠ ద్వార దర్శనాలకు భక్తుల్ని అనుమిస్తారు. ఈ మేరకు మొత్తం పది రోజుల పాటు వైకుంఠ ద్వారం గుండా భక్తులు స్వామి వారిని దర్శించుకునేలా టీటీడీ ఏర్పాట్లు చేసింది. తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలపై భక్తులకు టీటీడీ ఈవో శ్యామలరావు కీలక సూచనలు చేశారు.జనవరి 10వ తేదీ నుంచి 19 వరకు వైకుంఠ ద్వార దర్శనాలకు అనుమతిస్తామని.. జనవరి 10వ తేదీ వేకువజామున 4:30 ప్రోటోకాల్.. 8 గంటలకు సర్వ దర్శనం ప్రారంభమవుతందని చెప్పారు. జనవరి 10వ తేదీ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్వర్ణ రథం పై శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి అభయమిస్తారన్నారు. మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు వాహన మండపంలో శ్రీ మలయప్ప స్వామి దర్శనమిస్తారని.. జనవరి 11వ తేదీ ఉదయం స్వామి వారి పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహిస్తారన్నారు.తిరుపతి, తిరుమలలో 94 కౌంటర్ల ద్వారా టైం స్లాట్ టోకెన్స్ జారీ చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు ఈవో. జనవరి 9వ తేదీ వైకుంఠ ఏకాదశి, ద్వాదశి, త్రయోదశికి సంబంధించి 1 లక్ష 20 వేల టికెట్స్ జారీ చేస్తామన్నారు. భక్తులు వారికి కేటాయించిన సమయానికి క్యూలైన్ వద్దకు వచ్చి శ్రీవారిని దర్శించుకోవాలని సూచించారు. టోకెన్స్, టికెట్స్ ఉన్న భక్తులకే శ్రీవారి దర్శనం ఉంటుందని.. ఈ పది రోజుల (జనవరి 9 నుంచి జనవరి 19 వరకు) పాటూ సిఫార్సు లేఖలు, అన్ని రకాల దర్శనాలు రద్దు చేశామన్నారు. భక్తుల రద్దీని గమనించి.. తిరుమలలో భారీ స్థాయిలో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. టిక్కెట్లపై ఎంట్రీ పాయింట్, పార్కింగ్ పాయింట్స్ సంబంధించిన వివరాలు నమోదు చేస్తున్నామన్నారు. టోకెన్స్ లేని భక్తులకు దర్శనం ఉండదని.. తిరుమలకు అనుమతిస్తామన్నారు. దాదాపు 4 లక్షల 32 వేల ఎస్ఎస్డీ టోకెన్స్ జారీ చేస్తున్నామని.. హెచ్ఎంపీవీ వైరస్‌పై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు. మార్గదర్శకాలు వస్తే వాటిని అమలు చేస్తామని తెలిపారు.తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనాల సమయంలో.. 3వేల మంది పోలీసులు, 1500 మంది విజిలెన్స్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేస్తున్నామన్నారు ఈవో శ్యామలరావు. విద్యుత్, పుష్పాలంకరణతో తిరుమలను సుందరంగా ముస్తాబు చేస్తున్నామని.. ప్రయాగ్ రాజ్‌లో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు మహా కుంభమేళ జరుగుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాల్గొంటుందని.. హిందూ ధర్మప్రచార పరిషత్‌లో భాగంగా నమూనా ఆలయం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీని కోసం 2.5 ఎకరాల భూమిని టీటీడీకి కేటాయించారని.. అక్కడ నమూనా ఆలయం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అక్కడ తిరుమల తరహాలో అన్ని కైంకర్యాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఉత్తరాది భక్తులకు స్వామి వారి అర్జిత సేవలను తిలకించే భాగ్యం కల్పిస్తామని.. కుంభమేళలో 4సార్లు శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారుతిరుమలకు వచ్చే సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఎలాంటి తోపులాట లేకుండా క్యూలైన్ సిస్టం ఏర్పాటు చేస్తున్నామని.. తిరుమలకు వచ్చే వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు. వీఐపీలు దర్శనానికి వెళ్లే సమయం నుంచి వాహనానికి చేరుకొనే వరకు అన్ని టికెట్లలో ముద్రించి ఇస్తున్నామన్నారు. ఆ నిబంధనలకు అనుగుణంగా వీఐపీలు నడుచుకోవాల్సి ఉంటుందన్నారు. మొత్తం 3 వేల మంది పోలీస్ సిబ్బంది భద్రత ఏర్పాట్లు చేశామని.. ఈ నెల 9వ తేదీన ఉదయం 5 గంటలకు టోకెన్స్ టీటీడీ జారీ చేస్తుందన్నారు. రాంభగిచాలా రెండు అలైటింగ్ పాయింట్స్, ఏటీసీ వద్ద మూడు పాయింట్స్ ఉన్నాయన్నారు.భక్తులు దర్శనం స్లాట్స్ ప్రకారం తిరుమలకు రావాలని.. ప్రతి ఒక్కరు రిపోర్టింగ్ సమయానికి చేరుకోవాలన్నారు టీటీడీ అడిషనల్ ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి. ఇచ్చిన సమయానికి రావడం వస్తే తోపులాటలు జరగవని.. రాంభగీచా అలైటింగ్ పాయింట్స్ దగ్గరకు వచ్చిన వారికి బస్ స్టాండ్ వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. భక్తులు ఈ విషయాలను గమనించి టీటీడీకి సహకరించాలని.. వైకుంఠ ద్వార దర్శనం సమయానికి క్యూ లైన్ల దగ్గరకు రావాలని టీటీడీ కోరుతోంది.

# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం.

## స్వయం సహాయక సంఘాల ద్వారా వెయ్యి మెగావాట్ల ఉత్పత్తి

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.



ములుగు జిల్లా ప్రతినిధి, జనవరి 08 (భారత శక్తి) : స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ ల ఏర్పాటు ప్రగతిపై జిల్లా కలెక్టర్లతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.రాష్ట్రంలో మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ ల ఏర్పాటు ప్రగతిపై బుధవారం ప్రజాభవన్ నుండి రాష్ట్ర పంచాయతిరాజ్, గ్రామీనాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి, పంచాయతి రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యదర్శి లోకేష్ కుమార్, సెర్ఫ్ సీఈవో దివ్య దేవరాజన్, ట్రాన్స్కో సీఎం డి కృష్ణ భాస్కర్, విద్యుత్ శాఖల సిఎండిలతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తేనే వారి ఎదుగుదలకు అవకాశాలు ఏర్పడతాయని డిప్యూటీ సీఎం తెలిపారు. అందుకుగాను అంది వస్తున్న కొత్త విద్యుత్ పాలసీ, ఇంధన, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య గత సంవత్సరం నవంబర్ 19న కుదిరిన ఒప్పందాన్ని జిల్లా కలెక్టర్లు ఉపయోగించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఐదు సంవత్సరాల కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో మహిళలకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలు అందుబాటులోకి తెస్తున్నాం. పెద్ద మొత్తంలో డబ్బు మహిళా సంఘాల చేతులకి వస్తున్న క్రమంలో వారు వివిధ వ్యాపారాలు చేసుకునేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి వసతులు కల్పించాలని ఆదేశించారు. మహిళా సంఘాలు సోలార్ పవర్ ప్లాంట్ ల ఏర్పాటుకు వారికి అందుబాటులో ఉన్న భూమిని గుర్తించండి, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. మహిళా సంఘాలు ప్లాంట్ల ఏర్పాట్లు లో ఆర్థిక సహాయం కోసం బ్యాంకు అధికారులతో సమన్వయం చేయాలని సూచించారు. మహిళా సంఘాల భూముల్లో ప్లాంట్ లో ఏర్పాటుకు విద్యుత్ శాఖ రేడ్కో ద్వారా టెండర్లు ఆహ్వానించిందని, త్వరలో టెండర్లు ఓపెన్ చేసి వాటిని ఖరారు చేస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో సంఘాలను గుర్తించి నిర్ధారించడం, భూ సేకరణ, బ్యాంకుల నుంచి ఆర్థిక సాయం వంటి పనులను గ్రామీణ అభివృద్ధి శాఖ, జిల్లా కలెక్టర్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఒక మెగావాటు ఉత్పత్తికి నాలుగు ఎకరాలు అవసరం ఉంటుంది. ప్రతి జిల్లాలో 150 ఎకరాలకు తగ్గకుండా రాష్ట్రవ్యాప్తంగా సుమారు నాలుగువేల ఎకరాలు సేకరించాల్సి ఉంటుందని కలెక్టర్లకు తెలిపారు. దేవాదాయ, ఇరిగేషన్ శాఖల పరిధిలోని భూములను గుర్తించాలని.. కేంద్ర అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులు భూమి అభివృద్ధి చేసుకునే అవకాశం ఏర్పడిందని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో భూములపై హక్కులు ఏర్పడినప్పటికీ స్తంభాలు వేసి విద్యుత్ లైన్ ల ద్వారా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసే క్రమంలో అటవీ శాఖ అధికారులతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తే ఎవరికి ఇబ్బంది ఉండదని డిప్యూటీ సీఎం సూచించారు. సోలార్ విద్యుత్తు అందుబాటులోకి వస్తే అటవీ ప్రాంతాల్లోని రైతులు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పెద్ద ఎత్తున పంటలు సాగు చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ దిశగా కలెక్టర్లు పనిచేస్తే గిరిజనులు ఆత్మగౌరవంతో బతికే అవకాశం స్పష్టంగా ఉందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో స్మాల్, మైక్రో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు నాలుగు నుంచి ఐదు ఎకరాలు భూమి అవసరం అవుతుంది. చిన్నపాటి ఇండస్ట్రియల్ ఏరియాల ఏర్పాటుకు అధికారులు భూములు సేకరించాలని ఆదేశించారు. దీని ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యాపారం చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. అటవీ హక్కుల ద్వారా లభించిన భూముల్లో అవకాడో వంటి పంటలు సాగు చేస్తే అటవీ సంపద పెరగడంతో పాటు గిరిజనులు ఆర్థికంగా బలోపేతం అవుతారని తెలిపారు. రాష్ట్రంలో 6.67 లక్షల ఎకరాలను ఇప్పటివరకు ప్రభుత్వం గిరిజనులకు పంపిణీ చేయగా ఆ భూముల్లో లాభసాటి పంటల సాగు జరగడంలేదని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇకనుంచి ఆ భూముల్లో ఉపాధి హామీ, గిరిజన శాఖ, స్వయం సహాయక సంఘాల ద్వారా వచ్చే పథకాలు అన్నిటిని సమన్వయం చేసుకొని ఆర్థికంగా ప్రయోజనం కలిగించే పంటల సాగును ప్రోత్సహించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని గిరిజన శాఖ అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. గిరిజనులకు ఆదాయం తక్కువగా ఉంటుంది ... భూమి లభ్యత ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో అచ్చంపేట నుంచి ఆదిలాబాద్ వరకు గోదావరి పరివాహక ప్రాంతంలో భూములపై అధికారులు దృష్టిపెడితే గిరిజనులకు ప్రయోజనం జరుగుతుందని మంత్రి సీతక్క తెలిపారు. హైదరాబాద్ వంటి మహానగరాల్లో భారీ భవంతుల పైన సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో గుట్టల తో విస్తరించిన భూములు అత్యధికంగా ఉన్నాయి. వీటి పైన సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేసే ఆలోచన చేయాలని ఇంధన శాఖ అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. వీటి ఏర్పాటు ద్వారా ప్రభుత్వ భూముల పరిరక్షణకు అవకాశం ఉంటుందని వివరించారు. ప్రధానమంత్రి పిఎం కుసుం పథకంలో భాగంగా రైతులు రెండు మెగావాట్ల వరకు సోలార్ పవర్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఏర్పడింది.ఈ దిశగా రైతులను చైతన్యం చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. టి జి రెడ్కో పోర్టల్ ద్వారా రైతులు సోలార్ పవర్ ఉత్పత్తికి దరఖాస్తులు చేసుకోవాల్సి ఉందని... దీని ద్వారా తక్కువ ధరకు విద్యుత్తు అందుబాటులోకి రావడం మే కాకుండా కాలుష్య రహిత విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఏర్పడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ నుండి పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 10 ఎకరాలు గుర్తించినట్లు తెలిపారు. నిర్దేశించిన గడువులోగా 140 ఎకరాలను గుర్తించి నివేదికలు అందజేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# -మార్నింగ్ 3 గంటలకే సెక్టార్ అధికారులు విధులకు హాజరుకావాలి.

## -రివర్ ఫెస్టివల్ కార్యక్రమం విజయవంతం చేయాలి.

## కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాచలం, జనవరి 08 (భారతశక్తి): శ్రీ సీతారామచంద్ర స్వామి వారి తెప్పోత్సవం మరియు వైకుంఠ ద్వార దర్శనం వివిధ సెక్టార్లలో విధులు నిర్వహించే అధికారులు 10వ తేదీ ఉదయం 3 గంటలకు తమ వీధులలో అందరూ హాజరు కావాలని నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం భద్రాచలంలోని మిథిలా స్టేడియం ప్రాంగణంలో



ముక్కోటి ఏకాదశి మహోత్సవాలకు విధులు కేటాయించబడిన వివిధ శాఖల అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టార్లలో డ్యూటీలు కేటాయించబడిన అధికారులు పదో తేదీ ఉదయం విధులలో చేరుకొని భక్తులు మరియు వీఐపీలు, వీవీఐపీలు వారి సెక్టార్లలో కూర్చునే విధంగా చూడాలని, వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలు, సీనియర్ సిటిజన్లను, అనారోగ్యంతో ఉన్న వారి పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సంబంధిత అధికారులు పోలీస్ సహకారం తప్పనిసరిగా తీసుకోవాలని, ఎవరైనా భక్తులు అస్వస్థతకు గురి అయితే వెంటనే దగ్గరలో ఉన్న వైద్య శిబిరానికి తరలించి వైద్య చికిత్సలు చేయించాలన్నారు. వీఐపీలు వివిఐపీల వెంట వచ్చే సిబ్బంది ఎవరైనా ఏమైనా గొడవలకు దిగితే పోలీస్ సహకారం తీసుకొని గొడవలు కాకుండా చూడాలని, దేవుని దగ్గర అందరం సమానమే అని వారికి నచ్చ చెప్పాలన్నారు. ఏమైనా సమస్య ఉంటే వెంటనే వాకిటాకిల ద్వారా కంట్రోల్ రూమ్ కు తెలియజేయాలన్నారు. ముఖ్యంగా తొమ్మిదవ తారీకు సాయంత్రం తెప్పోత్సవం 10 వ తారీకు ఉత్తర ద్వార దర్శనాలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా జరిగేలా అధికారులు కృషి చేయాలని, అధికారులకు ఆర్డిఓ కార్యాలయంలో భోజన వసతి సౌకర్యాలు కల్పించామని అన్నారు. ఈ సంవత్సరం ఏరు (రివర్) ఫెస్టివల్ ఆదివాసి గిరిజనులకు సంబంధించిన కార్యక్రమం రూపొందించడం జరిగిందని 9, 10, 11 తేదీలలో సాయంత్రం గిరిజనులకు సంబంధించిన కల్చరల్ ప్రోగ్రామ్స్ అలాగే ఆదివాసి గిరిజన వంటకాలు, గోదావరిలో బోట్ సౌకర్యం, ఐటీడీఏలోని ట్రైబల్ మ్యూజియం పర్యాటకుల కోసం ప్రత్యేకంగా గోదావరి పక్కన ప్రత్యేక క్యాంపెయింగ్ ఏర్పాటు చేశామని, ఈ మూడు రోజులే కాకుండా ప్రతిరోజు నిర్వహించి మార్చి వరకు కొనసాగించేలా చేస్తున్నామని అన్నారు. రివర్ ఫెస్టివల్ లో ఆదివాసి సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళల ద్వారా ఆదివాసి వంటకాలు మరియు ఇతర కళాఖండాలు ఆదివాసి కల్చర్ కు సంబంధించిన వస్తువులు అమ్ముకొని వారి జీవనోపాధికి తోడ్పాటు అందించడానికి స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, అధికారులు రివర్ ఫెస్టివల్ కార్యక్రమం విజయవంతం అయ్యేలా పూర్తిస్థాయిలో ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీవో దామోదర్ రావు, ఈవో రమాదేవి, భద్రాచలం తాసిల్దార్ శ్రీనివాస్ మరియు వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఛాంపియన్స్ ట్రోఫీ జట్టు.. ఆ ముగ్గురికి ఛాన్స్‌పై అనుమానాలు..

ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానున్న ఛాంపియన్స్ ట్రోఫీ పైనే ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది. అంతకుముందు భారత్ స్వదేశంలో ఇంగ్లండ్‌తో వన్డే, టీ20 సిరీస్‌లు ఆడనుంది. ఈనేపథ్యంలో జట్లను ప్రకటించాల్సి ఉంది. ఇంగ్లండ్ తో వన్డే సిరీస్ ఆడనున్న భారత జట్టే.. ఛాంపియన్స్ ట్రోఫీ బరిలోకి దిగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇప్పటివరకూ జట్లను ప్రకటించనప్పటికీ.. ఎవరిని తీసుకుంటారు.. ఎవరిని పక్కనపెడతారనే విషయాలపై తీవ్ర చర్చ కొనసాగుతోంది. ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో ముగ్గురు కీలక ఆటగాళ్లకు ఈసారి అవకాశం లభించకపోవచ్చని తాజాగా వార్తలు వెలువడుతున్నాయి.

కేఎల్ రాహుల్ , రవీంద్ర జడేజా మహ్మద్ షమీ లకు ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో చోటు దక్కకపోవచ్చని ఓ మీడియాలో వార్తలు వచ్చాయి. మోకాలిలో వాపు కారణంగా ఆసీస్ సిరీస్‌కు దూరంగా ఉన్న సీనియర్ పేసర్ మహ్మద్ షమీ తిరిగి జట్టులోకి వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. అయితే.. వన్డే ప్రపంచకప్ ఫైనల్ అనంతరం షమీ టీమ్ఇండియాకు ఆడలేదు. ఇక వైట్ బాల్ ఫార్మాట్‌లో రవీంద్ర జడేజా బ్యాటింగ్ మునుపటిలా లేదని.. అతడి స్థానంలో వన్డేలకు అక్షర్ పటేల్ మరింత ప్రభావవంతంగా కనిపిస్తాడని పలువురు అంటున్నారు. ఇక ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో వికెట్ కీపర్ స్లాట్ కోసం కేఎల్ రాహుల్, పంత్‌ల మధ్య పోటీ ఉంటుందని చెబుతున్నారు.

మరోవైపు ఇటీవల పేలవ ప్రదర్శనతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నప్పటికీ.. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలకు ఇందులో చివరి అవకాశం కల్పిస్తారని తెలుస్తోంది. అలాగైతే రోహిత్ శర్మనే ఛాంపియన్స్ ట్రోఫీలో జట్టును ముందుండి నడిపిస్తాడు.

జనవరి 12 లోపు ఛాంపియన్స్ ట్రోఫీ కోసం బీసీసీఐ జట్టును ప్రకటించాల్సి ఉంది. ఫిబ్రవరి 19 నుంచి ఈ ట్రోఫీ ప్రారంభం కానుంది. అంతకుముందు ఇంగ్లండ్‌తో టీమ్ఇండియా జనవరి 22 నుంచి ఐదు టీ20లు, మూడు వన్డేలు ఆడనుంది.

# అందుకే.. అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటన: ఆసీస్ మాజీ క్రికెటర్



: ఆస్ట్రేలియాతో ఓవైపు టెస్టు సిరీస్ జరుగుతుండగానే.. భారత సీనియర్ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. దీంతో టీమ్ఇండియా అభిమానులే కాకుండా.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ ఫ్యాన్స్ షాక్‌కు గురయ్యారు. ఐదు టెస్టుల సిరీస్‌ను భారత్ 1-3 తేడాతో కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో ఆసీస్ మాజీ క్రికెటర్ బ్రాడ్ హాడిన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అశ్విన్ రిటైర్మెంట్‌ను 'తమాషా' విషయంగా అభివర్ణించిన అతడు.. భారత్ ఎలాంటి ప్రణాళికలు లేకుండానే ఆస్ట్రేలియాకు వచ్చినట్లు వ్యాఖ్యానించాడు. రిజర్వ్ బెంచ్‌పై కూర్చోబెట్టడం వల్లే అశ్విన్ నిరుత్సాహానికి గురై వీడ్కోలు చెప్పినట్లు పేర్కొన్నాడు.

"బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో ఆసీస్‌తో తొలి మూడు టెస్టులను భారత్ ముగ్గురు విభిన్నమైన స్పిన్నర్లతో ఆడింది. అంటే ఆ జట్టు ప్రణాళికల్లేకుండానే ఆస్ట్రేలియా పర్యటనకు వచ్చినట్లు అనిపించింది. ఒకవేళ సిరీస్‌లో భారత్ విజయం సాధించి.. అప్పుడు అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించి ఉంటే సమస్యే కాదు. కానీ, సిరీస్ మధ్యలోనే వీడ్కోలు పలకడం తమాషాగా ఉంది. ఎక్కువ మ్యాచ్‌లకు రిజర్వ్ బెంచ్‌పై ఉండటంతోనే ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్లు అనిపిస్తోంది. నంబర్ వన్ స్పిన్నర్‌గా భావిస్తున్న అశ్విన్‌ను పక్కన కూర్చోబెట్టారు. 'ఆసీస్‌పై అద్భుతమైన రికార్డు ఉన్న స్పిన్నర్‌గా నేను బెంచ్‌పై కూర్చోలేను. నేను అత్యుత్తమ స్పిన్నర్ కాదని నిర్ణయించినప్పుడు ఇక్కడితో ఆడటం ఆపేస్తా. నాకు అవసరం లేదు' అని అశ్విన్ అనుకొని ఉండొచ్చు. ఇదే జరిగిందని భావిస్తున్నా" అని హాడిన్ వెల్లడించాడు.

స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే (619 వికెట్లు) తర్వాత భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ అశ్విన్. 106 టెస్టుల్లో 537 వికెట్లు పడగొట్టాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లోనూ భారత్ నుంచి అతడే ఎక్కువ వికెట్లు పడగొట్టాడు. 41 టెస్టుల్లో 191 వికెట్లు తీశాడు. బ్యాటర్‌గా టెస్టుల్లో 3,503 పరుగులు రాబట్టాడు. 116 వన్డేల్లోనూ 156 వికెట్లు, 65 టీ20ల్లో 72 వికెట్లు పడగొట్టాడు.

# ఐసీసీ ర్యాంకింగ్స్.. టాప్-10లోకి రిషభ్ పంత్, బోలాండ్

ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత బ్యాటర్ రిషభ్ పంత్ (%=అంపుఒప్ప ఖుత్%) తిరిగి టాప్-10లోకి వచ్చాడు. ఆస్ట్రేలియాతో సిడ్నీ టెస్టులో రాణించిన అతను మూడు స్థానాలు మెరుగై 739 రేటింగ్ పాయింట్లతో 9వ స్థానంలో నిలిచాడు. సిడ్నీ టెస్టులో పంత్ తొలి ఇన్నింగ్స్‌లో 40, రెండో ఇన్నింగ్స్‌లో 33 బంతుల్లోనే 61 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఇక, ఆస్ట్రేలియా పేసర్ స్కాట్ బోలాండ్ ఏకంగా 29 స్థానాలు ఎగబాకి టాప్-10లోకి దూసుకొచ్చాడు. 745 పాయింట్లతో రవీంద్ర జడేజాతో కలిసి బోలాండ్ 9వ స్థానాన్ని పంచుకున్నాడు. భారత్‌తో జరిగిన చివరి టెస్టులో బోలాండ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.




గతవారం ర్యాంకింగ్స్‌లో 907 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచిన జస్‌ప్రీత్ బుమ్రా ) తాజాగా మరో పాయింట్‌ను పెంచుకుని టాప్‌లోనే కొనసాగుతున్నాడు. భారత్ తరఫున అత్యుత్తమంగా రేటింగ్ పాయింట్లు సాధించిన బౌలర్ బుమ్రానే. 2016లో అశ్విన్ (904)ను బుమ్రా గతవారం అధిగమించిన సంగతి తెలిసిందే. బ్యాటింగ్ విభాగంలో టాప్-5లో ఎలాంటి మార్పులు లేవు. జో రూట్, హ్యారీ బ్రూక్, కేన్ విలియమ్సన్, యశస్వి జైస్వాల్, ట్రావిస్ హెడ్ వరుసగా మొదటి ఐదు స్థానాల్లో ఉన్నారు. దక్షిణాఫ్రికా కెప్టెన్ తెంబా బావుమా మూడు స్థానాలు మెరుగై ఆరో ర్యాంకులో నిలిచాడు. పాక్ బ్యాటర్ బాబర్ అజామ్ ఐదు స్థానాలు ఎగబాకి 12వ ర్యాంకు అందుకున్నాడు. భారత బ్యాటర్లు శుభ్‌మన్ గిల్ ,విరాట్ కోహ్లీ మూడేసి స్థానాలు డౌన్ అయి వరుసగా 23వ, 27వ ర్యాంకులకు పరిమితమయ్యారు. ఆసీస్‌తో చివరి టెస్టుకు దూరంగా రోహిత్ శర్మ రెండు స్థానాలు దిగజారి 42వ ర్యాంకులో ఉన్నాడు.

ఇటీవల ముగిసిన బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్‌ను ఆస్ట్రేలియా 3-1తో కైవసం చేసుకుంది. పెర్త్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో గెలిచి శుభారంభం చేసిన భారత్.. తర్వాత తడబడి సిరీస్‌ను చేజార్చుకుంది. ఈ ఐదు టెస్టులకు సంబంధించిన పిచ్ రేటింగ్‌ను ఐసీసీ తాజాగా ప్రకటించింది. పెర్త్, అడిలైడ్ ఓవల్, గబ్బా, మెల్‌బోర్న్ పిచ్‌లకు 'వెరీ గుడ్' అని, సిడ్నీ పిచ్‌కు 'సంతృప్తికరం' అనే రేటింగ్ ఇచ్చింది. ఇంతకుముందు పిచ్ రేటింగ్ విధానం ఆరు కేటగిరీలుగా ఉండేది. 2023లో దీన్ని నాలుగుకు (వెరీ గుడ్, సంతృప్తికరం, అసంతృప్తికరం, అన్‌ఫిట్) కుదించారు.

# సెలెక్టర్ల చేతిలో రోహిత్, కోహ్లి భవితవ్యం: గావస్కర్

సిడ్నీ: భారత కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీల టెస్టు కెరీర్ భవితవ్యం సెలెక్టర్ల చేతిలో ఉందని దిగ్గజ క్రికెటర్ సునీల్ గావస్కర్ న్నాడు. జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్న వారికి సరైన అవకాశాలు కల్పించాలని అజిత్ అగార్కర్ సారథ్యంలోని సెలెక్షన్ కమిటీకి సూచించాడు. ''రోహిత్, కోహ్లి ( ఎంతకాలం కొనసాగాలన్నది సెలెక్టర్ల చేతిలో ఉంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)కు అర్హత సాధించడంలో భారత్ విఫలమైంది. ఎందుకలా జరిగిందో ఆలోచించడం సముచితం. గత ఆర్నెల్లలో గెలవాల్సిన మ్యాచ్‌లు భారత్ ఓడిపోవడానికి బ్యాటింగ్ వైఫల్యమే ప్రధాన కారణం. జూన్‌లో ఇంగ్లాండ్ పర్యటనతో డబ్ల్యూటీసీ చక్రం కొత్తగా ఆరంభమవుతుంది. 2027 ఫైనల్‌కు ఎవరెవరు అందుబాటులో ఉంటారన్న విషయాన్ని సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకుని జట్టును ఎంపిక చేస్తారని ఆశిస్తున్నా. రంజీ ట్రోఫీలో బాగా ఆడిన వాళ్లకు అవకాశం ఇవ్వకపోతే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారో లేదో ఎలా తెలుస్తుంది?



నితీశ్‌కుమార్‌రెడ్డి ) ప్రతిభను గుర్తించి, టెస్టు జట్టుకు ఎంపిక చేసిన అగార్కర్ బృందానికి అభినందనలు. భారత్‌లో ప్రతిభ ఉన్న పేసర్లు ఎంతోమంది అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. బుమ్రాపై అదనపు భారం పడకుండా చూడాలి. బుమ్రాకు నాణ్యమైన పేసర్లు జతకలిస్తే ఎలాంటి పరిస్థితుల్లోనైనా మ్యాచ్‌లను గెలవగలిగే బౌలింగ్ దాడిని కలిగి ఉంటాం'' అని గావస్కర్ పేర్కొన్నాడు.

# రోహిత్ నాయకత్వంలోనే ఛాంపియన్స్ ట్రోఫీకి..

ఆస్ట్రేలియా పర్యటనలో విఫలమైన భారత కెప్టెన్ రోహిత్ శర్మకు చివరి అవకాశం ఇచ్చేందుకు బీసీసీఐ సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం జట్టును ప్రకటించేందుకు సెలక్షన్ కమిటీ సమాయత్తమవుతోంది. ఇంగ్లండ్‌తో వన్డే, టీ20 సిరీస్‌లకు స్క్వాడ్‌లను ప్రకటించాల్సి ఉంది. ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఈ మెగా టోర్నీకి ముందు టీమ్ఇండియా ఆడే చివరి వన్డే సిరీస్ కూడా ఇంగ్లండ్‌తోనే. ఈ క్రమంలో ఫామ్‌ను అందిపుచ్చుకోవడానికి ఇంగ్లండ్‌తో సిరీస్‌కు రోహిత్‌ను ఎంపిక చేస్తారా? లేదా? అనేది అనుమానంగా ఉంది. అతడికి విశ్రాంతి ఇచ్చి హార్దిక్‌కు సారథ్యం అప్పగిస్తారనే వార్తలు వచ్చాయి. కానీ, ఛాంపియన్స్ ట్రోఫీకి రోహిత్ నాయకత్వంలోనే భారత్ (%ఖుఒ ×అ-ఒఖు%) బరిలోకి దిగబోతోందని బీసీసీఐ వర్గాలు పేర్కొంటున్న వేళ.. ఇంగ్లండ్‌తో జరిగే సిరీస్‌కూ రోహిత్‌నే ఎంపిక చేస్తారని తెలుస్తోంది. 37 ఏళ్ల రోహిత్‌కు ఇదే చివరి ఐసీసీ టోర్నీ అయినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

విరాట్ కోహ్లీ కూడా..

ప్రస్తుతం భారత జట్టు సీనియర్ బ్యాటర్‌గా ఉన్న విరాట్ కోహ్లీ ఫామ్ కూడా గొప్పగా లేదు. ఆసీస్‌పై తన స్థాయి ఆటను ప్రదర్శించలేకపోయాడు. దీంతో రోహిత్, విరాట్ టెస్టులకు గుడ్‌బై చెబుతారని అంతా భావించారు. కానీ, ఇప్పటివరకు అలాంటి ప్రకటన చేయలేదు. అయితే, వన్డే ఫార్మాట్‌లో జరగనున్న ఛాంపియన్స్ ట్రోఫీకి మాత్రం రోహిత్‌తోపాటు విరాట్ కోహ్లీకి అవకాశం ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది. గత వన్డే ప్రపంచకప్‌లో విరాట్ అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. టెస్టు ఫామ్‌ను పక్కనపెడితే.. కోహ్లీ ఆటపై బీసీసీఐ సెలక్టర్లు విశ్వాసం ఉంచే అవకాశం ఉంది.

సిద్ధమంటోన్న షమీ.. పంత్‌కు విశ్రాంతి ఇస్తారా? మోకాలిలో వాపు కారణంగా ఆసీస్ సిరీస్‌కు దూరంగా ఉన్న సీనియర్ పేసర్ మహ్మద్ షమీ తిరిగి జట్టులోకి రానున్నట్లు తెలుస్తోంది. ఇంగ్లండ్‌తో సిరీస్‌లకు అతడిని ఎంపిక చేస్తారని సమాచారం. ఆ తర్వాత ఛాంపియన్స్‌లోనూ ఆడే అవకాశం లేకపోలేదు.



# టీమ్ఇండియా ప్రదర్శనపై త్వరలో బీసీసీఐ రివ్యూ.. వారిపై చర్యలు లేనట్లేనా..?

బోర్డర్ గావస్కర్ ట్రోఫీ లో టీమ్ఇండియా పేలవ ప్రదర్శనతో దారుణంగా విఫలమైంది. 1-3 తేడాతో సిరీస్‌ను కోల్పోయింది. దీంతో డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరే అవకాశాలు గల్లంతయ్యాయి. మరోవైపు సీనియర్లు రోహిత్ శర్మ ( విరాట్ కోహ్లీలపైతీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ( అతడి సహాయక సిబ్బంది పాత్ర పైనా పలువురు ప్రశ్నలు లేవనెత్తారు. ఈనేపథ్యంలో టీమ్ఇండియా తాజా ఫలితాలపై బీసీసీఐ ( సమీక్ష చేపట్టనున్నట్లు సమాచారం. పలువురిపై కఠిన చర్యలకు దిగనుందని అప్పట్లో వార్తలు వచ్చాయి. అయితే.. అలాంటిదేమీ లేదని తాజా సమాచారం.

బీసీసీఐ త్వరలోనే రివ్యూ మీటింగ్ ఏర్పాటుచేయనుందని.. అయితే.. కోచ్‌తోపాటు, సీనియర్లపైనా ఎలాంటి చర్యలు ఉండబోవని ఓ మీడియా కథనం పేర్కొంది. "అవును.. రివ్యూ మీటింగ్ ఉంటుంది. అయితే.. ఎవరినీ జట్టు నుంచి తొలగించరు. బ్యాటర్ల పేలవ ప్రదర్శనకు కోచ్‌పై చర్యలు తీసుకోలేం. గౌతమ్ గంభీర్ కోచ్‌గా కొనసాగుతాడు. అలాగే విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఇంగ్లాండ్ సిరీస్ ఆడతారు. ప్రస్తుతం టీమ్ఇండియా దృష్టి అంతా త్వరలో జరిగే ఛాంపియన్స్ ట్రోఫీపైనే ఉంది' అంటూ ఓ బీసీసీఐ అధికారి చెప్పినట్లు ఆ మీడియా కథనం పేర్కొంది.

# క్విక్ ఫుడ్ డెలివరీ సేవల్లోకి జొమాటో రీ ఎంట్రీ

2 ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో క్విక్ డెలివరీ సేవల్ని తిరిగి ప్రారంభించింది. ఫుడ్ డెలివరీ విభాగంలో పోటీ పెరుగుతున్న తరుణంలో గతంలో పరిచయం చేసిన ఈ సర్వీసులను తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇకపై 15 నిమిషాల్లో ఫుడ్ డెలివరీలను అందించేందుకు సిద్ధమవుతోందని తెలుస్తోంది.

15 నిమిషాల డెలివరీ

క్విక్ డెలివరీ సర్వీసుల ( గురించి జొమాటో అధికారికంగా ప్రకటించలేదు. అయితే ముంబయి, బెంగళూరు.. వంటి ప్రధాన నగరాల్లో ఎంపిక చేసిన ప్రదేశాల్లో ఇప్పటికే ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో జొమాటో యాప్ వినియోగిస్తున్నవారికి అప్లికేషన్ సెర్చ్ విభాగంలో "15 నిమిషాల డెలివరీ' అంటూ ట్యాబ్ కనిపిస్తోంది. ఇందులో క్విక్‌గా తయారుచేసే రెసిపీస్, రెడీ-టు-ఈట్ వంటకాలు చూపిస్తోంది. వేగవంతమైన డెలివరీ కోసం రెండు కిలోమీటర్ల పరిధిలో ఉన్న రెస్టరంట్లను పరిమితం చేసింది.




వినియోగదారులకు 10 నిమిషాల్లోపే ఆహారాన్ని డెలివరీ చేస్తామంటూ గతంలో జొమాటో చేసిన ప్రకటనపై పెద్దఎత్తున విమర్శలు ఎదురయ్యాయి. అయితే పలు కారణాలరీత్యా ఆ సేవల్ని మధ్యలోనే ఆపేసింది. తాజాగా డెలివరీ విభాగంలో పోటీ పెరుగుతోంది. ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ తన 10 నిమిషాల ఫుడ్ డెలివరీ సేవలు 'బోల్ట్' సేవల్ని 2024 అక్టోబర్‌లో ప్రారంభించింది. సర్వీసుల్ని వేగంగా విస్తరిస్తోంది. ప్రముఖ క్యాబ్ సేవల ప్లాట్‌ఫామ్ ఓలా కూడా 10 నిమిషాల్లోనే ఫుడ్ డెలివరీ అందించే సేవల్ని విస్తరిస్తోంది. దీంతో జొమాటో 15 నిమిషాల డెలివరీకి సిద్ధమవుతున్నట్లు సమాచారం

# మెటాలో ఫ్యాక్ట్‌చెకర్‌లను తొలగించిన జుకర్‌బర్గ్

నకిలీ, హానికార సమాచార వ్యాప్తి కట్టడి కోసం అనుసరిస్తోన్న సెన్సార్‌షిప్ విధానాల్లో మెటా మార్పులు చేసింది. ఫ్యాక్ట్‌చెకర్‌లను తొలగించింది. ఈమేరకు టెక్ సంస్థ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ ప్రకటించారు. త్వరలో అమెరికా పగ్గాలు చేపట్టబోతున్న డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగానికి అనుకూలంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

"సెన్సార్‌షిప్ అధిక స్థాయిలో ఉన్న పరిస్థితికి చేరుకున్నాం. ప్రస్తుతం మేం మా తప్పులను తగ్గించుకోవడంపై దృష్టిపెడతాం. మా విధానాలను సరళీకరించి, మా ప్లాట్‌ఫాంలలో స్వేచ్ఛ, భావవ్యక్తీకరణను పునరుద్ధరించే దిశగా చర్యలు తీసుకుంటాం" అని జుకర్‌బర్గ్ ఓ వీడియో విడుదల చేశారు. జుకర్‌బర్గ్ ప్రకటన వెలువడగానే ట్రంప్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ సానుకూలంగా స్పందించారు.



ఇది ఆకట్టుకునే నిర్ణయమంటూ జుకర్‌బర్గ్‌ను ఉద్దేశించి ట్రంప్ స్పందించారు. భావ ప్రకటన స్వేచ్ఛకు అనుకూలంగా వాదించే మస్క్ మెటాలో చేసిన మార్పులను స్వాగతించారు. ఈ టెక్ సంస్థలో ఉన్న ఫ్యాక్ట్‌చెకింగ్ నిబంధనలను గతంలో వీరిద్దరూ తీవ్రంగా విమర్శించారు. సెన్సార్‌షిప్ అంటూ వ్యాఖ్యలు చేశారు.

తాజా నిర్ణయంతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, థ్రెడ్ సహా అన్ని మెటా ప్లాట్‌ఫామ్‌లలో ఈ ఫ్యాక్ట్ చెకింగ్ తొలగింపు అమలవుతుంది. అలాగే గతంలో ఎక్స్ అందుబాటులోకి తెచ్చిన కమ్యూనిటీ నోట్స్ తరహా విధానాన్ని తీసుకురానున్నట్లు తెలుస్తోంది.

కమ్యూనిటీ నోట్స్ యూజర్ ఆధారిత ఫ్యాక్ట్ చెకింగ్ ప్రోగ్రామ్. వివిధ దృక్కోణాలు గలవారికిది బాగా తోడ్పడుతుంది. తప్పుదారి పట్టించే అవకాశం గల పోస్టులకు సందర్భాలను జోడించటానికిది వీలు కల్పిస్తుంది. ఇలా సరైన సమాచారం ప్రసారం కావటానికి దోహదం చేస్తుంది. కంట్రిబ్యూటర్లు ఏ పోస్టు మీదైనా నోట్స్ పెట్టొచ్చు. భిన్న రంగాలకు చెందిన కంట్రిబ్యూటర్లు ఆ నోట్ ఉపయోగపడుతుందని రేట్ ఇచ్చినట్టయితే ఆయా పోస్టులు అందరికీ కనిపిస్తాయి. ఎక్స్ నిబంధనలను ఉల్లంఘిస్తే తప్ప కమ్యూనిటీ నోట్‌తో కూడిన పోస్టును లేబుల్ చేయటానికి, తొలగించటానికి వీలుండదు.

యాజమాన్యం బాధ్యత వహించదు. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకి తావు లేదు.

# వన్‌ప్లస్ 13 సిరీస్ వచ్చేసింది.. స్పెసిఫికేషన్లు ఇవే..

ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ వన్‌ప్లస్ ) నుంచి సరికొత్త ఫ్లాగ్‌షిప్ 5జీ స్మార్ట్‌ఫోన్‌లు వచ్చేశాయి. మంగళవారం నిర్వహించిన వింటర్ లాంచ్ ఈవెంట్‌లో వన్‌ప్లస్ 13 వన్‌ప్లస్ 13ఆర్ ( స్మార్ట్‌ఫోన్‌లను లాంచ్ చేసింది. వీటితోపాటు రూ.11,999తో వన్‌ప్లస్ బడ్స్ ప్రో3 వైర్‌లెస్ ఇయర్ బడ్స్‌ను విడుదల చేసింది. ఫోన్లకు నాలుగేళ్ల ఓఎస్ అప్‌డేట్లు, ఆరేళ్ల సెక్యూరిటీ అప్‌డేట్లు ప్రకటించింది.

వన్‌ప్లస్ 13..

వన్‌ప్లస్ 13లో స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ చిప్ అమర్చారు. ఏఐ పవర్డ్ ఆక్సిజన్ 15 ఆపరేటింగ్ సిస్టమ్‌తో తీసుకొచ్చారు. 6.82 అంగుళాల 2కే ఓఎల్‌ఈడీ, 120%ఎ%ట% రిఫ్రెష్ రేట్ డిస్‌ప్లే ఉంది. ఐపీ69/ఐపీ68 రేటింగ్, ఆక్వా టచ్ 2.0తో తీసుకొచ్చారు. 4500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఉంది. 32 ఎంపీ సెల్ఫీ కెమెరా, వెనుకవైపు 50 ఎంపీ సోనీ ఎల్‌వైటీ 808 మెయిన్, 50 ఎంపీ అల్ట్రావైడ్, 50 ఎంపీ ట్రైప్రిజమ్ టెలిఫొటో కెమెరాలు, ఉన్నాయి. 6000 ఎంఏహెచ్ బ్యాటరీతో 100 వాట్ సూపర్‌వూక్ ఫాస్ట్ ఛార్జింగ్, 50 వాట్ వైర్‌లెస్ ఛార్జింగ్ సపోర్ట్ చేస్తుంది.




12 జీబీ ర్యామ్‌ం 256 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ వేరియంట్ ధర రూ.69,999, 16 జీబీం 512 జీబీ ధర రూ.76,999, 24 జీబీం 1 టీబీ ధరను రూ.89,999గా నిర్ణయించారు. ఐసీఐసీఐ కార్డుపై రూ.5 వేల తగ్గింపు ఆఫర్ ఉంది. అదేవిధంగా రూ.7వేల వరకు అదనపు ఎక్స్ఛేంజీ ఆఫర్లు ఉన్నాయి. జనవరి 10 నుంచి ఈ ఫోన్లు మార్కెట్‌లో అందుబాటులోకి రానున్నాయి. మిడ్‌నైట్ ఓషన్, ఆర్కిటిక్ డాన్, బ్లాక్ ఎక్లిప్స్ రంగుల్లో లభ్యం కానున్నాయి.

వన్‌ప్లస్ 13 ఆర్..

స్నాప్‌డ్రాగన్ 8జెన్ 3 ప్రాసెసర్ ఇచ్చారు. 6.78 అంగుళాల 1.5కే ఓఎల్‌ఈడీ, 120%ఎ%ట% రిఫ్రెష్ రేట్ డిస్‌ప్లేతో వచ్చింది. ఏఐ పవర్డ్ ఆక్సిజన్ 15 ఆపరేటింగ్ సిస్టమ్ ఆధారంగా పనిచేస్తుంది. 6000 ఎంఏహెచ్ బ్యాటరీతో 80 వాట్ సూపర్‌వూక్ ఛార్జింగ్ సపోర్ట్ చేస్తుంది. 16 ఎంపీ సెల్ఫీ కెమెరా, వెనుకవైపు 50 ఎంపీ సోనీ ఎల్‌వైటీ 700 ప్రధాన కెమెరా, 8 ఎంపీ అల్ట్రావైడ్, 50 ఎంపీ టెలిఫొటో కెమెరాలు ఉన్నాయి. ఐపీ65 రేటింగ్, ఆక్వా టచ్ 2.0 కల్పించారు.

12 జీబీం 256 జీబీ వేరియంట్ ధర రూ.42,999, 16 జీబీం 512 జీబీ ధర రూ.49,999గా నిర్ణయించారు. ఐసీఐసీఐ కార్డుపై రూ.3 వేల తగ్గింపు ఉంది. రూ.4వేల వరకు అదనపు ఎక్స్ఛేంజీ ఆఫర్ ప్రకటించారు. జనవరి 13 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి. ఆస్ట్రల్ ట్రయల్, నెబ్యులా నొయిర్ రంగుల్లో ఈ ఫోన్లు లభ్యం కానున్నాయి.

# ఓలాకు సెబీ వార్నింగ్ లెటర్.. షేర్లపై ప్రభావం

విద్యుత్ వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ కు మరో ఎదురుదెబ్బ తగిలింది. నిబంధనలు ఉల్లంఘించినందుకు గానూ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ( హెచ్చరిక లేఖ జారీ చేసింది. ఈ వార్తల నేపథ్యంలో ఓలా షేర్లు 4 శాతం మేర క్షీణించాయి. 12:35 గంటల సమయంలో కాస్త కోలుకొని 2.68 శాతం నష్టంతో రూ.77.04 వద్ద ట్రేడవుతున్నాయి.

సాధారణంగా కంపెనీకి సంబంధించిన అన్ని ప్రణాళికల్ని ముందుగా ఎక్స్ఛేంజీలకు వెల్లడించాల్సి ఉంటుంది. కానీ ఓలా ఎలక్ట్రిక్ సీఈఓ భవీశ్ అగర్వాల్ న రిటైల్ స్టోర్ల సామర్థ్యాన్ని 4 రెట్లు పెంచుతున్నట్లు 'ఎక్స్' వేదికగా తొలుత వెల్లడించారు. 'కస్టమర్లకు మెరుగైన సేవల్ని అందించాలనే లక్ష్యంతో ప్రస్తుతం ఉన్న 800 స్టోర్‌ల సంఖ్యను 4000కు పెంచనున్నాం' అని 2024 డిసెంబర్ 2 ఉదయం 9:58 గంటలకు సోషల్‌మీడియా వేదికగా వెల్లడించారు. అయితే స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఈ సమాచారం మధ్యాహ్నం 1:36 గంటల నుంచి 1:41 గంటలకు అందిందని సెబీ పేర్కొంది.




రెగ్యులేటర్ నియమాల ప్రకారం.. స్టాక్ మార్కెట్లో నమోదిత సంస్థలకు సంబంధించిన అన్ని ఈవెంట్‌లు లేదా ఇతర సమాచారాన్ని ఏ సందర్భాల్లోనైనా బహిర్గతం చేసే ముందు స్టాక్ ఎక్స్ఛేంజీలకు వివరాలు అందించాల్సి ఉంటుంది. కానీ ఓలా మాత్రం సమాచారాన్ని మొదట బహిర్గతం చేసి ఆ తర్వాత స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపిందని సెబీ వెల్లడించింది. నిబంధనలు పాటించడంలో ఓలా విఫలమైందని పేర్కొంది. దీంతో నిబంధనల ఉల్లంఘనల్ని తీవ్రంగా పరిగణించిన నియంత్రణ సంస్థ ఓలాకు హెచ్చరిక లేఖ జారీ చేసింది. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించింది. సెబీ లేఖపై ఓలా స్పందించింది. హెచ్చరిక కారణంగా ఎలాంటి ఆర్థికపరమైన చిక్కులు ఉండవని పేర్కొంది. ఈ వివరణతో షేర్లు కాస్త కోలుకున్నాయి.

# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు.. 23,700 దిగువకు నిఫ్టీ

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు (ం ఫ్లాట్‌గా ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో మిశ్రమ సంకేతాల మధ్య ఉదయం మార్కెట్ ప్రారంభంలోనే నష్టాల్లోకి జారుకున్న సూచీలు ఆ తర్వాత కాస్త కోలుకున్నాయి. ఐటీ, ఎఫ్ఎంసీజీ, గ్యాస్ షేర్లలో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. దీంతో చివరకు ఫ్లాట్‌గా ముగిశాయి.

సెన్సెక్స్ ఉదయం 78,319.45 పాయింట్ల (క్రితం ముగింపు 78,144.82) వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. రోజంతా తీవ్ర ఒడుదొడుకులను ఎదుర్కొన్న సూచీ ఇంట్రాడేలో 77,486.79 - 78,319 మధ్య కదలాడింది. చివరకు 50 పాయింట్ల నష్టంతో 78,148.49 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఇంట్రాడేలో 23,496 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 18 పాయింట్ల నష్టంతో 23,688 వద్ద ముగిసింది.



సెన్సెక్స్ 30 ( సూచీలో అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్అండ్‌టీ, సన్‌ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్టీపీసీ షేర్లు నష్టపోయాయి. టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 77.72 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2,667.30 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# నాలుగేళ్ల కనిష్ఠానికి వృద్ధిరేటు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) దేశ వృద్ధి రేటు 6.4 శాతంగా నమోదవ్వచ్చని ప్రభుత్వ మొదటి ముందస్తు అంచనా గణాంకాలు చెబుతున్నాయి. ఇది నాలుగేళ్ల కనిష్ఠ స్థాయి. తయారీ, సేవల రంగాల పేలవ ప్రదర్శన ఇందుకు కారణం. 2020-21లో కొవిడ్-19 పరిణామాల నేపథ్యంలో దేశ వృద్ధి రేటు -5.8 శాతంగా నమోదైంది. అప్పటి నుంచి చూస్తే 2024-25కు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) అంచనా వేసిన 6.4% వృద్ధిరేటే కనిష్ఠం. 2021-22లో 9.7%బీ 2022-23లో 7%, 2023-24లో 8.2% వృద్ధి రేటును దేశ ఆర్థిక వ్యవస్థ సాధించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆర్‌బీఐ 6.6%బీ ఆర్థిక శాఖ 6.5-7% వృద్ధి రేటును అంచనా వేశాయి. ఎన్ఎస్ఓ అంచనా వీటి కంటే తక్కువగా ఉంది. ఈ గణాంకాలను ఫిబ్రవరి 1న లోక్‌సభలో ప్రవేశపెట్టబోయే వార్షిక బడ్జెట్ రూపకల్పన కోసం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉపయోగించుకుంటారు. ఎన్ఎస్ఓ గణాంకాల ప్రకారం..




2024-25లో తయారీ రంగ ఉత్పత్తి వృద్ధి 5.3 శాతానికి తగ్గే అవకాశం ఉంది. 2023-24లో ఇది 9.9%.

సేవల రంగ వృద్ధి 6.4% నుంచి 5.8 శాతానికి పరిమితమయ్యే అవకాశం ఉంది.

వ్యవసాయ రంగం 3.8% వృద్ధిని నమోదు చేయొచ్చు. 2023-24లో ఇది 1.4 శాతమే.

2024-25లో ప్రస్తుత ధరల వద్ద జీడీపీ (నామినల్ జీడీపీ) వృద్ధి 9.7 శాతంగా నమోదుకావచ్చు. 2023-24లో ఇది 9.6 శాతంగా ఉంది. విలువ ప్రకారంగా చూస్తే.. నామినల్ జీడీపీ రూ.324.11 లక్షల కోట్ల స్థాయిని అందుకోవచ్చు. 2023-24లో ఇది రూ.295.36 లక్షల కోట్లుగా ఉంది.

ప్రస్తుత అంచనాల ప్రకారం.. 2024-25లో ఆర్థిక వ్యవస్థ పరిమాణం 3.8 లక్షల కోట్ల డాలర్లు. నామినల్ స్థూల విలువ జోడింపు (జీవీఏ)ను రూ.292.64 లక్షల కోట్లుగా అంచనా వేశారు. 2023-24లోని రూ.267.62 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 9.3% ఎక్కువ. స్థిర ధరల వద్ద ప్రైవేట్ వినియోగ వృద్ధి రేటు 7.3 శాతంగా నమోదుకావచ్చు. 2023-24లో ఇది 4 శాతమే. ప్రభుత్వ వినియోగ వృద్ధి 2.5% నుంచి 4.1 శాతానికి పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుత ధరల వద్ద తలసరి వార్షిక ఆదాయం 8.7% పెరిగి రూ.2,00,162కు చేరొచ్చు. గత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.1,84,205గా ఉంది.

# గేమ్ ఛేంజర్ నుంచి మరో సాంగ్ రిలీజ్




మెగా హీరో రామ్ చరణ్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ గేమ్ ఛేంజర్ మరో రెండు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఆర్ఆర్ఆర్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్ సినిమా వస్తుండటంతో ఈ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. దిగ్గజ దర్శకుడు శంకర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. దిల్ రాజు ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఇప్పటికే మూవీ నుంచి ట్రైలర్‌తో పాటు పాటలను విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ దక్కించుకున్నాయి. అయితే తాజాగా ఈ మూవీ నుంచి మెలోడి సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. "అలికి పూసిన అరుగు మీద కలికి సుందరినై కూసుంటే పలకరించవేంది ఓ దొర. చిలక ముక్కు చిన్ని నా దొరా". అంటూ ఈ మెలోడి ఉండగా.. రామ్ చరణ్ అంజలిపై ఈ పాటను చిత్రీకరించినట్లు తెలుస్తుంది. ఈ పాటకు కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించగా.. థమన్, ఎస్ రోషిని జేకేవీ కలిసి పాడారు. థమన్ సంగీతం అందించాడు. ఇప్పటికే జరగండి.. జరగండి, ధోప్, రా మచ్చా సాంగ్‌లతో దూసుకుపోతున్న ఈ చిత్రంకి మెలోడి జత కావడంతో సూపర్ హిట్ కాయం అంటున్నారు అభిమానులు.

# ఆంధ్రాకు సినిమాలంటే...

## తెలంగాణకు కల్లు, మటన్ అంటే ప్రాణం : దిల్‌రాజ్



టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్ హీరోగా నటిస్తున్న చిత్రం సంక్రాంతికి వస్తున్నాం. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నాడు. ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2025 సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా ట్రైలర్‌ను లాంచ్ చేయగా మంచి స్పందన వస్తోంది. ఈ ఈవెంట్‌లో దిల్ రాజు చేసిన కామెంట్స్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. తెలుగు రాష్ట్రాల్లో సినీ జనాలు సినిమాలను ఏ స్థాయిలో ఆదరిస్తారో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ప్రత్యేకించి తెలంగాణలో భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా టాలెంట్ ఉన్న ప్రతీ నటీనటులు, టెక్నీషియన్లకు ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుంటారు. అయితే ఈవెంట్‌లో దిల్ రాజు మాట్లాడుతూ.. 'మావోళ్లకు సినిమా కంటే.. మన దగ్గర సినిమాలు తక్కువ కాబట్టి మీ దగ్గర నుంచి రియాక్షన్ తక్కువ వస్తుందని మా డైరెక్టర్‌కు చెప్పా. ఆంధ్రాకు వెళ్తే సినిమాకు ఒక వైబ్ ఇస్తరు. మన దగ్గర అయితే తెల్ల కల్లు, మటన్‌కు వైబ్ ఇస్తమని (నవ్వుతూ)' అన్నారు. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి.

# ఆ నోటీసులు అవాస్తవం

## ప్రకటన విడుదల చేసిన చంద్రముఖి నిర్మాణ సంస్థ



లేడీ సూపర్ స్టార్ నయనతారకు చెందిన డాక్యుమెంటరీ వివాదంలో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. చంద్రముఖి నిర్మాతలు నయన్‌కు లీగల్ నోటీసులు ఇచ్చారంటూ నిన్నటి నుంచి తెగ ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే డాక్యుమెంటరీలో పర్మిషన్ లేకుండా 'చంద్రముఖి' చిత్రంలోని కొన్ని సన్నివేశాలను వాడుకున్నందుకు నయన్ సహా ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌కు రూ. 5 కోట్లు చెల్లించాలంటూ లీగల్ నోటీసులు జారీ చేసినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. అయితే, ఈ వార్తలపై 'చంద్రముఖి' సినీ నిర్మాణ సంస్థ శివాజీ ప్రొడక్షన్స్ తాజాగా స్పందించింది. నయన్‌కు తాము ఎలాంటి నోటీసులూ ఇవ్వలేదని సదరు నిర్మాణ సంస్థ క్లారిటీ ఇచ్చింది. 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' డాక్యుమెంటరీలో 'చంద్రముఖి' సినిమాలోని సన్నివేశాలను తమ పర్మిషన్ తీసుకొనే వినియోగించుకున్నారని స్పష్టం చేసింది. మొత్తం 17 సెకన్ల సన్నివేశాలను రౌడీ పిక్చర్స్ సంస్థ వాడుకోవచ్చని, దీనిపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపింది. ఈ మేరకు గతేడాది నవంబర్‌లో జారీ చేసిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను మీడియాకు విడుదల చేసింది. ఈ ఎన్‌వోసీని మనోబాల విజయబాలన్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు.

# 'స్క్విడ్ గేమ్'లో స్టార్ హీరోలు వీడియో వైరల్



ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'స్క్విడ్ గేమ్'. ఈ కొరియన్ వెబ్‌సిరీస్ ఇప్పటికే రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హ్వాంగ్ డాగ్ హ్యూక్ దర్శకత్వంలో వచ్చిన ఈ సిరీస్‌లో డబ్బు కోసం సగటు మనిషి ఆడే నెత్తుటి ఆటను ఆసక్తికరంగా చూపించారు. ఆటలు ఆడేందుకు వచ్చిన 456 మందిని ఒక దీవికి తీసుకువెళ్లి అక్కడ చిన్నపిల్లలు ఆడుకునే రెడ్‌లైట్, గ్రీన్‌లైట్, టగ్ ఆఫ్ వార్ వంటి ఆటలు నిర్వహిస్తారు. అక్కడ వారంతా ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారు అనే కథాంశం ఆధారంగా వచ్చిన ఈ సిరీస్‌లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అయితే, ఈ 'స్క్విడ్ గేమ్'లో ఇండియన్ సినీ స్టార్స్ పాల్గొంటే ఎలా ఉంటుంది..? ఈ ఆలోచనతోనే ఓ నెటిజన్ ఏఐ సాయంతో వీడియోను రూపొందించారు. స్టార్ నటులు జూనియర్ ఎన్టీఆర్, దళపతి విజయ్, రజినీకాంత్, కమల్‌హాసన్, చిరంజీవి, మోహన్‌లాల్, నాగార్జున, నాగచైతన్య, సూర్య, మహేశ్‌బాబు, ధనుష్, విజయ్ దేవరకొండ, అల్లు అర్జున్, ప్రభాస్, పవన్ కల్యాణ్, అజిత్, యష్, రామ్ చరణ్, దుల్కర్ సల్మాన్, రానా, హృతిక్ రోషణ్ తదితరులు 'స్క్విడ్ గేమ్' సిరీస్‌లోని ఆటగాళ్ల దుస్తుల్లో కనిపించారు. 'స్క్విడ్ గేమ్ ఇండియా' పేరుతో విడుదల చేసిన ఈ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

# థాయ్‌లాండ్‌కు పయనమైన రజనీకాంత్



తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రస్తుతం లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో కూలీ సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఈ మూవీ చిత్రీకరణ దశలో ఉంది. కాగా మంగళవారం తలైవా థాయ్‌లాండ్‌కు పయనమయ్యాడు. ఈ సందర్భంగా చెన్నై ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడారు తలైవా. కూలీ 70 శాతం షూటింగ్ పూర్తయిందని చెప్పాడు. అంతేకాదు నెక్ట్స్ షెడ్యూల్ జనవరి 13న మొదలు కానుందని.. ఈ షెడ్యూల్ జనవరి 28 వరకు కొనసాగుతుందన్నాడు. ఇటీవల రాజస్థాన్‌లోని జైపూర్ షూట్ షెడ్యూల్‌లో భాగంగా సంబార్ లేక్ ప్రాంతంలోఅమీర్ ఖాన్, ఉపేంద్ర, తలైవా, రెబా మోనికా జాన్ అండ్ టీంపై వచ్చే సన్నివేశాలను చిత్రీకరించినట్టు వార్తలు వచ్చాయని తెలిసిందే. కూలీ చిత్రాన్ని 2025 మే 1న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. గోల్డ్ అక్రమ రవాణా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీలో సత్యరాజ్, మహేంద్రన్, అక్కినేని నాగార్జున, మంజుమ్మెల్ బాయ్స్ ఫేం సౌబిన్ షాహిర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ తెరకెక్కిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

# ఈఫిల్ టవర్ ముందు అడివిశేష్



టాలీవుడ్ యాక్టర్ అడివిశేష్ కెరీర్‌లో వన్ ఆఫ్ ది బెస్ట్ ల్యాండ్ మార్క్ సినిమాగా నిలిచిపోతుంది టైటిల్ రోల్ పోషించిన గూడచారి. ఈ ఫ్రాంఛైజీలో జీ2 కూడా వస్తుందని తెలిసిందే. మేజర్ చిత్రానికి ఎడిటర్‌గా పనిచేసిన వినయ్ కుమార్ సిరిగినీడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. కాగా గన్స్ యాక్షన్ మూడ్‌లోకి దిగితే.. అంటూ ఇప్పటికే సినిమాపై సూపర్ క్యూరియాసిటీ పెంచేస్తున్నాడు. తాజాగా ఈ చిత్ర టీంలోకి బేబిజాన్ నటి వామికా గబ్బి వచ్చేసింది. మిషన్‌లో భాగంగా సూట్‌లో ఉన్న అడివిశేష్, వామికా ఈఫిల్ టవర్ ముందు కనిపిస్తుండటం తాజా లుక్‌లో చూడొచ్చు. మేకర్స్ ఇప్పటికే లాంచ్ చేసిన జీ2 ఫస్ట్ లుక్ పోస్టర్‌తోపాటు ప్రీ వెర్షన్ అనౌన్స్ మెంట్ వీడియో సినిమాపై అంచనాలు పెంచుతోంది. అడివి శేష్‌ను సీక్వెల్‌లో స్టైలిష్ యాక్షన్ అవతార్‌లో చూపిపించబోతున్నట్టు ప్రీ వెర్షన్ అనౌన్స్ మెంట్ వీడియోతో హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్. ఈ మూవీని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీకి శ్రీచరణ్ పాకాల

# గురక ప్రభావం గుండె, ఊపిరితిత్తులపై ఉంటుందా..? ఇవీ నిజాలు..



గురక.. మనలో చాలా మంది ఇళ్లలో ఎదుర్కొంటున్న సాధారణ సమస్య. ఇది బాధితుడితోపాటు ఇంట్లో వాళ్లను కూడా ఇబ్బంది పెడుతుంది. గురక సాధారణమని అనుకుంటే పొరపాటు. అంగిలిలోని మెత్తని భాగం ప్రకంపనలకు లోనైన సందర్భాల్లో వచ్చే శద్ధమే గురక. కొందరిలో గాలి మార్గాలను పూర్తిగా లేదా పాక్షికంగా మూసివేసి నిద్రలేమికి కారణంగా మారుతుంది. ఫలితంగా ఎన్నో ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

మనం గురక పెడుతున్నట్లు మనకు తెలియదు. కానీ, మన పక్కన నిద్రించే వారికి నరకం చూపిస్తుంది. ప్రతి ముగ్గురు పురుషుల్లో ఒకరు, ప్రతి నలుగురు స్త్రీలలో ఒకరు రాత్రి గురక పెడుతున్నట్లు నేషనల్ స్లీప్ ఫౌండేషన్ గణాంకాలు చెప్తున్నాయి. అప్పుడప్పుడు గురక వస్తే ఏం ఇబ్బంది లేదు కానీ, గురక దీర్ఘకాలం పాటు కొనసాగితే మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చాలా కాలం పాటు గురక వేధిస్తున్నట్లయితే ఆరోగ్య సమస్యలు రాకముందే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవడం ఉత్తమం.

దీర్ఘకాలిక గురక అబ్ట్రక్టివ్ స్లీప్ అప్నియా అనే దీర్ఘకాలిక స్థితికి సంకేతం. ఇది శరీరంలోని ఇతర భాగాలపై ముఖ్యంగా ఊపిరితిత్తులు, గుండెపై దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతుంది. గురక పెట్టే వారందరికీ స్లీప్ అప్నియా ఉండకపోవచ్చు. అయితే ఎవరైనా ఉక్కిరిబిక్కిరి చేయడం, గురక, నిద్రలేమి, పగటిపూట నిద్రపోవడం వంటి లక్షణాలు ఉన్నవారు వైద్యులను సంప్రదించడం మంచిది. స్లీప్ అప్నియాతో దీర్ఘకాలిక గురక ఊపిరితిత్తులు, గుండె, మెదడు వంటి ముఖ్యమైన అవయవాలకు ఆక్సిజన్ సరఫరా తక్కువగా ఉంటుంది. ఇది కంట్రోల్ చేయలేనంత రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలతో పాటు పనిలో ఆసక్తి లేకపోవడం, రోడ్డు దాటడంలో బద్ధకం వంటి వాటితో ప్రమాదాలకు దారితీస్తుంది.

గుండెపై ప్రభావం

పల్మనరీ ఆర్టరీ హైపర్‌టెన్షన్, హై హార్ట్ ఫెయిల్యూర్, స్ట్రోక్, కార్డియాక్ అరెస్ట్, హార్ట్ బీట్ సక్రమంగా లేకపోవడం వంటి తీవ్రమైన పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్నది. స్థూలకాయం, క్రమంగా లేని నిద్ర అలవాట్లు, దవడల్లో అసాధారణత, పిల్లలలో దీర్ఘకాలిక అడినాయిడ్స్, టాన్సిలిటిస్ ఈ వ్యాధికి ముఖ్యమైన కారణ కారకాలు. ఎగువ శ్వాసనాళంలో గాలి మార్గాలు ఇరుకైనప్పుడు వచ్చే గురక కారణంగా ఊబకాయం సమస్యను తెచ్చిపెట్టడంతోపాటు గుండె, ఊపిరితిత్తులపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది.

నిద్ర సంబంధ సమస్యలు

గురక పెట్టినప్పుడు ఆక్సిజన్ స్థాయిలు తగ్గడం, నిద్ర నాణ్యత దెబ్బతినే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇది తీవ్రంగా ఉన్న వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఫలితంగా ఆకస్మిక ఉద్రేకం ఏర్పడటంతోపాటు నిద్రకు భంగం కలుగుతుంది. తరచుగా అలసిపోవడం, నీరసంగా మారడం, నిద్రతో ఉన్నట్లు కనిపిస్తారు. ఈ సమస్య వారి వృత్తిపరమైన, వ్యక్తిగత జీవితానికి ఆటంకాలు కలిగిస్తుంది.

గురకను ఇలా నియంత్రించుకుందాం..

గురక నుంచి బయటపడలేరనేది ఒక అపోహ మాత్రమే. సరైన క్లినికల్ విధానం, చికిత్సతో గురకను దూరం చేయడం సాధ్యమవుతుంది. గురక సమస్యకు పరిష్కారంగా కంటిన్యూయస్ పాజిటివ్ ఎయిర్‌వే ప్రెజర్ పరికరాలు, బిల్వెల్ పాజిటివ్ ఎయిర్‌వే ప్రెజర్ పరికరాల వంటివి దొరుకుతున్నాయి. ఇవి మనం నిద్రిస్తున్నప్పుడు బాగా ఊపిరి పీల్చుకోవడంలో సాయపడుతుంది. గురకను తగ్గిస్తుంది. గురక కారణాల ఆధారంగా కొందరికి శస్త్రచికిత్స కూడా అవసరమవుతుంది. అలాగే, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, సరైన భంగిమలను పాటించడం, అలెర్జీలకు చికిత్స తీసుకోవడం వల్ల నిద్ర నాణ్యతను పెంచుకుని గురక సమస్యను తగ్గించుకోవచ్చు.

# మిలింద్ సొమన్ ఫిట్‌నెస్ సీక్రెట్స్ ఇవే..!

ముంబై : 57 ఏండ్ల వయసులోనూ కండలు తీరిన దేహం మెయింటెన్ చేసే మిలింద్ సొమన్ తరచూ తన వర్కవుట్ల వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ ఫ్యాన్స్‌కు రోల్‌మోడల్‌గా నిలుస్తుంటారు. యోగ నుంచి కార్డియో, హై ఇంటెన్సిటీ స్ట్రెంథ్ ట్రైనింగ్ వంటి వివిధ వర్కవుట్స్‌తోనే తాను ఈ వయసులోనూ దృఢంగా ఉండగలుగుతున్నానని ఆయన చెబుతుంటారు.



సుదీర్ఘ మారథాన్‌ల నుంచి పర్వత శ్రేణులు, విదేశాల్లోని పర్యాటక ప్రాంతాలు, బీచ్‌లను చుట్టి వస్తూ పనిలోపనిగా ఫిట్‌నెస్ ప్రోగ్రాంనూ కొనసాగిస్తుంటారు. ఇక ఇటీవలి ఇన్‌స్టాగ్రాం పోస్ట్‌లో మిలింద్ సొమన్ పులప్స్ చేస్తూ కనిపించారు. మార్నింగ్ వర్కవుట్‌లో 15 పుల్‌అప్స్ చేస్తున్న వీడియోను ఆయన ఇన్‌స్టా రీల్ వీడియో షేర్ చేశారు.

ఫిట్‌నెస్ గేమ్‌లో టాప్‌లో ఉండాలంటే ఏం చేయాలని కొన్ని టిప్స్ కూడా మిలింద్ సొమన్ క్యాప్షన్‌లో ఇచ్చారు. ఫిట్‌నెస్ అంటే గంటల కొద్దీ వర్కవుట్లు చేయాలని అనుకుంటారు కానీ, రకరకాల వర్కవుట్లతో రోజుకు 15 నుంచి 20 నిమిషాల పాటు వ్యాయాయం సరిపోతుందని సొమన్ క్యాప్షన్‌లో రాసుకొచ్చారు.

# మైదాను అతిగా తింటున్నారా.. అయితే ప్రమాదం పొంచి ఉన్నట్టే..

చాలా మందికి చపాతి, పరోట, రుమాలీ రోటి, తందూరీ రోటి వంటి వాటిని చూడగానే నోరూరుతుంది. గోధుమ పిండితో తయారు చేసినవే అయితే వాటిని తినడంవల్ల ఆరోగ్యానికి వచ్చే ముప్పేమీ లేదు. కానీ, అవి మైదాతో తయారైనవి అయితే మాత్రం కోరికోరి ప్రమాదాన్ని తెచ్చుకున్నట్టేనని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మైదాతో అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని చెబుతున్నారు. మైదా పిండి మెత్తదనం, తెల్లదనం కోసం అధికంగా పాలిష్ చేస్తారు. క్లోరైడ్ గ్యాస్, బెంజయిల్ పెరాక్సైడ్ లాంటి రసాయనాలను మిక్స్ చేస్తారు. అంతేగాక మైదాలో అల్లోక్సాన్ అనే విషపూరితమైన రసాయనం కూడా ఉంటుంది. ఈ రసాయనాలు ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయంటున్నారు నిపుణులు%ౌ

మనం తిన్న ఆహారం జీర్ణం కావాలంటే అందులో తప్పనిసరిగా ఎంతోకొంత పీచు పదార్థం ఉండాలి. కానీ మైదాలో పీచుపదార్థం జీరో. కాబట్టి మైదా త్వరగా జీర్ణం కాకుండా పేగుల్లో పేరుకుపోతుంది. దీనివల్ల పేగుల్లో పుండ్లు పడే ప్రమాదం ఉన్నది. అవి ముదిరితే క్యాన్సర్ లాంటి తీవ్రమైన ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తాయి.

మైదా పిండిని గోడలకు పోస్టర్లను అంటించడానికి ఎక్కువగా ఉపయోగిస్తారు. ఎందుకంటే మైదాపిండిలోని జిగురు పోస్టర్లు గోడకు గట్టిగా అంటుకునేలా చేస్తుంది. మైదాతో చేసిన పదార్థాలను తిన్నప్పుడు అవి మన పేగులకు కూడా అలాగే అతుక్కుపోతాయి. దాంతో వాటిలో క్రిములు ఉత్పత్తై ఇన్ఫెక్షన్‌లను కలుగజేస్తాయి.

మైదా పిండివల్ల కిడ్నీల్లో రాళ్లు కూడా ఏర్పడతాయి. గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉన్నది. మహిళలల్లో బ్రెస్ట్ సంబంధ సమస్యలు ఉత్పన్నమవుతాయి.

# పొట్ట స్లిమ్‌గా ఉండాలంటే ఈ ఐదింటిని పక్కన పెట్టాల్సిందే..

సాధారణంగా అందరూ స్లిమ్‌గా, ట్రిమ్‌గా ఉండాలని కోరుకుంటారు. యువతలో అయితే ఈ కోరిక మరీ ఎక్కువ. అందుకే పొట్ట తగ్గించుకోవడం కోసం రోజూ వాకింగ్, జాగింగ్, రన్నింగ్ అంటూ ఎన్నో కసరత్తులు చేస్తుంటారు. ఎంత చేసినా పొట్ట తగ్గడం లేదంటూ నిరాశ చెందుతుంటారు. వాస్తవానికి పొట్ట తగ్గించుకోవాలంటే వ్యాయామం ఒక్కటే సరిపోదు. వ్యాయామంతోపాటు కొన్ని ఆహారపు అలవాట్లు కూడా మార్చుకోవాలి. మరి మార్చుకోవాల్సిన ఆ అలవాట్లు ఏమిటో తెలుసుకుందామా..?



ఫాస్ట్ ఫుడ్ అనే మాట వింటే చాలు ఎవరికైనా నోరూరుతుంది. కానీ ఈ ఫాస్ట్ ఫుడ్‌కు ఊబకాయానికి అవినాభావ సంబంధం ఉంటుంది. ఫాస్ట్‌ఫుడ్ తింటే పొట్ట పెరుగుతుంది. అందువల్ల పొట్ట తగ్గాలంటే ఫాస్ట్‌ఫుడ్‌ను పక్కన పెట్టాల్సిందే.

2. చక్కెర

నోటికి తియ్యగా ఉండే ఈ పదార్థం మన శరీరానికి మాత్రం తీవ్ర హాని చేస్తుంది. ఒక కప్పు చక్కెరలో 773 క్యాలరీస్ ఉంటాయి. దీనివల్ల ఊబకాయం రావడమే కాకుండా మధుమేహం వంటి ఇతర రోగాలు కూడా అంటుకుంటాయి. కాబట్టి చక్కెరను కూడా దూరం పెట్టాల్సిందే.

3. ఆలుగడ్డ

అందరికి బాగా నచ్చే కూరగాయ ఈ ఆలుగడ్డ. కానీ ఊబకాయులకు ఈ ఆలుగడ్డ మంచిది కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే ఒక ఎగ్ సైజు ఆలుగడ్డలో 163 క్యాలరీలు ఉంటాయట. ఈ క్యాలరీలు పొట్ట పెరుగడానికి కారణం అవుతాయట.

4. కూల్‌డ్రింక్స్

కూల్‌డ్రింక్స్ కూడా ఊబకాయం, లావు పొట్టకు కారణమవుతాయి. 12 ఔన్సుల డ్రింక్‌లో దాదాపు 140 క్యాలరీస్ ఉంటాయి. అందువల్ల నాజూకు పొట్ట కోరుకునే వాళ్లు కూల్ డ్రింక్స్‌కు ఎంత దూరం ఉంటే అంత మంచింది.

5. మరికొన్ని పదార్థాలు

పైన పేర్కొన్న వాటితోపాటు బేకరీ ఫుడ్స్, వేపుళ్లు, స్వీట్‌లు, చాక్‌లెట్‌లు, దుంపలు ఊబకాయానికి, లావు పొట్టకు కారణం అవుతాయి. అందువల్ల వాటిని కూడా దూరం పెట్టాలి. ఫైబర్ ఎక్కువగా ఉండే పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.

# పళ్లు తోమడంపై అపోహలు- నిజాలు.. తెలుసుకోండి..!

ఉదయం నిద్ర లేవగానే మనం పళ్లు తోముకుంటాం. రోజంతా దంతాలతోపాటు నోరు ఆరోగ్యంగా ఉండటానికి సాయపడుతుంది. బ్రషింగ్ చేయడం వల్ల మనకు సంపూర్ణ ఆరోగ్యం అందుతుంది. దంతాలను సక్రమంగా క్లీన్ చేసుకోని వారిలో చిగుళ్ల సమస్యలతో పాటు గుండె జబ్బులు, డయాబెటిస్, గుండె జబ్బులు వంటి దీర్ఘకాలిక వ్యాధులు కనిపిస్తుంటాయి. అందుకే నోటి ఆరోగ్యమే మన ఆరోగ్యమని వైద్యులు చెప్తుంటారు.



వళ్లు తోముకోవడంలో మనం సాధారణంగా బ్రష్‌పై పేస్ట్ పెట్టుకుని దంతధావనం చేసి ఆ తర్వాత నాలుక శుభ్రపరుచుకుంటాం. దాంతో వళ్లు తోముకోవడం పూర్తయినట్లుగా భావిస్తుంటాం. వళ్లను శుభ్రంగా తోముకోవడం వలన నోటిలోని బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మక్రిములను కడుపులోకి పోకుండా అడ్డుకోవచ్చు. వళ్లు తోముకోవడంపై మనలో చాలా మంది ఎన్నో అపోహలు ఉన్నాయి. వీటిని నివృత్తి చేసుకోవడం ద్వారా నోటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

హార్డ్ బ్రష్ వాడాలా..?

దంతాలను బాగా శుభ్రం చేసుకోవడానికి హార్డ్ బ్రష్ ముఖ్యమైనది. మరీ హార్డ్ కాకుండా.. మరీ మృధువైనవి కాకుండా మధ్యస్తంగా ఉండే బ్రష్‌లను వాడాలి. దంతాలను ఎక్కువసేపు తోమడం సరికాదు. దీనివల్ల పళ్లపై ఎనామిల్ తొలిగిపోయి బలహీనపడి దంతాల సున్నితత్తవం పెరుగుతుంది. అందుకని రెండు నిమిషాలపాటు బ్రష్ చేసుకోవడం ఉత్తమం. తద్వారా టూత్‌పేస్ట్‌లోని ఫ్లోరైడ్‌తో పళ్లు చక్కగా శుభ్రమవుతాయి. పళ్లు మరీ మిలమిలలాడాలంటే హార్డ్ బ్రష్, ఎక్కువ సేపు తోమడం మాని.. దంతవైద్యుడ్ని సంప్రదించి చికిత్స తీసుకోవడం చాలా మంచిది.

హార్డ్ బ్రిజల్స్ మంచివేనా..?

బ్రష్ హార్డ్ బ్రిజల్స్ ఉన్న బ్రష్‌లను వాడితే పళ్లు మెరుస్తాయని చాలా మంది భావిస్తుంటారు. అయితే, కఠినమైన బ్రిజల్స్ దంతాలను, చిగుళ్లను గాయపరుస్తాయి. రక్తం కారేలా చేస్తాయి. దంతాలపై ఉండే ఎనామిల్ పోయేలా చేసి దుష్ప్రభావాలు కలుగజేస్తుంది. అందుకని మరీ హార్డ్.. మరీ మృధువైనవి కాకుండా మధ్యస్థంగా ఉండే బ్రిజల్స్ ఉండే బ్రష్‌లతో పళ్లు తోముకోవడం చాలా మంచిది.

ఒక్కసారే తోముకోవాలా..?

బద్ధకం, సమయం లేకపోవడం వల్ల చాలా మంది రోజులో ఒక్కసారే పళ్లు తోముకోవడంతో సరిపెట్టుకుంటారు. నిజానికి రోజులో కనీసం రెండుసార్లు దంతధావనంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయంటున్నారు నిపుణులు. ఉదయం నిద్ర లేచిన తర్వాత, రాత్రి పడుకునే ముందు పళ్లు తోమడం వల్ల వళ్ల మధ్య ఇరుక్కునే పాచీని పారద్రోలవచ్చు. లేనట్లయితే, దంతాలు పుచ్చిపోయి, చిగుళ్లు పాడైపోయి వివిధ సమస్యలు వస్తాయి. అలాగే ఫ్లాసింగ్ కూడా చేసుకోవడం చాలా మంచిది.

తిన్న తర్వాత తోముకోవచ్చా..?

చాలా మందిలో ఆహారం తీసుకున్న తర్వాత దంతాలను శుభ్రపరుచుకుంటారు. నోటిలోని లాలాజలం మనం తిన్న ఆహారాన్ని జీర్ణం చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. అలాగే, నోటిలోని బ్యాక్టీరియా ఇతర సూక్ష్మక్రిముల నుంచి రక్షిస్తుంది. అలాంటిది ఆహారం తీసుకున్న తర్వాత పళ్లు తోమడం వల్ల ఈ ప్రభావం తగ్గిపోతుంది. అందుకని భోజనం చేసిన తర్వాత కనీసం 30 నిమిషాలు వేచి ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

చిగుళ్ల రక్తం హార్డ్ బ్రష్‌తోనే ..?

గట్టిగా బ్రష్ చేయడం వల్ల చిగుళ్లు దెబ్బతింటాయి. కొన్ని సందర్భాల్లో దీనికి ఇతర సమస్యలు జోడవుతాయి. చిగుళ్లలో రక్తస్రావం చిగుళ్ల వాపు, చిగుళ్ల వ్యాధులకు సంకేతంగా నిలుస్తుంది. హార్డ్ బ్రష్‌తో ఇష్టం వచ్చినట్లుగా పళ్లపై రుద్దితే అనవసరంగా రక్తం కారుతుంది. ఇది చిగుళ్లను నాశనం చేస్తుంది. అందుకని చిగుళ్లను వేళ్లతోనే మర్ధనం చేయాలి. చిగుళ్ల నుంచి రక్తం కారుతుందంటే చిగుళ్ల వ్యాధి తొలిదశగా భావించాలి. ఇది మరింత తీవ్ర కాకముందే వైద్యుడ్ని సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

ఏడాదికోసారి బ్రష్ మార్చాలా..?

మనలో చాలా మంది బ్రష్‌లను ఏండ్లుగా వాడుతుంటారు. అయితే, ప్రతి 3 నెలలకు ఒకసారి బ్రష్‌లను మార్చడం చాలా మంచిదని దంత వైద్యులు సూచిస్తున్నారు. బ్రిజల్స్ వంగిపోయి కనిపించగానే బ్రష్ మార్చాలని, అరిగిపోయిన బ్రిజల్స్ పళ్లపై ఫ్లేక్స్ తొలగించడంలో సహాయపడవు. అలాగే, జ్వరం నుంచి కోలుకున్న తర్వాత కూడా బ్రష్ మార్చడం శ్రేయస్కరం.

బ్రష్ నిండా పేస్టు పెట్టాల్సిందేనా..?

చాలా మంది బ్రష్ నిండా పెస్ట్ పెట్టుకుని బ్రషింగ్ చేస్తుంటారు. ఇలా చేయడం వల్ల దంతాలు శుభ్రం సంగతి అటుంచితే, పేస్ట్ వేస్టవుతుంది. నోట్లో పెట్టి రుద్ది ఉమియగానే నోట్లో ఉన్న పేస్ట్ అంతా వెళ్లిపోతుంది. అలాకాకుండా పెద్దవాళ్లు బటానీ గింజ పరిణామంలో, చిన్న పిల్లలకు బియ్యపు గింజంత మాత్రమే పేస్టు వేసుకుని పళ్లు తోముకోవడం మంచిది.

మౌత్‌వాష్ సరిపోతుంది కాదా..?

బ్రష్ చేసుకున్న తర్వాత మౌత్‌వాష్‌తో పుక్కిలిస్తే నోటి దుర్వాసనతోపాటు దంతాల మధ్య ఇరుక్కునే పదార్థాల అవశేషాలు బయటకు పంపవచ్చు. నోటిలో ఉండే క్రిములను దూరం చేసుకోవచ్చు. అలాకాకుండా బ్రష్ చేయకుండా మౌత్‌వాష్ వాడటం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. అందుకని బ్రష్ చేసిన తర్వాతనే మౌత్‌వాష్ నోట్లో పోసుకుని గార్గ్‌లింగ్ చేయాలి.

# కొత్తిమీరతో థైరాయిడ్ సమస్యలకు చెక్!

న్యూఢిల్లీ : కొత్తిమీర లేని దేశీ వంటకాలను ఊహించలేం. ఆహార పదార్థాల్లో రుచిని పెంచే కొత్తిమీరతో పలు ఆరోగ్య ప్రయోజనాలున్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కొత్తిమీర రక్తంలో చక్కెర నిల్వలను నియంత్రించి మధుమేహ ముప్పును నివారిస్తుంది.థైరాయిడ్ వ్యాధుల నుంచి కూడా కొత్తిమీర ఆకులు, విత్తనాలు ఉపశమనం కల్పిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఎండోక్రైన్ గ్రంధి థైరాయిడ్ హార్మోన్ల స్థితిగతులు, జీవక్రియలను నియంత్రిస్తుంది. వ

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy